ఓమ్.

భక్తనామదేవ

గ్రంథకర్త

మహావాది వేంకటరత్నము.



ప్రకాశకులు

పన్నాల సత్యనారాయణ,

తెనాలి.

౧౯౩౭

[ప్రథమ]

[రు. ౧-౩-౦ లు.

౧ వ కూర్పు
ప్రతులు ౧౦౦౦.

లలిత ముద్రాక్షరశాల,
తెనాలి.

ఓమ్.

కించిత్ప్రాస్తావికము.

కావ్యములలో దృశ్యముత్తమమనుట నిర్వివాదాంశము. పరమ భాగవతోత్తముండును భక్తవిజయమున కలంకారభూతుండును నగు నామదేవుచారిత్రమే యిందలి కథావస్తువు. ఈభక్తాగ్రేసరుని పవిత్రజీవితమే యీ బాలకవిని నాటకనిర్మాణమునకుఁ బ్రేరేపించినది. ఇందు శాంతమే ప్రధానరసము. శృంగారవీరములకే ప్రాచీనులు నాటకములయందుఁ బ్రాధాన్యమంగీకరించిరి. కాని యంతమాత్రమున ప్రాచీన సంప్రదాయమునకు విరుద్ధమని చెప్పనొప్పదు. ప్రబోధచంద్రోదయాదిగప్రధాననాటకములే యిందుకుఁ దార్కాణము. అర్వాచీన సంప్రదాయానుముగ నిందుఁ బ్రస్తావనవిడువఁబడినది. ప్రతియంకమును రంగములుగ విభజింపఁబడుటవలన నిది ప్రదర్శనానుకూలముగఁ గూడనున్నది. పాత్రభావాభివ్యక్తియు లేకపోవుట రసోద్దీపనమునకుఁగూడ నవకాశముగలదు. ఇందుఁ గథానాయకుఁడే ప్రధానపాత్ర ఇతని శుభగుణప్రఖ్యాపనమునకే యితరపాత్రలకిందుఁ బ్రవేశముగలదు. ఇందు దీర్ఘములగు స్వగతములును ఆకాశభాషితములును లేక, విచ్ఛిన్న కథాంశములు పాత్రల యన్యోన్య సంభాషణముచేతనే సూచింపఁబడినవి. మహాభక్తుని వృత్తాంతముగల నాటకము రమణీయమును సాధుజనసంసేవ్యమునగుచున్నది. గ్రంథకర్త యింకను విద్యార్థిదశయందుండుటచేఁ బ్రాజ్ఞజన సంవేద్యములగు స్ఖాలిత్యము లక్కడక్కడ నున్నను విశాలహృదయులగు సహృదయులు క్షమించి యీ బాలకవికి సర్వవిధములఁ బ్రోత్సాహము నొసంగుదురుగాక. కవికి ననర్గళమగు కవితాధోరణిగలదనుట యతిశయోక్తిగానేరదు. ఇందలి గద్యపద్యముల మాధుర్యము సహృదయైకవేద్యమగుటచేఁ బాఠకులే దాని నాస్వాదింపనర్హులు.

గుంటూరు,
౨౧-౧౧-౨౭.

కొమాండూరు కృష్ణమాచార్యులు,
గుంటూరు కాలేజి తెలుగు పండితులు.

ఓమ్.

చిన్నమనవి.

సహృదయులగు నో కవిసోదరులారా! నాటకరచనమునందు నేను గేవలము క్రొత్తవాఁడను. ఈ నాటకనిర్మాణము తొలిప్రయత్నమగుటవలనను నేను విద్యార్థిదశయందుండుటవలనను కథాసందర్భమున నెచ్చోట నేరసమును బొందుపఱుపవలయుననో పాత్రల నెట్టివిధిఁ బోషింపవలయుననో యౌచిత్యములనెట్లు గమనింపవలయుననో మున్నగు విషయములు నాకంతగా ననుభవములై యుండినవి కావు. ఇందలి కథాసంవిధానమునందును రంగనిర్మాణమునందును పాత్రప్రవేశమునందును రంగవిభాగమునందును మొదలగు విషయములన్నిటియందును నటశేఖరులగు శ్రీయుత తోట వేంకటాచలదాసుగారు చేదోడుగానుండుటవలన దీనిని రచియింపఁ గడంగితిని. నా తెలిసినంతవఱకుఁ బ్రదర్శనావసరములగు విషయముల నవలంబించితిని. ఈ కథ 'సినీమా' యందు పెక్కుమారులు ప్రదర్శింపఁబడియున్నను నేనద్దానిఁదిలకించియున్నను కథావిధానమున దాని ననుసరింపక మూలమునే యనుసరించి నాటకమునకుఁ దగునటుల నాయాచోటుల మూలమును మార్చియు మూలమున లేని కొన్నియుపపాత్రలను నిందుఁ బ్రవేశపెట్టియు కొన్నిచోటులఁ గథను పెంచియు దీనిని సమకూర్చితిని. అల్పజ్ఞానచేతస్కుండనగు నాయట్టివాని కవిత్వమునందుఁ దప్పులుండకమానవు. కాని యట్టివాని నన్నిటిని బరిగణింపక నన్ను మన్నింపఁ గోరుచుంటిని.

సంగీతశాస్త్రజ్ఞానము నాకు లేనివాఁడనగుటవలన నిందుదహరించిన ప్రకారమనుబంధములఁ గూర్పఁజాలనైతిని. కాని నటులు తమ యిచ్చవచ్చినటులఁ దగినసందర్భము గమనింపక యనుబంధముల పాడుటచేఁ గథావిధానమును మఱుగుపఱచుచుండుటవలన యీ [illegible] ములయందే యనుబంధముల వాడుకొనుటల నాటకమున వానిని సూచించియుంటిని. నేను గాయకుఁడను గాకున్నను సంగీతకళాభిజ్ఞులవలనఁ గీర్తనల వ్రాయించియున్నను స్వరయుక్తములు గానిచోటుల నట్యాని సహజముగ మనోజ్ఞములగునని యీ నందముగాఁ జేసిన కృషివ్యర్థమగునని యెంచి దలంచి యాయుద్యమము మానుకొంటిని. నటులట్టివాని సవరించి పాడఁగలరని నా యభిప్రాయము.

నేను వ్రాసిన యీ నాటకమును [illegible] సవరించి యిచ్చిన శ్రీయుత శ్రీమాన్ శతావధాని నరసింహాచార్యులుగారికిని సవిమర్శకంబుగఁ దిలకించి పీఠికఁ బ్రోత్సాహకముగ వ్రాసియిచ్చిన శ్రీయుత కోమాండూరు కృష్ణమాచార్యులుగారికిని ద్రవ్యసహాయము నొసఁగి యీ నా గ్రంథమును బయలుపఱచిన మన్మిత్రులు శ్రీయుత పన్నాల సత్యనారాయణగారికిని గ్రంథనిర్మాణమునకాదియందున్న విషయముల నాకుఁ దోడుపడి తగిన ప్రోత్సాహము నొసంగిన శ్రీయుత తోట వేంకటాచలదాసుగారికిని నేనెంతయుఁ గృతజ్ఞుఁడను.

ఇట్లు,
గ్రంథకర్త.

కథాసంగ్రహము.

౧ కొందఱు బాలురు గోలికాయలనాడుచుఁ దగవులాడుకొనుచుండ నా మార్గమున నామదేవుఁడుచు నా బాలురలదగ్గఱఁ గాంచి వారికడఁ జేరి శాంతిగ పథరితము లగు బలుపలుచే వారలను నమ్ములఁ బాండురంగని భజనలయందు లగ్నమగునట్లుఁ జేసి వారలఁగూడుకొని యాలయంబునకరుగును. కొంతతడవు రంగనిఁ బూజించి తిరిగి యింటికివచ్చును. మరునాడు తనతండ్రి యాజ్ఞానుసారముగ రంగనికి నైవేద్యము దీసికొని యాలయంబున కరిగి బాలుండును వంటు గొప్ప భక్తుండును నగుట వలన నాహారంబు నారగింపుమని రంగని ననేకవిధముల బ్రతిమాలి యాహారంబు నారగింపుజేసి తన తల్లికిఁ దినయందుఁ గల్గిన భిన్నాభిప్రాయమును దొలఁగించుటకై రంగనిచేతఁ బాలుద్రావించి గృహంబున కరుగును.

౨. నామదేవుఁ గురువుని సేవింప నిచ్ఛగలవాఁడై యడవులంబట్టి పోవుచుండ మార్గమధ్యంబునఁ బాండురంగఁడు తన భక్తుని భావమును బరీక్షించుటకై లక్ష్మీసహాయముగఁ గిరాతరూపముల ధరించి జీవహింస సేయుచుండ నామదేవుఁ డాఘోరకృత్యమును గాంచి సహింపఁజాలక కిరాతున కన్నిరోజుల నీతుల గఱపును. తుదను జీవహింస సేయరాదని కిరాతుని నిరోధింప నాతఁడును నామదేవుఁ జంపునాలిక తేఁ గత్తిచేఁ గొనుచుండు మూర్ఛనొందినపిదపఁ దన నిజవృత్తాంతమును సగురుని బాసలు దెల్పి యదృశ్యుండగును. అంత నామదేవుఁ కొంతవడికి మూర్ఛనుండి లేచి రంగనిలీలల కంతరంగమున సంతసించుచు గొందుచు గురునిఁ గాంచును. అతఁడును నామదేవునకు పాండురంగభక్తియుక్తుఁడై నామదేవు నకు దీక్షనొసంగి పవిత్రుని జేయుచు నుండును. అద్దానికి నామదేవుఁ డాతని పాదపద్మముల నిలచి యాతనిచేఁ గామమోహములఁ దొలఁగును.

3. నామదేవుఁ గురూపదేశమునంది [illegible] మార్గమందు [illegible] యాయి సుగుణసంపదను మెచ్చుకొని ప్రేమించును. ఆమెయును నీతని ప్రేమించును గాని యామె తండ్రి నిరుపేదయగు నామదేవునకుఁ గన్నను గాఁగూడదని [illegible] గాథా బాయి తండ్రి కనేకవిధముల నీతులను దెల్పి [illegible] యుండును.

౪ నామదేవు భార్య తన నాథునితో గృహంబునఁ గల కష్టములను దెల్పి కుటుంబపోషణమునకై వ్యాపారమైన నుద్యోగమైన జేయుమని తెల్ప నాతఁడుఁ

గల కలుషములను గూర్చి నొక్కి వక్కాణించి తుదను వ్యాపారము సలుప నిశ్చయించు కొనును. మఱునాడు సేవపనితో గుడ్డలవ్యాపారమునకై లక్ష్మీపురమున కరిగి యందుఁ దినుటకుఁ దొడుగుటకు లేక మలమల మాడుచు విలపించుచున్న నిరుపేదలఁ గాంచి కరుణాస్వాంతుఁడగు నామదేవు తనయొద్దఁగల వస్త్రములను ద్రవ్యమును అంతయు వారల కొసంగి తాను రంగని సేవ కరుగును.

౪. నామదేవు భార్యాసహితుఁడై తీర్థయాత్రలకరుగుచు నొకసత్రమున బస చేసి నాఁడేకాదశియగుటచేతను తానేకాదశీ వ్రతదీక్షఁగలవాఁడగుటఁజేసియు నిరాహారుఁడైయుండుతఱిఁ బాండురంగఁడాతని వ్రతదీక్ష యెట్టిదో కనుఁగొనఁ దలంచి యొక వృద్ధుని వాతనికడకంపును. అతఁడును గడగడ వడఁకుచు అన్నమో అన్నమో యని విలపించుచు నామదేవు చెంతి కరుగును. నామదేవాతని స్థితిని గాంచి హరివాసరమున నన్నమిడుట సర్వవిరుద్ధముగుటఁ జేసి కందమూల ఫలంబులనొసంగ నాతఁడు వానిని గైకొనక యన్నమే కావలెనని పట్టుబట్టి తుదకు ప్రాణములఁబాయును. అప్పటి జనులందరు హత్య హత్యయని గోలఁజేయుచు గుంపుగుంపులుగ వచ్చి నామదేవుని బంధించి తీసికొనిపోదురు. పరిపాలకుఁడు మహాత్మ్యశీలుఁడగుటచేత హింసాయంత్రమున దూషింప నామదేవు హింసాయంత్రభాగమును సమగ్రముగాఁ దెల్పి పాండురంగని మనస్సు నందు సమర్పించి చచ్చిన వృద్ధుని తన భక్తిప్రభావముచేత బ్రతికించును. విప్రపురమందు పాండురంగని యుత్సవమని విని నామదేవుఁడేఁగి యట నచ్చటి విప్రులాతని మహిమ నెఱుంగఁజాలక ఆలయముఁదాప తీర్థప్రసాదములీయ నొసంగక గుడి వెనుకభాగమునకు నెట్టివేయుదురు. శాంతస్వభావుఁడగు నామదేవుఁడచ్చటనే భజన చేసికొనుచుండ గుడికి గుడియే గిరుకున తిరిగిపోవును. విప్రులందఱు దాని కాశ్చర్యపడి యిది యంతయు నామదేవుని మహిమయని యెఱింగి క్షమాపణ వేఁడుకొని యెప్పటియట్లుండును. పాండురంగఁడు నామదేవుని తనలో లీనము సేసికొనును.

మంగళము.



ఈ నాటకమున వచ్చు పాత్రలు.



పురుషులు.

రాముఁడు }
గోపాలుఁడు }
కేశవుఁడు } బాలురు.
కృష్ణుడు }

నామదేవు — కథానాయకుఁడు

దామాజి — నామదేవు తండ్రి.

పాండురంగఁడు.

కిరాతుఁడు — వేషధారియగు పాండురంగఁడు.
లేక (శ్రీకృష్ణుఁడు.)

విసోబా కేశుఁడు — నామదేవు గురువు.

నేకాజీ — రాధాబాయి తండ్రి.

వృద్ధబ్రాహ్మణుఁడు.

పాదుషా — ప్రభువు.

నాయుజీ — మంత్రి.

రామాధాని }
వేంకటశర్మ }
కృష్ణశాస్త్రి } విప్రులు, అర్చకులు.
గోపాలమూర్తి }

స్త్రీలు.

గుణాబాయి — నామదేవు తల్లి.

రాధాబాయి — కథానాయకి నామదేవు భార్య.

తారాబాయి — రాధాబాయి చెలికత్తె.

మొంకి — కిరాతుని భార్య.

ఇంకను సందర్భానుసారముగాఁ గొన్ని పాత్రలు వచ్చును.

ఓమ్.

నాంది.

శ్రీరంగంబు పవిత్రజీవనకర శ్రీచంద్రభాగానదీ
తీరం బాగమఘోషసంకులమహాదివ్యస్థలం బందు నా
నీరేజాక్షుఁడు నిర్వికారుఁడు జనానీకంబుఁ బాలించు నా
శ్రీరంగేశుఁడు పాండురంగఁ డిడుతన్ సేమాయురారోగ్యముల్.

దురితాంభోధి తరంగడోలికలపైఁ దూఁగాడుచున్ నిల్చి యా
కరి ప్రాణాభయదానహస్త! త్రిజగత్కల్యాణ! పద్మాక్ష! మ
స్మరయన్ లేఁగదె? దేవదేవ! యనుచుం గుయ్యాలించి రక్షించు నా
కరుణాస్వాంతుఁడు పాండురంగఁడు మిమున్ గాపాడుఁగా కెయ్యెడన్.

(నాంద్యంతమున సభపైఁ గుసుమములు చల్లఁబడును)

 పాఠకులు గమనింపవలసిన విషయము.

‘సేసెదను పీశా.’ (పుట ౨౩) అనుదానికి ‘సేతుజగదీశా!’ అనియు
‘ధీరమానసవాగేహా!’ (పుట ౩౭) అనుదానికి ‘ధీరమానసగేహా!’ అనియు
‘విరూపాక్షుని’ (పుట ౮౦) అనుదానికి ‘యనిమిషాక్షుని’ అనియు
‘నీమనోహారుండిదే’ (పుట ౮౩) అనుదానికి ‘నీమనోహరుండిదే’ అనియు
‘మఱప్రవచ్చెనె?’ (పుట ౫౫) అనుదానికి ‘మఱపువచ్చెనె?’ అనియు
‘[illegible]’ (పుట ౭౬) అనుదానికి ‘భిన్నాభిప్రాయమును’ అనియు
‘[illegible]’ (పుట [illegible]) అనుదానికి ‘భగవదిచ్ఛ’ అనియు

సవరించుకొనవలయును.

ఇంకను నచ్చుతప్పులున్నను అచ్చుపొరపాటని యెంచవలయును.
ఇటువంటివానిని రెండవ కూర్పున సవరింపఁబడును. మన్నింపుఁడు.

ఓమ్.

భక్తనామదేవ

ప్రథమాంకము.

౧వ రంగము. పండరీపురము - రాజవీధి.

(కేశవ గోపాల రామ కృష్ణులు నల్వురును పదియేండ్లకు మించని బాలురవల నుండవలయును. వేషధారణము సామాన్యముగాఁ బీదవాని యందలి బాలురకుఁబోలె నుండవలయును. నామదేవుఁ డెదునాలుగేండ్లకు మించని బాలుఁడుగను ప్రకృతియందు లోకవ్యవహారములయందు విముఖుఁడుగను కానఁబడవలయును. వేషధారణము [illegible] శుభ్రమగు గోవతియు ముందువెనుకల విల్లకట్టును జుంజురు వెండ్రుకల తలకట్టును మోమున వైష్ణవనామములును కంఠమునఁ దులసిమాలలును కరముల [illegible] నడుమునఁ గట్టి బిగియించుకొను [illegible] [illegible] బాహువులయందును విష్ణుచిహ్నంబులను గలిగి యుండవలయును. రంగమునకు [illegible] [illegible] నుండవలయును. భక్తస్వరూప భావాదులు ప్రకటించునట్లుండవలయును.)

(తెరనెత్తగాఁ గొందఱు బాలురు గోలికాయల నాడుకొనుచుఁ దగవులాడుకొనుచుందురు.)

రాము—గోపాలా! నిష్కారణముగఁ దగవులాడిన లాభమేమున్నది?

గోపా—అవును. నీకాయకన్న నాకాయయే దూరముగానున్నది.

కేశ—అదికాదు. మీయిద్దఱి కాయలు సరిదూరమున నున్నవి.

గోపా—అట్లెప్పటికిఁగాదు. కృష్ణా! ఎవరిది దూరముననున్నదో నీవు చెప్పుము?

కృష్ణు—ఇందు చెప్పనదేమున్నది? కేశవుఁడు చెప్పినది సరి. అది కాకుంటే యింక ఒక మాటకు రాముని కాయే దూరముగా నున్నది.

గోపా—అదిగో! మీరందరుగలసి నాకు దోకిళ్లుపెట్టజూచుచున్నారు కాదు? ఇంక నేనసలే ఆడనుపోండి.

[అని పోఁబోవును.]

రాము—(అడ్డగించి) అబ్బో! ఆడకుండనే పోతావుగా? (దిక్కులు పరికించి) అదిగో! ఎవరో యొక బాలుఁడిటు వచ్చుచున్నాఁడు. వాని నడిగి మన తగవుఁదీర్చుకొందము.

గోపా—(చూచి) ఓరీ వీఁడటరా? దామాజీ కొడుకు నామదేవురా? వీఁడు వట్టిపిచ్చివాఁడు. ఒకరితో మాట్లాడడు. తనలోఁ దానే యెల్లప్పుడేదియో గొణుగు కొనుచుండును. వీఁడేనా మన తగవు దీర్చునది?

కృష్ణ—గోపాలా! సుతిమించి రాగములోఁబడుచున్నది. నామదేవు పిచ్చివాఁడా? వాడివంటివాఁడు మనలోనెవడున్నాఁడో చెప్పుము? తగవుతీర్పుకే వాఁడు పనికిరాడుగా?

[ప్రవేశము—నామదేవు భజనసేయుచు.]

అనుబంధము. ౧.

నామ—[చేతులు జోడించి] దేవా! పాండురంగా!

సీ. ఇంకింప సంసారపంకంబు భానుబిం
బము భవదీయనామస్తవంబు
దారిద్ర్యనిస్తంద్ర ధారుణీజముగూల్ప
నిశిత కుఠారంబు నీదుభజన
దుర్వారగంభీర దురితానలంబార్ప
నమృతంబునీదు నామామృతంబు
ఘనభీకరగభీర కష్టాంబునిధిఁదాట
నిరపాయమగునావ నీదుసేవ

గీ. భయపిశాచంబుఁ దొలఁగింప భస్మపటలి
పద్మనాభ! భవత్పాద పద్మరజము
ఘోరతమ త్రైఋత్వ పీడార్తిమారకంబు
తనరు నీనామకీర్తనం బనఘచరిత!

(బాలురఁగాంచి స్వగతము)ఏమి యీ బాలుర మౌఢ్యము? చతుర్దశభువనరక్షణ దక్షుండగు నాహార్యక్షు నిభమధ్యునారాధింపక తిరిక జెందు వేళ శైశవక్రీడలందుఁ గాలము వ్యర్థఁబుచ్చుచు నామమాత్రావశిష్టులగుచున్నారు. భగవన్నామ సంకీర్తనామృత పానంబునకు వీరలజిహ్వికలు మరలినచో నొండు శైశవక్రీడా రసపానంబునకు నిచ్చగించునే? (ప్రకాశము) మిత్రులారా! ఏమిది? ఇట్టులగోలికాయల నాడుకొనుచుంటిరేల? అన్నిఁటికిని మూలకారణుండగు శ్రీమన్నారాయణుని సేవలకన్న నీయాటలన్నియు నెక్కుడగునా? శైశవదశనుండియే యైహికేచ్ఛలకు లోనుగావలయునా?

కృష్ణ—అయ్యా! మాకీ గొడవయంతయు నెందులకు? మీరటు చూచి యేకాయ దూరమున నున్నదో తెలిపిపొండు. మాకదియే పదివేలు.

నామ—(పరికించి) సోదరులారా! చూడుఁడీ రెండు కాయలు సమ దూరముననున్నవి. ఆ రెంటి కేమాత్రమును భేదము లేదు. అందులకుఁ గారణమెయ్యది! మీకిద్దఱకు సమమైన గురినిల్పుటఁ జేసియే కదా యిట్టులజరిగినది? ఇందన్నిఁటికంటె నెక్కుడు మీచిత్తంబులన్నియు నీయాటయందు నిమగ్నములై యుండినవి. కాని యట్టి నిశ్చలమగు గురిని మనపాండురంగని యందు నిల్పి, యాతనిభజనలే శైశవక్రీడలని నమ్మి నిరతముఁ బూజించుచుండినచో నప్పుడు మానవునకు, భగవంతునకు నెట్టి భేదములుండవు దశలయందున శైశవదశ మొదటిది. ఆదశయందు బాలురు కేవలమజ్ఞానులై యిహలోకసంబంధములగు నాటపాటలకు లోనగుచుందురు. తదనంతరము నవయౌవనులై విషయవాంఛలలోఁజిక్కి వికారులై తిరిగినచో నప్పుడు భగవంతునకు మానవునకు భేదముగలుగును. కాని శైశవ దశనుండియే యాకమలాక్షుని భజించుచుండిన నట్టివారలిహపరంబులయందుఁ బూజార్హులగుదురు.

మ. స్వరమందుఁ బవమందు వర్తనమునన్ భక్తిక్రియాభ్యర్థులై
పరతంత్రులన్ భగవంతు శేషశయనుం బద్మాక్షుఁ బీతాంబరున్
నిరతంబున్ భజియించు సాధుజనముల్ నిత్యోదయశ్రీయులై
స్థిరభోగంబులనందఁజాలుదురు లక్ష్మీనాథు ధామంబునన్.

గోపా—అయ్యా! తగవుఁదీర్పదవని గంపెడాసతోనుండ భక్తిభక్తి యని బోధఁజేసెద వెందుకు? పక్షమునకు రెండు దినములేనియు శైశవక్రీడల జరుపవలదా? బాల్యదశయందే ముక్కుమూసికొని మూలఁగూర్చుండు మనియెదవా యేమి? ఇక మీ బోధలఁ గట్టిపెట్టి చేతనగుచోఁ దగవుఁదీర్పుము. లేకున్న మీతోవను మీరు పొండు.

రాము—ఏమిరా? కేలగాయలాగున గలగల నఱచెద వెందుకు? ఆయన యెవరనుకొంటివి? మనవలె నజ్ఞానుఁడుగాఁడు ఎప్పుడేనియు నాతఁడు మనతో నాటలకు వచ్చునా? అట్టివానినిఁ దిరస్కరించుట తప్పుగాదా? (నామదేవుదిక్కై) అయ్యా! బాలుఁడవయ్యును సాధుమూర్తివి. బాలురమగు మనకు భగవంతు నెటులఁ బూజింపవలయునో తెలియదు. ఒకవేళ తెలిసినను భగవంతుఁడు బాలురమగు మనలఁ గన్నెఁ జూచునా? ఎవరో యోగులు చాలకాల మడవులయందుఁ దపంబుసేసినను వారలకు భగవంతునిఁ జూచుట కష్టతరమని మనపెద్దలు చెప్పుచుండ వినుచుంటిమి. అదిగాక మనకు లోకజ్ఞాన మేమియు లేదు. అట్టితఱి మనకు భగవంతునిఁ గాంచుట కష్టతరముగాదా?

నామ—సోదరులారా! పరాత్పరుఁడు సర్వసముఁడు బాలురైనను దపోనిధులైనను నాతనిదృష్టికందరు సమానులే. బాలుర హృదయంబులు లలితపల్లవ కుసుమంబులు. భగవన్మహిమల నెన్నించుటకు లోకజ్ఞానమువలదు. మీకు నాటలయందుండు నాతురతను నా పాండురంగని భజనలపై నుంచి యవియే శైశవక్రీడలని యెంచి యేకమనంబున నెల్లప్పుడు 'రంగా' యను

రెండక్షరముల జపించుచుండినచో నాదేవదేవుండు మనల. దప్పక నుద్ధరించును. పసివారలు లోకజ్ఞానము నెఱుంగక బోవుటంజేసి వారి యాత్మలకు షడ్భావవికారంబులు లేవు. నూతన వస్త్రమునకుం బట్టినట్టుల రంగు పాతవస్త్రమునకుం బట్టదుగదా? అక్కారణిబాలుర హృదయంబుల నూతనముగా నెయ్యదియేని యలవడినచో నది జన్మపర్యంతము వఱకు నిలచియుండును. బాలురకు బుద్ధికుదిరినచో వారలకుండు మనోనిశ్చలత్వము పెద్దలకేనియునుండదు. మనకా పాండురంగని చింతనయందు గురికలిచినచో, నంత నది పోనుపోను గాఢముగా నాటుకొని తుదకుం దన్మయత్వముం గలిగించును. తపసులు లోకజ్ఞానులగుటచేం గొంచెపాక వేళంగామాతురతను సతితులై పాపమార్గంబును ద్రొక్కుచుందురు. దానం జేసి వారలకు భగవంతునిం జూచుట కష్టతరమగును. ఇట్టిమోహ దపోనిధులకలవింగాని, కర్జంబుల నిర్జింప బాలురకు సాధ్యమా యని యోచించదగునా?

సీ. పలుకష్టములం జేసి ప్రాభవోపేతుండౌ
ప్రహ్లాదుండును బసివాండుగాండె?
పరతల్లిరక్షింప వనమందు భగవంతు
సేవించిపట్టు ధ్రువుండు చిఱుతగాండె?
యముని గెల్వంగం జాలినట్టిమార్కండేయ
మునిసింహుండును జిన్నిబుడుతగాండె?
పరమేశ్వరునికంటి బాధను దొలంగించి
కొలిచిన కన్నప్పకుఱ్ఱగాండె?
గీ. కడగిపలుక నసాధ్యపుం గష్టమేని
సాధ్యమగునంచుం బల్కరే? సాధుజనులు
బాలురకు సాధ్యమే? యంచుం బలుకందగునె?
బాలకులుగారె? తొల్లింటి భాగవతులు.

బాలకులారా! భగవంతుని లీలలంగురించి చెప్ప నలవిం గాదు. ఆతనిని సేవించుటకు వృత్తిభేదములుగాని, జాతిభేదములు గాని యంతకుమున్నే తారతమ్య భేదములుగానిలేవు. ఎవ్వఁడు నిశ్చల చిత్తంబున నాభగవంతుని స్తుతియించునో, వాఁడు త్రిలోకములందుం బూజ్యుఁడగును ముందు శ్రీకృష్ణనామ సంకీర్తనంబలవడుటయే దుస్సాధ్యము. అలవడినచోం గడచినకొలందియు నాకీర్తనంబుపైం బ్రేమ జనించి, కడకదియే భక్తిరూపముగాం బరిణమించును. అట్టిభక్తిచే శ్రీమన్నారాయణునిం దృప్తిం బఱుపవచ్చు ఆతండు తృప్తిపడిన సర్వభూతములుతృప్తివడును. అంత నాభక్తుఁడు సర్వభూత సమన్వితుఁడగును.

కృష్ణు — అయ్యా! మేమంతటివారము కాంగలమా ?

నామ — సోదరా! భగవచ్చింతన సేయుచుండినచో నంతటివారము కాంగలము. శ్రీకృష్ణభజనంబు సేయుదమురండు.

అ ను బ ం ధ ము. ౨.

[అందరును భక్తిపారవశ్యమున నుందురు.]

నామ — (ముకుళితహస్తుఁడై)

శా. శ్రీకృష్ణా! యదునందనా! భవహరా! చిద్వ్యాపకా! యీశ్వరా!
పాకారిప్రముఖార్తిసంహరణ! నిన్ వర్ణింపఁగాశక్యమే ?
లోకస్తుత్యభవత్పదాంబుజ సుధాలోలాంతరంగంబులన్
జేకూర్పంగదవయ్య! మాదృశులకున్ శ్రీపాండురంగప్రభూ!

బాలకులారా! ఆలయంబున కరిగి స్వామిని సందర్శింతము రండు.

[నిష్క్రమింతురు.]

(తెర వ్రాలును.)

౨ వ రంగము. వామదేవు గృహము.

[ప్రవేశము దామాజి - గుణాబాయి.]

(దామాజి యేబదియేండ్లు నిండినవాఁడుగా నుండవలయును. వేషధారణము శిరమున మహారాష్ట్రీ పాగయును నొకముదుక చొక్కాయును దానికుండీ బిగింపు లేదు బుజముచుండి ప్రక్కగా నుండవలయును. గుండీ బిగింపులు దారములలోఁగాని సేఫ్టీపిన్నులలోఁగాని యమర్పఁబడవలయును. అంగీచొక్కాపై వల్లెవాటుగా నొక పంచయుఁ గంఠమునఁ దులసిపేరులుండవలయును. కట్టుకొనుటకు ముదుకధోవతియు నర్ధనగ్నము మోకాలు జారి జారినట్లుగ నుండవలయును. మోమున వైష్ణవనామము లుండవలయును. గుణాబాయి మున్పటి యేండ్లకు నిండిన కాంతగను వేషధారణము కులకాంతలకువలె నుండి శిరమున ముసుగు మాత్రముండవలయును. నవారీ మొదటి రంగమునందలి వేషములో నుండవలయును)

గుణా—నాథా! పిల్లవాడు నవవయస్కుఁడగు చున్నాఁడు. కాని లోకజ్ఞానమే లేదు. ఎల్లప్పుడున్నాదునివలె హరిభజనలు సల్పుచు సన్యాసిమాడ్కిఁ జరించుచున్నవాఁడు. పురవాసులందరును బిచ్చివాఁడనియు మందమతియనియుఁ బలుదగ్ధ్యమలనాఁడుచున్నారు. కులవృత్తియగు వ్యాపారమును మాని యెల్లప్పుడు హరిభజన లాలసుండగుచో వృద్ధులమగు మస్మల ముందు పోషించుటెట్లు? మీరెన్నినోచూచి యూరకుందురు. ఒక్కనాఁడేనియు మీవెంట వ్యాపారమునకుఁ దోడ్కొని పోరు. దానియందలి సాధకబాధకముల నెఱుఁగకపోయినచో ధనమార్జింపఁగలఁడా? ధనములేమి మనలేముకదా? పుత్రుఁడు మాటవినక ప్రాయమునంతయు వృధసేసినచో మనకు గతులున్నవా? బాలునకు హరిభజన లెందుకు? బాల్యమునుండియే భక్తి నార్జింపవలెనా? గృహస్థాశ్రమస్వీకారుఁడగు తటి మోక్షసామ్రాజ్యమునకుఁ బట్టభద్రుండు కాఁగూడదా?

దామ—కాంతా! ఏమిసీమౌఢ్యము? హరిచింతనామృత పానంబునకు వేళయొకటియున్నదా? గృహస్థాశ్రమవాసుఁడై మోక్షసామ్రాజ్య ధురంధరుండగునని తలంచుటెట్లు? మానవుని జీవితంబు క్షణభంగురముకదా? క్షణమునకుఁ గలుగబోవు సంగతిఁ దెలియఁజాలమే. అట్టిచో ముందు చేయఁగూడదా

యని తలంపవగునా ? మన పుత్రుఁడు కారణజన్ముఁడుకాని సామాన్యుఁడుగాడు. పద్మము వికసించుచునే సౌరభ్యమును వెదఁజల్లునట్లు లాతని హృత్పద్మము వికసించుచునే భక్తిరసమును వెదఁజిమ్ముచున్నది ఆతఁడు సాక్షాద్వైష్ణవాంశసంభూతుఁడుగాని మానవమాత్రుడుగాడు. మనమాతని మనస్సీమయందు భక్తిబీజమ్మును నాటుటకుమారు మొలచినదానిని త్రుంచుట పాడియా ? సంసారసాగరంబున నాతడిప్పుడే మునుఁగనేల ? భక్తవత్సలుండగు పాండురంగని కృపయుండినచో నిర్ధనులేనియు జీవింపఁ గలరుగదా. నీచెడు తలంపుల మాని యాతనిభక్తిరస ప్రవాహమును నిరోధింపకుము. మన మిదివఱకాతని కెప్పుడును, గృహబాధల నిర్వర్తించుకొనుమని చెప్పితిమా ? ఇప్పుడు మనము చెప్పినచో నాతఁడు మన పల్కుల శిరసావహించునుగాని కాలఁదాచివేయఁడు. పరమ భక్తులకుఁ బ్రాపంచిక విభవంబులపై నాసయుండునా ? పరమ భాగవత శిఖామణియగుటచేత నేకదా ప్రాపంచిక సౌభాగ్యములన్నియు నిరర్థకంబులనియు నిష్ప్రయోజనంబులనియు నీకు వక్కాణించె. అట్టి సుపుత్రుని గన్నందులకు గర్వపడక యెవ్వరో లోకులు కాకులవలెఁ జీకుమాటల నాడుచుండిరని లోకజ్ఞానశూన్యుఁడనియు నున్మాదుఁడనియు సన్న్యాసియనియు దూరవచ్చునా ? 'పరబుద్ధివినాశాయ' యను సూక్తి నేనియుఁ దలంపవలదా ?

గుణా—నాథా! మీరును భక్తిమార్గము ననుసరించి నాకు బుద్ధి గఱపుచుంటిరా ? ఒక్క గడియయేనియుఁ బుత్రుఁడింటికడ నుండక సదా వీధులందు భజనసేయుచుఁ దిరుగుచుండునే కాని తోడివారలు నవ్విపోదురని యెంచడే ? భజనసేయుటకు గ[illegible] లేదా యేమి ?

దాము—[illegible]ము నీపిచ్చితలంపు పాయలేదా? మనము తగినకాలమున భ[illegible]కొనుమని తెల్పినచో నాతడక్కరణి వర్తించును.

మన మెట్టిపనిని జెప్పకుండుటచే నాతఁ డెల్లప్పుడు భక్తిరస ప్రవాహంబునఁ దేలియాడుచున్నాఁడు. ఆతఁడు వచ్చిన తరిఁ మనము కొంత నీతినిగరపుదము. (పరికించి) అదిగో! ఆతఁ డిటే వచ్చుచున్నాఁడు.

[ప్రవేశము—నామదేవు భజనసేయుచు]

అనుబంధము. 3.

నామ—(అంజలిబద్ధుండై) హే పాండురంగా!

మ. జనకాజ్ఞన్ శిరసావహించి వనికిన్ సౌమిత్రియున్ సీతయున్
వెనువెంటన్ జనుదేర నేగి యడవిన్ వింధ్యాటవిన్ గుహ్యరా
ముఖులన్ ద్రొక్కలబెట్టి పాలసులనుద్ధూళించి కాపాడితే;
జనులన్ బ్రాణుల నాదిదేవులను: సీతా! పాండురంగ ప్రభూ!

[ధ్యానలోలుఁడగును.]

దామ—చూచితివా నా కుమారుని విష్ణుభక్తి తత్పరత?

[ఆనందమున ప్రక్కకు దృష్టి ద్రిప్పి జూచును.]

గుణా—(చేరదీసి) కుమారా! ఏమి యీ వెఱ్ఱి భక్తి? చేతులు జోడించి ముకుళితనేత్రుఁడై ప్రార్థించినంతనే పాండురంగఁడు ప్రత్యక్షమగునా? కాలమంతయు ప్రార్థనలచే వ్యర్థఁ జేసిన నీ యుదరపోషణార్థమునకుఁ దగిన యుపాయము లేదు దిక్కును?

నామ—(తల్లిదండ్రులకు నమస్కరించి) తల్లీ! ఎంత వెఱ్ఱి యనినాన నగుచుంటివి? ఎంతటి కష్టంబు నైనను సహించుటకు మూల సాధనము మనస్సు. అట్టి మనస్సున జనించు కోరికల నిగ్రహించుట దేహికి నత్యావశ్యకము. ఆ చలితంబగు మనమున నా పరాత్పరుఁ బ్రార్థించినచోఁ బ్రత్యక్షము గాక మానునా? పాండురంగఁడు భక్తుల మొఱాలకించు ప్రభుఁడని యెఱుఁగవా? పాండురంగని లీలలఁ దదేకధ్యానమనస్కుఁడై

వర్ణించుచుండిన దేహాని క్షుత్పిపాసలు బాధించునా ? భగవచ్చింతనామృత పానంబుకన్న నీయన్నపానంబు లెక్కుడగునా ? మృష్టాన్నప్రియూలోలుండగు వానికిఁ గొంత కాలముఁ గడచును వెనుకటి క్షుత్పిపాసలు బాధింపఁదొడగును. కాని యనంతమగు పాండురంగని నామామృతంబును పానంబు సేయుచుండిన క్షుధాగ్ని దేహాని దహింపఁగలుగునా ?

దామ—కుమారా ! చిత్తజ్ఞానపూజ్యులము మేము నీ కేమని చెప్పగలము ? పాండురంగని భక్తుండవై యనంతునవంతలీలాతరంగ మధురపానాసక్తచిత్తమున్నిరీక్ష్య ప్రభాభాసమానుండవై యొప్పు నీకుఁ దెలియనిదేమున్నది ? నీ చెప్పిన దైవమీ దైహిక సుఖానంద తత్పరులకు క్షుత్పిపాసలెక్కుడగును. తండ్రీ ! నిన్నుఁగని ధన్యులమైతిమి.

[అని చేరదీయును.]

నామ—తండ్రీ ! సుతునకు తల్లిదండ్రులకన్న దైవములు వేరు లేరు. పితరులే దైవము. దైవముఁ త్రిలోకపూజ్యుండు అట్టి త్రిలోకపూజ్యులరగు మీకుఁబుట్టినై భవచ్చరణారవిందములఁ గొల్చుచు ధన్యుఁడనగుచుంటిని.

దామ—(పులికితగాత్రుఁడగును)

గుణా—కుమారా! మా సుకృతాస్యము సాపడించుచున్నది. ముందు మమ్ముఁ బోషించు భారము నీపైఁబడుచున్నయది. అట్టి మేఁకులన్నత్తినివర్జించి, భగవద్భక్తి నాశ్రించుచుండిన సంసారంబు నిర్వహించు నుపాయంబు నీకెట్లు గోచరంబగును? సంతతము భగవచ్చింతన సేయుచుండిన సంసారంబున నీకును స్తవంబు. తల్లిదండ్రులఁ బోషించు భారము తనయునిది. అట్టిదోఁ షంబు లేక దైవంబు పెట్టునుపకనా ? పురుషయత్నంబో నృక మూలఁ మాత్సండి భగవంతుఁడు పెట్టునాయనితలంచుట దనిటి నేయుదు విత్తంబుపాలి ఫలింపదాయని తలంచుచున్నాను.

దానంజేసి జీవులు కృతకృత్యులుగాఁజాలరు. నీవును దీరిక వేళలందు భగవద్ధ్యానంబును సల్పుకొనుచుఁ గులవృత్తిని సేయుచుండుము. కోటివిద్యలున్నను గులవృత్తికి సమానములుగావు.

నామ—అట్లా! నీయాజ్ఞ శిరసావహించువాఁడ.

దామ—తండ్రీ! కొంతవఱకు లౌకిక జ్ఞానమునుగూడ పాటింపవలయును. నీవు వీధులయందుఁ దోడివారలఁగూడి భజనలు సల్పవలదు. వారిలోఁ గొందఱు స్వార్థాభిలాషులుందురు అట్టివారలు నిక్కమైన భక్తులుగారు. ఉదరపోషణార్థమై యెదిరి కన్నులఁ గప్పి కుటిలగతి వర్తించుచుందురు. అట్టివారల నెఱుంగుట దుస్తరము. వారలతోఁగలసియుండుట కాకులగుంపునందుఁ గోకిలముండినట్లగును. అదిగాక—

శ్లో. సత్సంగతస్స్యాద్గుణలాభవంతి
దుస్సంగతో దుష్టగుణాభవంతి
సదసంతో యాస్యమ్ప్రతాయితాని
సంగాణితాన్యేవభవంతిసింధో.

అను సూక్తికైవడి సద్గుణవంతుఁడైనను గొన్నివేళలందు దుస్సాంగత్యమువలన మతిభ్రంశకలుగుచుండును. చిత్తచాంచల్యము గలవానికి భక్తి కుదురదు. కుదిరినను రక్తికిరాదు. పన్నీరు దుర్గంధముతోఁ గలసియుండిన నేదియో కల్మషముగలిగి ప్రధానవస్తువను గంధము నాశిల్లుచుండును. కాన మనగృహమునందే పూజామందిరమునందదేని ధ్యానచిత్తంబున నత్తామరసదళాక్షుని భక్తిమెయి సేవించుచుండుము.

నామ—తండ్రీ! మీయాజ్ఞ జవదాటఁగలనా? అట్లొనరింతును.

దామ—సుతా! చెప్పమఱచితిని. నేనొక కార్యార్థమై యుదయంబునఁ బోవువాఁడ. మనము ప్రతిదినంబును మనయింటి యందుఁగల పాండురంగనికి నైవేద్యమును బెట్టుచుంటిమి. ఎప్పటియట్టుల నేను లేనికొఱఁతమాన్పి పాండురంగనికి నైవేద్యంబును సమర్పింపుము.

నామ—(జనాంతికముగ) ఇంటియందుంగల రంగనికేల? ఆలయంబున సాక్షాత్కరించియున్న రంగనికే నైవేద్యమును బెట్టివచ్చెద.

గుణా—నాథా! ఇప్పుడు చెప్పిన చోప్పున నొప్పుకొనుదును కాని భక్తులెవరైనం గన్పడినచోం బనినంతయు వదలి యొక్కపరుగునం బోవుదువు. అంత మన యాచారంబునకు భంగము వాటిల్లునేమోయని దిగులొందుదాన.

నామ—(హర్షముతో) తల్లీ! నాపై నెంత పామరత్వమును వహింపుచుంటివి? కైటభారికి బువ్వంబెట్టుటకన్న మిన్నయగు గర్జంబొందుగలదే? నాపాండురంగనికి— నను(గన్నతండ్రికి— నానోములపంటకు— నాపాలిదైవమునకు— నాచేతితో నైవేద్యము నర్పించుటకంటె నొందుభాగ్యంబుకలదె? తండ్రీ! నాకెట్టియానతి నొసంగితిరి? ధన్యుండనైతి. బాలుండనగు నేనిడు మృష్టాన్నము నారగించునా? నాపైం గనికరముం జూపునా? నన్నుబ్రేమం బాలించునా? పసికూనవని కసరికొట్టునేమో? లోకజ్ఞాన మెఱుంగనివాండనని పలుకరింపం డేమో? (చకితుండై) ఎంతటి మూఢుండను? భక్తులన్నం బాండురంగనికిం బ్రాణములతో సమానముకదా? అట్టితఁడు నన్నేల కనికరింపండు. నానోములు ఫలించినవి. నాపున్నెము తలంచినది. జయపాండురంగప్రభూ!

అ ను బం ధ ము ౪.

(భక్తపరవశుండగును)

నామ—కాంతా! చూచితివా? ఇట్టి భక్తులు మాటదప్పుదురా? నేం జెప్పిన పైవడి నాతండు తప్పకవర్తించును.

గుణా—కానిండు రాంబోవువానికిం జింతించు టెందులకు? ఎయ్యది కానున్నదో యయ్యదికాకమానదు. అంతయుం బరాత్పరుని యధీనము. [నిష్క్రమింతురు.]

*

3 వ రంగము పాండురంగదేవాలయము

[ప్రవేశము నామదేవు నైవేద్యమునుఁ జేకొని]

(నామదేవు బాలుఁడుగనే యుండవలయును. [illegible] యుండవలయును. [illegible] నైవేద్యపు పళ్లెరము [illegible] ప్రవేశింప వలయును. గుడిగంటలు [illegible] పాండురంగని విగ్రహము [illegible] కలిగియుండవలయును. [illegible] యుండవలయును)

అనుబంధము. గీ.

నామ — దేవా! సకలసద్గుణసద్భావ!

ఉ. పసిబాలుండను జ్ఞానశూన్యుఁడను నీభక్తుండ నెల్లప్పుడున్
వెసనీనామము ధ్యానపూజనరతిన్ బ్రేమాప్తి మగ్నుండ నే
నసహాయుండ భవన్నివేదనము నిక్కింతు భక్షింపుమో
వసుదేవాత్మజ! యోగిరక్షకర! దేవా! పాండురంగప్రభూ!

[అనిపళ్లెరమును ద్వారముకడ్డ పెట్టును.]

(కొంతతడవు పరికించి తనలో) ఏమిది? పాండురంగడు వచ్చి భుజించుటలేదే? ఏదేని యపరాధ మొనర్చితినా? నావలనఁ గోప మూనెనా? బాలునకు దర్శన మీయఁగూడదని భావించెనా? పిన్న వాడనని మిన్నకుండెనా? (చేతులు జోడించి ప్రకాశముగ) అన్నా! నేఁడిటు నేఁ దెచ్చితినని వినుకుండవైతివా? నేనర్పించుట నీకిష్టము గాదా? భోజనము పచనముగా లేదా? తినుటకర్హముఁ గాదా? శుచిగాదా? కడుపునిండినదా? క్షుద్బాధ లేదా? (తనలో) అవును లోకంబునంగల సకల భక్తార్పితాహారంబుల నాస్వాదించుటచే కుక్షి నిండఁగూడదా? (ప్రకాశము) బ్రహ్మాండకోటిసమూహత్రిగుణసృష్టికి లెంకలయాల్పాహారంబునకే నిండినదిగనున్నదా? రమ్ము తండ్రీ! ఆరగింపుము. (స్వగతము) గాడేమి? అయ్యో! నివేదనమర్పింపక గృహంబున కేగుటెట్లు? (ప్రకాశముగా) తండ్రీ! నీతత్త్వం బెవ్వ రెఱుంగఁగలరు?

అ ను బం ధ ము. ౬.

ఉ. హారివి ఘోరపాపభయహారివి దుర్జయశత్రుకోటి సం
హారివి గోపబాలకవిహారివి మంజులసద్గుణాఢ్యలం
కారివి సాధుచిత్తహితకారివి భక్తజనాంతరంగసం
చారివి నిర్వికారివి విచారివి శౌరివి నందనందనా!

దేవా! నీమాయ లనంతములు — అగణితములు. నినువర్ణింప నేరికి తరంబు? నిర్వ్యాజకరుణారసపూరిత హృదయుండవై నిరుపమ సద్గుణగణాలంకార శోభాయమాన మానసరాజహంసుడవై పాండు రంగాద్యనేకావతార సంభూతుండవై యొప్పు నీనామవర్ణనంబర్హ వంబుగదా? తండ్రీ! విముఖత్వమేల దాల్చితివి? కాలభేదమెంచి తివా? వృత్తిభేదమెంచితివా? పిన్నపెద్దయను తారతమ్యమెంచితివా?

సీ. ఘోరాన్నమునుదింట శుద్ధిగావన్నట్టి
భక్తుడు విదురుండు ప్రబలసాక్షి!
బాలుంపొసంగిన ఫలము లెంగిలివన్న
శబరకులాంగన శబరిసాక్షి!
పిన్నవారలపొత్తు నెన్నగూడెపటన్న
బాలురు ముద్దుగోపకులుసాక్షి!
పేదవారలపైని బ్రేమకూడదటన్న
గడుదరిద్రుడు కుచేలుడునుసాక్షి!

గీ. భక్తులమొరాలకించెదు ప్రభుడవంచు
బుధులెలనుగాచు కరుణాసముద్రుడనుచు
నిన్ని సాక్ష్యము లొక్కట్టై నిన్నుదలచి
యుండె; జాగేల! భవభంగ! పాండురంగ.

(స్వగతము) అయ్యో! యింకనురాలేదే (ప్ర) తండ్రి! కని కరములేదా? మొఱవినరాదా? అపవాదా! భక్తుడనుగాదా? ఇదివాదా? రక్షకుడవుగాదా? మోమోటములేదా? కుచేలుని

గానలేదా? కరివరదుఁడవుగాదా? నీదాసదాసుఁడనే? వాసుదేవా! పరాత్పరా! కృపాకరా! దయాసింధూ! నను బ్రోవవా? సుతుని రక్షింపవా? నా చేతిపట్టు నారగింపవా? తండ్రీ యీ భవజలధి దాట మం చివా? నీ కన్నంబుఁ బెట్టు భాగ్యము కల్గునని సంతసించితినే - చింత బాసితినే - గంతులు వైచితినే - ఉబ్బితబ్బిబ్బులాడితినే? మాధవా అనాథుల నాదరింపవా? గోపాలా! నీపాలఁబడ్డవారిని రక్షింపవా? కేశవా! నీదాసులఁ గాలపాశవిముక్తులఁ జేయవా! గోవిందా! మందమతుల కానంద మొసంగవా? సుదర్శనా! నీ సుదర్శన మియ్యవా? గదాధరా! సదాచారసంపన్నుల నుదాసీనంబునఁ గనికరింపవా? తండ్రీ!

మ. కరమర్థిన్ భుజియింప నీమదిని నెవ్వారలానుకంపాపరా
కరదివ్యాకృతిపదిశ్రీరామునకు విపంచిల్లయి కేశవ్వు బం
ధురమై భక్తులచిత్తముల్ తెలుపు; నన్నుం బ్రోవఁ బాలింపఁగన్
భరమైపోయెనదేమి? కృపావరదా! దేవా పాండురంగప్రభూ!

అన్నా! భవన్నామచింతన సుధారసప్రవాహమున స్నానంబున గ్రుంకులిడు నిలెంకిలపాప పంకంబు నింకింపవా? కోర్కెలఁదీర్పవా? పన్నగతల్ప! నన్ను మన్నింపవా? నాకష్టములీడేర్పవా? ఆహారంబు నారగింపవా? ఆరగింపని-కో మానసంబు విరుగునే? తల్లియుఁ బిల్లలు పిల్లవోవునే? నడువలేవే? లేవలేవే? భక్తులఁగావవే? నాతండ్రీ! లెక్కన్ని మపునిందగు నుద్ధుడు. కోపమూనిన-కో సకోపా పాపహర సంగంబు నేయు నేనశక్తుండను. బుద్ధిపై బంతమూనుట భాగ్యముగాదు. కరుణాసముద్రా! పరుసమేల? చిరంజీవ్రాయుఁడనే? చిన్న యాకార! పిసేవాడుడనే? నన్నారగింపనని గింపెనాసకో నరుగు నెంచితినే? నా కూరశబరాకఁ జేయునే? నాపండ్లనిఁ గూర్పంపము నకినా? ఎంగిలిఫలాన్నంబుల భుజింపనుంటినా? త్రికరణంబుల నిన్నే నమ్మియుంటినే?

శా. అన్నా! పెద్దయుఁబ్రొద్దునీపదనమందత్యంత సంతోషసం
పన్నంబైన మనంబుతో నిటుల సంభావించినన్ నిన్ను నన్
గన్నారంగనుజూడవేమి? కరుణన్ గాపాడరావేమి? యా
పన్నానేకజనావనా! మహితదేవా! పాండురంగప్రభూ!

(దుఃఖించుచు) స్వామీ! ఇంకను గనికరములేదా? నన్నుఁ బ్రోచుటవాడదా? మున్ను పుండరీకునిఁ బ్రేమాకులితస్వాంతంబునఁ జేపట్టితివే? ఎంత వేడినను గరుణలేదా? ఇంకెంతని కొనియాడుదు? ఇంకెంతని సన్నుతింతు? ఇంకెంతని నీనామచింతన సేయుదు? భక్తుల పాలిఁటి కల్పభూజమను సంకల్పంబు వికల్పమయ్యెనా? భక్తులపై నుంచు భావమిదియేనా? నిన్ను సేవించుట దుఃఖాకులితస్వాంతుల గుటకేనా? వరదుఁడనను బిరుదము వమ్మయ్యెనా? నన్నుఁ బ్రోచుటకు శక్తిలేదా? అట్టిచో సర్వశక్తిపరిపూర్ణుఁడనుదానికి సార్థకము లేదా? దేవోత్తముఁడవనికదా నిన్నుఁగొలుచుట? ఉత్తమశబ్దంబు ఉత్తవోయెనా? నీపదకమలంబుల భజించెడు నన్నుఁ గృతార్థునిఁ జేయవేల? అర్థిజనకల్పభూజా! యుష్మత్కరుణాకటాక్షంబొక్కపరి నాపైఁ బ్రసరింపవా? తండ్రీ! తనయుని తప్పుల సైరింపుము. నీ పుత్రునిపై శత్రుత్వమేల? అన్నా! నిర్వ్యాజకరుణారసపరిపూర్ణసంపన్నా!

దండకము.

జయజయ శ్రీపాండురంగా! కృపాదివ్యసంగీతరంగా! భవద్భక్తచిత్తాబ్జభృంగా! సురారాతింవ్ర సంకల్పభంగా! సంతత్కులసంరక్షణోద్దామదివ్యాంతరంగా! నినున్ నమ్మి భక్తిక్రియాభ్యక్తినై, సంతతధ్యానలోలుండనై, సంస్తుతింపన్ గృపన్ జూడవేలా? దరిన్ జేర్పవేలా? కృపాలోల! పాలింపవేలా? విలోకింపవేలా? జగత్ప్రియకా! లెంకపైఁ గోపమేలా? చలంబేల? చిద్రూపమున్ జూపి తుష్టాత్ముఁగాఁ జేయవేలా? ఫలాహారమత్యంత సంప్రీతిభక్షింపవేలా? ఆచారమున్నిల్పవేలా? రమేశా! పరేశా! సురేశా! మహేశా! లసచ్చిత్ప్రకాశా! నమస్తే నమస్తే నమస్తే నమః ॥ [ధ్యానలోలుఁడగును.]

(ద్వారము తెరువఁబడును పాండురంగడు ప్రత్యక్షుఁడు)

పాండు—కుఱ్ఱా! భవద్భక్తికి సంతసించితిని; లెమ్ము.

నామ—(కనులువిప్పి యెదుటఁ బాండురంగనిఁగాంచి) ఆహా! నా యదృష్టమెట్టిది! వర్షంబులకోలఁది వర్షాతపంబులకు సహించుచు గానసంబులఁ గందమూలఫలాశనులై ఘోరతపంబుల సల్పు సంయమీంద్రులకు నందరాని దర్శనం బీనాఁడనాయాసంబుగ నందఁగంటినిఁగదా? [చేతులు జోడించి] దేవా! సర్వేశ్వరా! పూర్ణప్రభావా!

అ ను బ ం ధ ము. ౭.

మ. భవవారాశిని నీఁదులాడుచును వేసట్ గాంచి నీ భక్తి నే
భవదీయాంఘ్రిసరోజముల్ గొలువ సద్భావంబునం బల్లఁ జి
క్కవతారంబులు దాల్చి ప్రోచెదవు; నేఁ డాక్రాంతచిత్తుండనై
భవపంకం బిఁకఁ బెంప దిక్కెవ్వరు దేవా! పాండురంగప్రభూ!

[అని ప్రణమిల్లును.]

పాండు—(లేవఁదీసి) కుమారా! క్షుధాగ్ని దహించుకొని పోవుచున్నది. నాకింత యన్నంబుఁ బెట్టవా?

నామ—[హర్షముతో] ప్రేమరస మొలికిపోవుచున్నది. ఆహా! భక్తవాత్సల్య మెంత సుఖప్రదాయకము. అన్నా! ఈయాసనంబునఁ గూర్చుండుము.

[కూర్చుండఁజేసి పళ్ళెరమును ముందుబెట్టును]

పాండు—(ఆరగించుచు) కుఱ్ఱా! నాయంకతలంబునఁ గూర్చుండవు రమ్ము. [అని చేరదీసికొనును.]

నామ—అన్నా! ఈభక్ష్యంబును నేతిలోముంచి తినినచోఁ గమ్మగా నుండును. [ముంచి నోటికందిచ్చును]

పాండు—(మైమఱచి) కుమారా! తల్లియైన యింతశ్రద్ధతోఁ గుడువ బెట్టునా? ఇట్టి భక్తులఁ గలిగియున్నచో నాకింక వలయునదే మున్నది! ప్రపంచమంతయుఁ బాపభూయిష్ఠ మగుచున్నది. నిక్కంపుభక్తిచే నన్నుఁ బూజించువారలరుదు. పెక్కుమంది సహేతుక భక్తులే కాని, యహేతుక భక్తులు లేరు. ఈకలియుగంబున జనులందరుఁ గలిమాయాపరవశులై కించిద్భోగంబుల కాసఁజెందుచు, దురాశాభోగసముద్ధితస్వాంతులై కేవలము జ్ఞానశూన్యులగుచున్నారు. నన్ను మఱచుచున్నారు. భగవంతుఁ డొక్కఁడున్నాఁడను మాట వారి బుద్ధికిఁ బొడమదు. ఏవంక జూచినను స్వార్థాభిలాషులే. పరోపకారమను మాటయే లేదు. ఇహమే శాశ్వతమని యెంచుచున్నారు. పాపకార్యాములను వెనుకంజ వేయుటలేదు. కులాచారములఁ బాలించుట లేదు. వృత్తిధర్మంబులు జూపుటలేదు, వర్ణసంకరమగుచున్నది ఒక్క భక్తుఁడైనను గానరాడు. మనస్స్థైర్యమనుపదార్థము లేదు.

జనులందరల్పబుద్ధి చేతస్కులై యస్థిరచిత్తులగుచున్నారు. పాపము పెరిగిపోవుచున్నది పుణ్యము నశించుచున్నది. జపదానధ్యయనాదికర్మములు నానాఁటఁ గాసిపొందుచున్నవి. విప్రులందఱు వేదాధ్యయన సంపన్నులమని చెప్పుకొనుటయే కాని శేషశేషిత్వంబుల నెఱింగినవా రొక్కరులేరు. లోకమంతయు నన్ను మఱచి నోరులేని రాయొక రాతిబొమ్మనని తలంచుచున్నది అంతయుఁ బురుషయత్నమే కాని దైవయత్న మొకింతయు లేదని పలువురు పలుభంగులఁ బలుకుచున్నారు. కొందఱు హరిభక్తులమని చెప్పుకొనుచు నుండగవారలచే నపకీర్తికాంతానాధులై నాకపఖ్యాతి వాటిల్లజేయుచున్నారు. ఎచ్చోటఁ జూచిన డంబాచార పరాయణులే కాని శిష్టాచారసంపన్నులొక్కరు లేరు. అధర్మము మూడుపాదముల నడచుచున్నది. జగము మిథ్యయని నమ్ముటలేదు. జగద్రక్షకులము దేశబంధువులము మేమేయని పేరుగల వారందరు విఱ్ఱవీఁగుచున్నారు.

పుత్రా! నీయట్టిభక్తులు నాకు లభించుటరుదు. నీభక్తి నిష్క-ళంకము——నిరుపమానము——నిర్వ్యాజకరుణారసపూరితము ఇట్టి భక్తులకు నేను నమ్రుఁడను. వారి యధీనుఁడను.

నామ——తండ్రీ! నీచింతనామృతపానమందరికి లభించినచో సమవర్తి నిరుద్యోగచక్రవర్తియై వర్తిలవలయునుఁగదా? కలిమాయాపరవశులగువారికిఁ గన్నులుండియుఁ దనుకూప్యములరంధ్రములవోలె నిష్ప్రయోజనంబు లగుచున్నవి. ఐహికసుఖంబులన్నియు వనచంద్రికావైభవములని యెఱుంగక యజ్ఞానాంధకారంబునంబడి చటులదురితతిమిరపటల ప్రచండమార్తాండనగు భవన్నామచింతనంబు నీడి కలిమాయాకులితస్వాంతులగుచున్నారు. అట్లతఁ——

శ్లో॥ పరిత్రాణాయసాధూనాం
వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ
సంభవామియుగేయుగే॥

అను నీసంకల్పంబు ననుష్ఠింప ధర్మసంస్థాపనంబునకై యెన్నిచోట్ల బాహ్యాంగావతారంబున వెలసితివి. ఇకను జనులు మూఢులగుచున్నారు. పాపాచరణ చేసియుంగాఁ నిట్టనుదింపుచున్నారు. కాలమహిమ వర్ణనాతీతముగదా తండ్రీ!

[నేపథ్యమునఁ జప్పుడగును]

పాప——(వికటనర్తనముచేసి) హాహాహా! ఎవ్వారో వచ్చు సడి యాగుచున్నది. ఇంక మసలుట కర్తవ్యముగాదు. పాపులకు నాదర్శనంబు దుర్లభంబు. వచ్చువారలు పూజారులై యుండనోపు. వారు నాద్రవ్య మపహరించువారలే కాని నిక్కంపు భక్తులు గారు వారలకు సామర్థ్యము లేదు. నన్నుఁజూచినచో వారు మందలింతురు. జ్ఞానభక్తులమని చెప్పుకొనుటయే కాని వారికి భక్తియన నెద్దియో తెలియదు. ఈపూజారులందరు దుష్టులు.

మీదుమిక్కిలి యొక్కొకవేళ నన్నే ధిక్కరించుచుందురు. అట్టివారలు నన్నుఁగాంచలేరు. వారలఁజూచుటయే నాకు ప్రాణాంతకమగును. నిశ్చలత్వము లేక నన్నెంత పూజించినను వారలకు నాదర్శనంబొసంగను. ఇఁక నేనిచ్చోట నిలువఁ గూడదు. నీవును బొమ్ము.

[అదృశ్యుఁడగును]

నామ—(విషణ్ణుఁడై) అయ్యో! రంగా! అప్పుడేపోవుచుంటివా? పోకు పోకుము ఒక్క గడియ నిలువుము. ఇసీ! అయ్యో! నిలువ వేమి? అంత తొందరయా? అబ్బా! ఏమి యాశ్చర్యము మేకను గాంచి మెకము వణంకినటులున్నదే! దుర్జయదానవ కంఠరవ కంఠలుంఠనుఁడవై యవక్రవిక్రమ పరాక్రమంబున నకుంఠిత తేజుఁడవై యొప్పునీవును దుర్జనభయంబు నందుచుం టివా? అవును. దుష్టునకు దూరమున నుండుట సమంజసమని పెద్దలు చెప్పుదురుకదా?

[ప్రవేశము—గుణాబాయి]

గుణా—(స్వగతము) కుల్లాలయంబున కరిగి పెద్దయుఁ బ్రొద్దయ్యె. ఆలయంబునకరిగనో లేక భక్తులెవ్వరేనిఁ గన్పడవారివెంట నరిగెనో? అబ్బ! పుత్రునిఁగన్నందులకు ఫలము సంతతముఁ జింతలపాలగుటయేకదా? ఇంతకును భగవన్నివేదనమునకు భంగమువాటిల్లియుండదుకదా? కానిమ్ము. ద్వారముచెంత కరిగిచూచెద.

[పోవుచుండ నామదేవు వచ్చుచుండును.]

నామ—(ఆశ్చర్యముతో) తల్లీ! ఏమిది? ఇచ్చోటికి వచ్చితివేల?

గుణా—నీవురాక మసలుటచే నిచ్చోటికేతెంచితి. కుమారా! ఇంత యాలస్యమేల చేసితివి?

నామ—అమ్మా! ఏమని చెప్పుదును? పాండురంగ దేంతవఱకు నివేదనము నారగింపక తడయుటవలన స్వామినిఁ బ్రతిమాలి యాహారంబు నారగింపఁజేసి వచ్చుచుంటిని. దానఁజేసి యాలస్యమయ్యె.

గుణా—(ఆశ్చర్యముతో) భగవంతుఁడేమి? ప్రత్యక్షమై యాహారంబు నారగించుటేమి? లోకములో లేనిసంగతినిఁ జెల్పుచుంటివి. పూజారులైనను జెయ్యిచూపువారే కదా? పాండురంగడు నీకుఁ బ్రత్యక్షమై యాహారంబు నారగించెఁగా? బొంకినను బదిమంది నమ్మునటుల బొంకవలె. మార్గంబునక్షుధార్తుల కెవ్వరికో కుడువఁబెట్టి నేను కోపగింతునని యీతీరున బొంకెదవా? హరిభక్తుండవై జ్ఞానసంపూర్ణుండవై తుదకొక యనృతంబాడి నీ భక్తిసంతతియుఁ గళంకముఁ జేసితివే? తండ్రీ! నిజముఁ జెప్పిన నేను కోపగింతునని భయపడితివా? నన్నిన్నిమారులో మూఢురాలవని మందలించితివే? ఇప్పుడు నీవెంతమూఢుఁడవైతివి?

నామ—తల్లీ! నన్నెంతమూఢునిఁగా నెంచితివి? నాభక్తికిఁ గళంకమాపాదించితివే. నాప్రాణాపాయకరమగు సమయమందేనియు నాభక్తి నిమ్మళింపనని నమ్ముము. లోకమెంతపాపభూయిష్ఠము? కమలంబుఁబోలె సాధుసత్తమ్ము, కన్నతండ్రి మాడ్కిఁ గాపాడు నాపాండురంగనికి నివేదనముఁ గుడువఁబెట్టక, మ్రొక్కుఁబడిఁ జెల్లించితిమిగదా యని యుబ్బితబ్బిబ్బులాడుచు భగవన్నివేదనమును దామె యాప్యాయనంబుగ నారగించుచు, హరిభక్తశేఖరులమని చెప్పుకొనుచుండెడి తస్కరులై పెద్దలగు నీపూజారులు పూజార్హులా? హా! నాపాండురంగని కిన్నమే పెట్టుటలేదా? మీరును బూజారులవలెనే భగవంతుని సేవించుచుంటిరా? ఎంతటిమౌర్ఖ్యము! ఇట్టివారలకు భగవంతుఁడు ప్రత్యక్షమగునా? భగవంతుని విత్తంబును దస్కరించినవారలకు జన్మరాహిత్యమున్నదా?

ముందు జన్మంబున నట్టివారు గుర్కులైపుట్టుదురే? ఈపూ
జారులందరును భగవంతుని సొమ్ము దినువారలేకాని భగవం
తునిఁ గొలుచువారలుగారు. అట్టివారలే నిక్కంపుహరిభక్తు
లని నమ్మిసేవించువారలెంతటి వివేకహీనులు! ఇదియంతయుఁ
గలిమాయా పరవశులగుటఁజేసి చేకురినదోసము.

గుణా — కుమారా! ఏలపూజారులదూషించెదవు? వారలకున్న లోక
జ్ఞానము భక్తిశ్రద్ధలు నీకుఁగలవా? నిరంతరము భగవత్సాన్ని
ధ్యమున వసించుచు భగవన్మహిమల సంపూర్తిగా నెఱింగిన
యర్చకులు పూజార్హులుగాక యెప్పుడో యొక్కపరి భగవ
న్నామచింతన సేయుచు నొకమూలఁ గూర్చుండి ధ్యానించు
వారలు పూజార్హులగుదురా? నీచెప్పిన కైవడి పాండురంగఁడు
భుజించినచో నాయెదుట నీ పాలనుఁగూడ ద్రావింపుము.
పాలీయ మఱచితిని.

నామ — [సంభ్రమముతో] నన్నుఁ బరీక్షింపఁదలఁచితివా? అమ్మా!
భగవంతుఁడీగుడిలోఁగలఁడు — అందులేడు — అను సందేహము
వలదు. ఆతఁడు సర్వగతుండు. ఎందు వెదకిచూచిన నందే
గలఁడు. అట్టితనిని ఎవ్వరేనియు స్థిరచిత్తంబున నవ్వాసుదేవుని
ధ్యానించినచో నప్పరాత్పరుఁడు తప్పక ప్రత్యక్షమగును. కాని
యస్థిరచిత్తంబున భగవత్సాన్నిధ్యంబున నిల్చి కలకాలముఁ
బ్రార్థించినను బ్రత్యక్షము గాఁడు అట్టివారల డాంబిక భక్తు
లందరు. కలియుగంబున డంబమే ప్రాణాధారము. నిరాడం
బరమున కాధారము లేదు. వేషము లేక భాష యున్న వానికిఁ
గాలము గాదు. ముందు వేషమే ప్రధానము. భగవంతునకు
వేషము ప్రధానముగాదు. గుణము ప్రధానము కాని జగ
మంతయు వేషమును గాంచి భ్రమపడుచున్నది మొగమునఁ
బట్టినామంబులఁ దీర్చి కర్ణములు వెలుఁగునట్లు రత్నఖచిత కుండ
లములఁ దాల్చి దుకూలాంబరముల ధరించి బయలుదేరినచో
నట్టివాడు దుర్గుణుఁడైనను వేషమువలన వానికి గౌరవమబ్బు

చున్నది. కాని నిక్కంపు భక్తుఁడు వేషములేక బయలుదేరిన వానిని నెవ్వరు సత్కరింపరు. అట్టివారలు నివురుగప్పిన నిప్పు మాడ్కి నుందురని యెఱుంగక యల్పులు గేలిసేయుదురు. నిక్కంపు భక్తుని గురుతించుట దుస్సాధ్యము. అట్టివారలునున్మాదులవలెనో, సన్యాసులవలెనో తిరుగుచుందురు. ఒక దెస దుర్భాషలనాడుటఁ జేసియు నింకొకవంక డాంబికుల సేవించుటఁ జేసియు జనులు పాపకూపంబునఁబడి లేవలేక యధోగతిపాలగుచున్నారు. తల్లీ! ఇదియంతయుఁ దథ్యము. నన్నుఁ బరీక్షించుట సమంజసమే. ఉదాహరణసహితంబుగాఁ బ్రజలకాదర్శప్రాయుఁడగుచో నప్పుడెల్లరు నమ్ముఁగలరు. ఏదీ పాలగిన్నె నిటు దెమ్ము. నీయెదుటనే త్రావించెద.

(పాలగిన్నెను తీసికొనును)

[చేతులు జోడించి] తండ్రీ! పాండురంగా!

అనుబంధము. ౧౮.

సీ. కరుణాపూరితవారి ప్రసూనముల సిగ్గింపు సంపమ్ము వేగ
పరమాత్మా యను పర్వతంబుల బహుళ బాపములయును స
ర్వేశ్వరా బాలను గాంచి నాపలుకుఁ బట్టంబుగుఁ బూనవే
పదాబ్జంబుల పూజ సేతు పాదుకా! పాండురంగ ప్రభూ!

(గిన్నెను నోటికందియ్య రంగనకు పాలను త్రాపును)

తల్లీ! గిన్నెను దిలకించి యిప్పటికేని నాపలుకు నిక్కంబని నమ్ముము.

గుణా—[తిలకించి సప్రేమముగ] కుమారా! నిన్నుఁగని ధన్యనైతి. నాజన్మము తరించినది. నీవు సాక్షాత్ వైష్ణవాంశ సంభూతుడవు కాదేని మానవమాత్రునకిట్టి సామర్థ్యముగలదే!

శ్లో॥ ఏకోపి గుణవాన్ పుత్రో
నిర్గుణేనశతైరపి
ఏకశ్చంద్రః ప్రకాశేన
నక్షత్రైః కిం ప్రయోజనమ్॥

అనుకరణి నీయట్టి పుత్రుఁడొక్కఁడే చాలు. నాతండ్రి! రమ్ము.

[చేరదీసి ముద్దాడును]

నామ—అమ్మా! చాల తడవైనది. గృహమునకేగుదము. రమ్ము.

[నిష్క్రమింతురు]

ఇది ప్రథమాంకము.

ఓమ్.

భక్తనామదేవ

ద్వితీయాంకము.

౧వ రంగము. అరణ్యము.

([illegible])

[కిరాతవేషధారులగు రుక్మిణీకృష్ణులు ప్రవేశము]

కృష్ణు——కాంతా! భక్తుఁడగు నామదేవు గురుని లేక కొంతకాల మాపు కొనుటకై యిట రాఁగలఁడు. ఇచ్చోట మనమాతనిని రెండు విషమ పరీక్షలయందుఁ దగుసాహాయ్యము జేయవలయు. వీసోభా కేశరునిఁ గుమ్మరిగోరామె యనువారల సేవ్యులుగాఁ జేసి యుంచితిని. అతఁడే తగినగురువని చెప్పి యిచటాతని సమానమును బరీక్షింపవలయును. రెండవదియగు భూతదయను బరీక్షించుటకై మనమీ కిరాతవేషమున జంతు మారణముఁ జేయుచుండవలయు.

రుక్మి——నాథా! నిన్ను నమ్మి సేవించువారల నిట్టి విషమ పరీక్షలఁ జిక్కించుదురా?

కృష్ణు—ఏమిది కాంతా! వింతగా నవుగుచుంటివి?

సీ. తండ్రి నొక్కనిఁగూర్చి దరిలేని కష్టాలఁ
గల్పించి ప్రహ్లాదుఁ గాచినాను
వనచరంబులఁ బెంచి వనముల నలయించి
వనచరు నొకనిఁ గాపాడినాను
ఘోరాటవుల నిరాహారంబు నొడఁగూర్చి
మునిపుంగవులఁ బ్రేమఁ బ్రోచినాను
చింతలఁ గుప్పించి సంతసముడిగించి
యలమటవెట్టి నిన్నరసినాను

గీ. భక్తులను బలుబాములపాలు జేసి
రక్షణము సేతు మన్ననో రాజ్యమందు
ముక్కుమూసుకొని తడవుగా మ్రోలనిలచి
ప్రోచువాడను నేగాను పాలతిమిన్న.

రుక్మి—అన్నివేషములకుఁ దగియుండు మీకు మాటలు రాకుండునా?

కృష్ణు—(దిక్కులు పరికించి] కాంతా! నామదేవు వచ్చుచున్నాడు. మనకృత్యము నింక నిర్వర్తింపవలయు.

కిరా—యెంకా! మత్తుగింజలేయన్నా యెత్తుకొచ్చాయంటే.

యెంకి—మత్తుగింజ లేమూడయిరా! ముందు వలపన్నరావంట్రా.

కిరా—ఏందశె పిచ్చెక్కిందాయేం? వూరికే వలేత్తే యేంపటతా యనుకున్నా.

యెంకి—పిట్టల పడతావనుకుంటుండావట్రా? సిపిట్టమాంస మోరిక్కావాలె. లేడిమాంసం యెత్తకరా.

కిరా—ఓశ్ లేళ్ళకేమే బళ్ళమీద తోలకరానంటా. ఏదీ వుండేలు బద్దియ్యి. ఒకసెయ్యి సూపిత్తా.

[వుండేలుబద్ద దీసికొనును]

మెంకి—(నలుదిక్కులు పరికించి) అదుగోనక్క శెవులపిల్లి పోతుండది. సూత్తానుంచుంటా యెందుకు ?

రా—యెత్తిమొగంలాగ మాటాడతా యెందుకు ? గురి సూసుకో వద్దా ? దీని పానంతీయకుంటే నాయేటకాడితనం యెందుకు! శెల్ రాంజోశ్

[సుందేలును బడగొట్టును]

యెంకి—ఈడ లేళ్ళగుంపులు యిరియిగా లేవు గాని అడివిలోకి పోదాం పదరా.

[పోవుచుందురు]

కిరా—(తొందరతో) అశనియెత్తిగాల. యెంకో! వలేతాం రాయే. అటుసూడే యెన్నిలేళ్ళుమందో. అమ్మబాబో కల్లు తిరిగిపో తుండాయిగందే. రాయే. వలపట్టుకొనియెయ్యే.

(ఇద్దరు వన్నుదురు)

యెంకి—నోరు తెరుసుకోని ఆడ కూకుంటా యెందుకు ? ముందుపోయి ఆటినంత వలకేసి అదిలిచ్చికరారాదు.

(కిరాతుండట్లు జేయ గుంపంతయు వలలోబడును

యెంకి—(ఆతురతతో) కత్తందుకోయింక. ఆకలి మండిపోద్ది.

కిరా—ముందు బానపొయ్యిమీదెయ్యే. యీటంటి సంపితే మన పొట్ట నిండుద్దిలే.

(కోయుచుండును)

యెంకి—(మాంసమంతయు బానలో వేయుచుండును]

(ప్రవేశము : నామదేవు)

నామ—నేను గురుపునకై కదా బయలుదేరినది. అదేమి పాపమో కాని నామనంబునకు నచ్చినవాడొక్కండును గాన్పింపడు. తిరిగి తిరిగి వేసారుటయేకాని సఫలీకృత మనోరథుడం గాజాలనైతి. ఎన్నిచోటులయందని వెతుకుదు ? ఎంతదూర మని యేగుదు? ముందు మార్గమును జూపువాడొక్కండును లేడే. గురువు నాకు లభింపడాయేమి ? కట్టా! దైవఘటన

మెంత చిత్రము. ఇంతదనుక పాండురంగని యాలయంబున స్వామి సేవామృతంబుఁ గ్రోలుచు నిర్విచారంబున నుంటినే. ఇప్పుడో ? యొక్క కర్జంబు నిర్జించు నుపాయంబుఁ గానక విచార వారాశింబడి కొట్టుకొనిపోవుచుంటినిఁగదా. ఆహా ! భగవద్భజనమహిమ యెట్టిది ?

అ ను బం ధ ము —

(ముకుళితహస్తుఁడై) రక్షా ! దుష్టజన శిక్షణదక్షా !

సీ. నీపాదకమలంబు నియతిమై మ్రొక్కెడి
శిరము శిరంబది పరమ సుగుణ !
నీనామమధురంబుఁ బానంబు సేసెడి
జిహ్వాక జిహ్వాక శేషశయాన !
నీపూజల సతంబు నేపారసల్పెడు
కరము కరంబది సరసిజాక్ష !
నీచింతనముఁజేసి నిశ్చలంబునుబొందు
దిష్టము దిష్టము త్రిజగవినుత !
గీ. నిన్ను వీక్షించు కన్నులు కన్నులహహా
నిను ముదంబున వినుతించు మనము మనము
రాజితాంగ ! సుజనమనోరంగ దురిత
భంగ ! రిపుభంగ ! శ్రీరంగ పాండురంగ !
(కొంతతడవు ధ్యానమనస్కుఁడగును)

[దిక్కులు పరికించి] ఆతపంబుకతంబున జంతుసంతానంబులు తరుగుల్మలతాదుల పొంతడాగుచున్నవి. ఆహా ! తరువొంటి పరోపకారి.

గీ. వన్నియుండిన జనుల బడలికఁదీర్చు
నిలువఁజాలని క్షుధుల యాకలినిఁబాపు
స్థలవిహీనుల కిరవగు తావుఁగూర్చుఁ
దల్లితోఁ బోల్పఁజెల్లును దరువొకట.

కొంతతడవీ తరుచ్ఛాయను విశ్రమించెద.

(చదికిలఁబడి యోజనానిమగ్నుఁడగును)

మొఁకి— మంచివాసనొత్తుండదిరా నామొగడ. [మూతఁదీసి] ఎందర్కి యెంతేశినా అదుక్కే పోద్ది. ఇంకా కొన్నిట సంపరా. ఇయ్యాల పొట్టపగిలేతట్టు తిందాం.

కిరా— ఏం సంపటం ఆశ. కోసికోసి నాసేతులు నెప్పెత్తుతుండాయి.

(అట్లులే కోయుచుండును)

నామ— (మాటలసందడి నాలకించి లేచి ముందనరిగి యాదృశ్యమునుగాంచి యదరిపడి) ఆ! ఆ! జంతుహింసయే! హరిహరీ! ఎంతటి భయానకము? ఎన్ని జంతువులు? హా! నోరులేని జంతువుల కెవరు దిక్కు? ఉదరపోషణార్థమై యొరుల ప్రాణములఁ దీయుటయా? పాపము! వాని ప్రాణములెంత ఘోషించుచున్నవో? మానవులక్కటికంబుఁ జూపనిచో జంతువులు జీవింపఁగలవే? ఈకిరాతునకవి యెగ్గేమి యొనర్చె. (సహింపఁజాలని భావముతో) ఓరోరి క్రూరాత్మా! సాధుమృగంబులఁ జంపుటకు నీకరంబులు కరంబుత్సాహమందినవా? భూతంబుల గారించిన భూతంబులు గారించునని యెఱుంగవా? ప్రాణముపైఁ దీపి యందరకు నొక్కే కరణియని తెలంపవా? (శాంతభావంబున) అయ్యో! నేనెంత మందమతిని? కిరాతుని దూఱుచుంట నేల? కాలము దాపరించినచోఁ గాల్జుఁ దేనియుఁ గూలిపోవునుగదా. మృత్యువే కిరాతరూపంబుఁ దాల్చి వానిఁ బరిమార్చుచుండె. ఆపన్నుల రక్షింప నాపన్నగశయనుకన్న నొండు రక్షకుండు గలఁడే? నాతండ్రీ! పాండురంగా!

సీ. ఇదిగదా? సమయంబు మొదలంటఁగూల్పంగ
జీవహింసావిధిఁ జిహ్వయాత్మ!
ఇదిగదా? కాలంబు హీనచిత్తులకహిం
సా గుణంబును దెల్ప సదయహృదయ!

ఇదిగదా? యనను దుష్టకిరాతుల చిత్త
ముల దయ నెలకొల్పఁ బురుషసింహ!
ఇదిగదా? తఱి జగదీశుని మహిమలఁ
జాటింప జగమున సత్స్వరూప!

గీ. లోకమా! హింసమయము కల్లోలములను
జీవహింసయ పరమ సంసేవనంబు
పాపభూయిష్టమా యెఁ బ్రపంచమంత
కరుణఁగాపాడు మోశౌరి! ఖలవిదారి!

అయ్యయ్యో! ఈజంతుహింస నేఁజూడఁజాల. ఎంత ఘోరము. (కొంతతడవాలోచించి) కానిమ్ము. వానికడకేగి కొంత నీతిని గరపి జంతుహింస మాన్పింప యత్నించెద. [వెళ్ళును]

కిరా—ఓరయ్యో మీరు? అడివిలోపడి ఒక్కడివే యాడికెల్తుండా వంట?

యెంకి—ఓరే తే నీకెందుకురా? నీపన్చూపు సూసుకోరాను. ఇంకా కొన్ని జీవాల్ని సంపు. మాంసం కడుపునిండాసాల్దనిపిస్తది.
(కిరాతుఁడు కోయుచుండును)

నామ—అబ్బబ్బా! కిరాతులారా! ఏల యీనీతిని జంతుహింసఁజేసెదరు. కాయగూరలఁ దినినచోఁ గడుపునిండదా? ఇన్నిజంతువుల ప్రాణముల జానెడు పొట్టకై చంపుట భావ్యమా? మర్త్యులు జ్ఞాన చేతస్కులని యెన్నఁబడినందులకు సార్థకముఁ జూపవలదా? తనకు నొప్పి కలిగిన నెంతబాధయో యెదిరికిఁ గూడ నంత బాధకలుగునని తెలుపవలదా? ఈ సాధుజంతువులు జనులకేమి బాధాకరములని హింస సేయుచుంటివి?

కిరా—ఓరయ్యో! యేట్టో తెగసెప్తుండావు. యింత యింత యని వగా పొద్దత్తమానం మొత్తుకుంటామెందుకు? పిచ్చోడా! యింతలేని సోకొకటుందా? యీబూమి యీమబ్బు యీ

తాగే నీలు యీయన్ని జంతుమయం గావా? యీటిలో యేడ యింసకాకుండ వుంటద్ది? బూమిని దున్నేతప్పుడు నాగేటియంచు గుచ్చుకోని యెన్ని పానాలు సత్తుండాయి. ఇంకా నీలు తాగేతప్పుడు యెన్ని జీవాలు పోతుండాయి. మనం నడిసేతప్పుడు మన పాదాలకిందఁబడి యెన్ని జంతువులు సత్తుండయి. ఇదంతా యింస కాదంటయ్యా! బలే యేదాంతికిమల్లే సెప్పొత్తా వెందుకు?

మొంకి—ఊరుకోరాదంట్రా! నీకెందుకీసుద్దులన్ని? మనమా త్తిరంయీనకి తెలిత్తే యింసెందుకు సేత్తుండవురాయని యడుగుతాడూ? యెన్ని మొగాలకి సుద్దులు తెలుత్తాయంట్రా!

నాము—కిరాతా! నీపల్కులు నిర్కువంబులు. పంచభూతంబులు భూతమయము. దానఁజేసి సర్వముహింసామయముగావచ్చును కాని యవియన్నియు మనచేతిమీఁదుగా జరుగుటలేదు. ఎఱుఁగక చేయు కార్యములన్నియుఁ బ్రబల దోషాకరములుగావు. బాలుఁడు బాల్యావస్థయందెన్నియో దుష్కృత్యముల నాచరించుచున్నాఁడు. అవి యన్నియు దోషములగునా? అజ్ఞానకృతదోషములని వానినన్నిటిఁ బెద్దలు పరిగణింతురు. కాని యిదిమంచి యిదిచెడుగు అని తెలిసిన పిదపఁ జెడుకార్యముల నాచరించినచో నవి ప్రబల దోషములగును. జంతుహింస పాపాకరంబని యెఱింగియు హింసనొనర్చినచో దానికివియన్నియు నుదాహరణములు గాఁజాలవు. సుగుణులగువారు భూమిమీఁద నడచునప్పుడు సాధ్యమగునంతవరకు జంతుమారణము నాపుచుందురు. అట్టియెడ నజ్ఞానముచేఁజేయు కృత్యములు హింసాకరములని యుదాహరణములుగాఁ గైకొనవచ్చునా?

కిరా—అయ్యా! ఎఱిఁగిసేత్తే దోసమని సెప్పితివిగంద. దీనికి సత్తెప్పమానంగా శెప్పుతాయిను. రాజులందరు యెఱిఁగికోళ్ళగందా? ఆరందరు అడివికి యేటకెల్లి యేటకేసి జంతుల్ని సంపటం లేదా? అది పాపంగాదాయని ఒకప్పు అడిగితే అది పా

దరమం అని సెప్పుతారెందుకు? అరి దరమంలో యింససేస్తే మంచిదని రాసుండిందా యేంది?

నామ—సప్తవ్యసనములలో వేటయొకటి యని మనకుఁ బురాణములు తెల్పుచున్నవి. అట్టియెడ వేట హింసాకరముగాదని యెవరు చెప్పఁగలరు? దుష్టశిక్షణము శిష్టరక్షణము అనునవి క్షాత్రధర్మములు ఆ ధర్మసంస్థాపనంబుకై రాజులు క్రూర మృగంబుల వేటాడి జనుల రక్షించుచుందురు ఒకవేళఁ గ్రూర మృగంబులఁ జంపుటయు హింసయైనఁ బరోపకారమున దానఁ జేకూరు పాపమిగిరిపోవునని సమర్థింపవచ్చు. కాని నీవు చంపిన జంతువులన్నియు సాధుమృగంబులు. వీని వలన జనులకు బాధలు కలుగవు. దానఁజేసి పరోపకారకృత్యమిది కానేరదు అట్టియెడ నిది హింసయగుఁగాని యహింస కానేరదు.

కిరా.—ఓరికో పరులకు మంచికలిగితే శేశేపాపాలన్ని పోతయ్యా? ఆయిదంగా పొయ్యేశట్టయితే మాకుమాత్తరం యేంపాపం ఉంటద్ది? మేమ్మాత్తరం పరోపకారం సెయ్యటం లేదా యేం?

నామ—వీనినిజంపి నీవెవరికుపకార మొనర్చుచుంటివి?

కిరా—ఓరికెందుకు సెయ్యాలంట? మాంపానానికి మేమే సేసుకుంటాం. మామణుసుకు దేనిమీదకోరికుంటే దాన్నెల్ల యెత్తుకొచ్చి పెటతాం. అప్పుడు మామణుసుకుపకారం మేం సెయ్యటం లేదా యేం?

నామ—తినకుఁదాను చేసికొనుట స్వార్థమగునుగాని పరోపకార మెట్లగును?

కిరా—సవార్థమెందుకవుద్ది? నాపానం నేను యేరేకాని మేయిద్దర మోటికాము. యిద్దరోటేఅయితే సచ్చేతప్పుడు ఓరిపానం ఆనెట పోదెందుకు?

యెంకి—నీకెందుకురా యీసుద్దులన్నీని? ముందీడ బానలో మాంసం యేమాత్తరం లేదు. ఏం తేసినా బానడుక్కేపోద్ది

గాని నిండనే నిండదలే. ఇంకా కొన్నిజంతుల్ని సంపకరా పో'య్యి. ఈడికూకుంటే యేంవుండది. (నామదేవుడికై-) ఓయి నువ్వేరివయ్యా ? మా పానం మీాదిప్పుడే పడ్డావు.

కిరా—అశనీయెట్టిగాల ? ; ఎంతేసినా అడుక్కే-పోద్దంటాయేంటే ? శిమిడిపోద్దేమో సూడే.

(అని లేచి పోంబోవును)

నామ—కిరాతా ! ఆగుమాగుము. జీవహింసం జేయుట మానుము.

కిరా—మానుకుంటే మాంసం యేడదొరుకుద్ది ?

నామ—మాంసమా ? ఆకులలంబులందిని బ్రతుకవచ్చు.

కిరా—ఓరు సెప్పారయ్యా నీకు ? యెట్టా ? పానాన్ని సంపుకోమం టావాయేం ?

నామ—(చిఱునగవుతో) కిరాతా ! ప్రాణముపై నీకంతటి ప్రీతియే యున్న చో సకలభూతములకు నట్టులనియె భావింపుము. ఒక్క-ప్రాణమునకే నీకింతటి యారాటముండ ప్రాణికోటికిం కెంతటి యారాటముండునో యూహింపుము. నీచే జంపం బడిన ప్రాణు లెంత ఘోషించియుండునో నీవు ణుమాత్రము నూహింపవైతివి. ప్రాణములన్నియు జలబుద్బుదసమానములు. ఎప్పుడేనియు నేపులివాతనో యేగోతియందునో పడి యీాశరీర ములు నశించిపోవును. ఇట్టి యశాశ్వతశరీర పోషణార్థమై యింతవరకుం జంపిన జంతువులు చాలక యింకను జంపుచుం టివా ? ఇంతటనైన మానుము.

కిరా—నీమాటయిని తెరితరాలమట్టి వత్తుం చేకుంటయింకాని మానుకో మంటావా యేంటయ్యా ?

నామ—(కడువిచారముతో) హరిహరి ! జీవహింసచేసే మీాకుం గుల వృత్తియయ్యెనా ? హా కృష్ణా ! జంతుమారణము నీకిం దగిన వృత్తియని భావించితివా ?

చ. అడవులయందుఁ బచ్చికల హాయిగ మేసెడి సాధుజంతులన్
విడువక జీవహింస కులవృత్తియటంచుఁ గుఠారధారులై
దుడుకుతనాన నైమఱచి త్రుళ్ళుచుఁ దూలుచుఁ జంపువారలీ
యుడుములఁ బాపి కావఁదగదే? మురమర్దన! యోజనార్దనా!

యెంకి — కడుపంటుకపోతావుంటే ఉపన్యాసాలింటూ కూకుంటె బొట్ట కూడెక్కడ దొరుకుద్దిరా ?

[ఆతురమునఁ గిరాతుఁడు పోఁబోవును]

నామ — కిరాతా ! నాబొందిలోఁ బ్రాణము లుండునంతవరకు నీవు జీవహింసఁ జేయఁజాలవు. నేఁజూడఁజాలను.

(అడ్డముపోవును)

కిరా — అయ్యా ! మాయిత్తి మేంచేసుకుంటానికి నీవోరివయ్యా అడ్డమొత్తావు. వుండువుండు.

నామ — కులవృత్తియైనను దానికిఁ బరిమితికలదు. కాని నీవన్నదో యద్దానిని దాటిపోవుచుంటివి. అదిగాక —

శ్లో. పరోపకారాయ ఫలంతివృక్షాః
పరోపకారాయ దుహంతిగావః
పరోపకారాయ వహంతినద్యః
పరోపకారాయ కృతోమనుష్యః.

అని ధర్మశాస్త్రములు బలుకుచుండ జీవహింసకై యేల యత్నించెదవు. నామాటవినుము.

కిరా — నీవుపన్యాసాలిక్కడయునే చెప్పుతుపో. పెద్దయడిసెగందని ఊరకుంటావుంటే అదేపనిగా అయుత్తావేమును ? సెపుతున్నా! బెమ్మమున్నొచ్చినా నన్నాపలేడు. నూవేంటో ఆపుతానంటావేం ?
(పోఁబోవును)

నామ—(పట్టుదలతో) కిరాతా! నన్నుదాటిపోవ నీతరముగాదు.

[అడ్డముపోవును]

కిరా—[కోపముతో) నిదానంగా సెప్పుతుంటే యినవాఁగేం! నడుంగ నూనోడివి నన్నాపటానికి? పో ఆతులికి పో.

[నెట్టివేయును నామదేవు క్రిందఁబడును]

నామ—[మిక్కిలి పట్టుదలతో లేచి] కిరాతా! నానిశ్చితంబువినుము జగమంతయు నీకు సాయమొనర్చినను నామేనఁ బ్రాణము లుండునంతవరకు నవహింసఁ జేయఁజాలవు.

కిరా—నీపానంమీదికి నీవేతెచ్చుకొంటుండావు. యీాటితోటిపాటు నిన్ను సంపి మరి పోతాసూడు. (మొకిడికైట) మొరా! ఆక తిట్టివ్యో యీాడిపని పట్టిత్తాను. శెప్పితే యినకుండుండాడు. (నామదేవు మెడను బట్టుకొనును)

నామ—హా! ఇపుడేమిగతి? (చేతులుజోడించి) పాండురంగా!

అ ను బం ధ ము ౧౦

తోహర.

తాటకమర్దన! యోముఖమర్దన! శైవశిఖామణి! ప్రోవఁగ నే
నీటనుముంచినఁ బాలనుముంచిన నీదియెభారమటంచు ని నే
ప్రాణముఁ దృణముగఁ బాయుచునుంటిని బాంసపన్నిక సేయఁగ నే
మానుగ భూతదయాపరతంత్రుల మహిమ సద్వృత్తిని జేయఁగ నే.

[నామదేవు మూర్ఛపడును]

[కిరాతుఁడు కత్తియెత్తును—తెరజారును]

౩వ రంగము. అరణ్యము.

(నామదేవుని వేషధారణ మెప్పటివలెనే యుండవలయును. దీర్ఘాలోచనచే బడలియుండుటచే మించినవానివలెను కట్టుపలుచగను ఓపికలేనివానిగను తూలుచున్నట్లుగను జూపట్టవలయును. వేషమున గుమ్మురోగిగా నుండవలయును. శరీరమందంతటను గట్టుకట్టుకొని ఈగలతో లుకొనుచున్నట్లుగను బాధపడుచున్నట్లుగను నటింపవలయును. వస్త్రధారణము కావిబట్టగూడకట్టును జడలుగల తలకట్టును పెద్దగడ్డము తగినమీసమును గలిగి మునివేషమున నుండవలయును.)

[తెరనెత్తగా నామదేవు మూర్ఛనుండి లేచుచుండును]

అనుబంధము ౧౧.

నామ—[హర్షాముతో] ఆహా! పాండురంగనికి భక్తులయం దెంతటి వాత్సల్యము. భక్తులకై పలుకష్టములకు లోనగుచుండును గదా. గురునిఁ గన్గొనఁజాలక పలుబాధల నొందుచుంటినని నాపాండురంగడు కిరాతరూపంబున సాక్షాత్కరించి సద్గురుని జాడఁ దెలిపి యదృశ్యుఁడయ్యె. కిరాతరూపంబున నెంతయో జీవహింస యొనర్చెఁగదా? భగవంతుడేలాకో యిట్టుల సల్పుట? ఏమో పరాత్పరుని చెయ్దములు గుర్తింప నేరికి తరంబు! (ఏదియో సందడియగుడు నటునిటుఁజూచి) ఏమిది? ఇంతలో నిన్ని కురంగము లేడనుండి వచ్చుచున్నవి. ఇంతదనుక నీయడవియంతయు జంతుహీనమై యుండెఁగదా. ఇదేమో కడువింతగానున్నది. [ఆలోచనమభినయించి] ఓహో! తెలిసినది. మున్ను కిరాతావతారుఁడగు పాండురంగనిచేఁ జంపఁబడిన కురంగములై యుండనోపు. ఆప్రదేశమునకరిగి తిలకించెద. పరాత్పరుడు భూతదయాపరతంత్రుఁడుగదా.

[ఆప్రదేశమునకరిగి చూడ నొక్కశల్యమైనఁ గాన్పింపదు]

ఆహా! ఇదియంతయుఁ బాండురంగనిలీల. సర్వశక్తిపరిపూర్ణుఁడగు వానికిఁ జేయఁజాలని కార్యమొండుకలదా? భూతదయాస్వాంతుఁడగుట మున్ను తనచేతి సమసిన శశవిసరమ్ములను కురంగములను బ్రతికించినాఁడు. నామసప్తాప మిప్పటికి గతించి

నది. ఆహా! నేనెంతధన్యుఁడను. భగవంతునిలీలల వర్ణించు భాగ్యముకాక తనివిదీర గాంచుభాగ్యముకూడ లభించినది. (భక్తిపరవశత్వమున) తండ్రీ! పాండురంగా! నీచర్యలు వర్ణనాతీతములుగదా? కించిజ్ఞుఁడగు నేను నిన్ను వర్ణింపగలనా?

సీ. లోకపాలక! సర్వలోకపూజితభావ!
భావనాతీత స్వభావమూర్తి!
మూర్తిత్రయాత్మక! మూలకారణదేవ!
దేవాదిదేవ సంభావనార్హ!
ఆర్తరూపవిహార! హారచిదాకార!
కారణాకారణాకార! ధర!
ధీరమానసగేహ! దివ్యహర్మ్యనివాస!
వాసవార్చిత! స్వప్రకాశమాన!

గీ. మానసరమణ పికపాలి! మునులచిత్త!
చిత్తరంజన! త్రిపురగజమత్తసింహ!
సింహపీఠిక పురరాజ శ్రీనివాస!
వాసుదేవ! మహాదేవ! వందనీయ!

(నడచుచు) ఈవనమెంత నేత్రానందకరమై యొప్పుచున్నయది. ఆహా! వివిధలతాకుసుమపల్లవితతరుశోభితమై శకుంతసంతానంబుల కాలవాలంబై యొప్పు నీవనము నందనవనమును మరపించుచున్నది. ఇందు జరించు జీవంబులు ప్రకృతికాంత సౌందర్యాతిశయంబులఁజిక్కి సొక్కుచుండునుగదా. ఏమి ప్రశాంతము? ఏమి సుఖదాయకము? ఇట్టులుండఁజేసియే మహర్షులు వనములందు వసింప నుత్సహింతురు. (దృష్టి సారించి) అల్లదే కానంబడునది పాండురంగదాస తిచ్చిన నాగనాథస్వామి యాలయంబైయుండనోపు ఏమియీ యాలయపు విలాసము.

ఉ. ఆకసమంటు గోపురమహో యనుపించెడి చారునూతనా
నేక మణీ కవాటములు నేర్పునఁ దీర్చిన విగ్రహాంబు ల
స్తోకములైన కుడ్యములు శోభితకాంతులనీను ద్వారముల్
ప్రోకల చాయలగ్గనినఁ బోలవు తక్కటి దేవళంబులున్.

ఆలయమే యింత సుప్రసిద్ధమైయుండ నిక నాలయంబుననుండు మహానుభావు లెంతటివారలో కదా? తినఁబోవుచు రుచులడుగనేల? పాండురంగనిచేఁ దెలుపఁబడిన వారలు మహాత్ములు గాకుందురా? (స్పర్శమభినయించి) ఏమిది? నాహృదయమేలో గుడిసమీపించిన కొలఁది దడదడకొట్టుకొనుచున్నది. ఓహో! పెద్దలకడకేగునప్పుడు చిన్నవారలకుండు లక్షణమే కదా? ఆమహాత్ముఁడు నన్నుఁ గరుణఁ జూచునో చూడఁడో! సద్గురుఁడగువాఁడు కరుణామయుఁడు గాకుండునా! ఏలనాకీ వృథాచింత. ఆమహాత్ముని దర్శించినచో నన్నియుఁ దెలియఁ గలవు.

[గుడిని సమీపించును—ద్వారమును దెఱచును]

(ఆశ్చర్యాసహ్యములతో) అబ్బా! ఏమి యీ దుర్గంధము? భరింప శక్యముగాకున్నదే. హరి హరీ! ఇందెవ్వరైన జీవహింస సేయుచుండిరుగదా? అహింసాపరులిందున్నచో నీదుర్గంధమునకుఁ గారణమేమి? (స్మృతి నభినయించి) ఇదియునుగూడ పాండురంగని కృత్యమై యుండవలె. కిరాతవేషంబునఁ బరీక్షించినది చాలక, యిప్పుడిచ్చోట నీదుర్గంధమును గల్పించి మరల బరీక్షించుచుండె. కానిచో నింతటి దుర్గంధము లోకమున నెందైనఁగలదా? అబ్బ! ఎంతయత్నించినను ముందునకుఁబోఁజాలకుంటినే. అయ్యో! పోకున్న నెట్లు? (ముందంగవైచును. తిరిగి బయటికి వచ్చును)

(పవనస్పర్శమనుభవించుచు) ఆహా! పుష్పాదుల మేన నలందుకొని యపరాలిపోవునేమోయను భయంబున మెల్లనఁ గదలుసీమారుతుఁడెంతటి యానంద మొసఁగుచున్నాఁడు. పాపము! ఇట్టి పవనస్ప

ర్యముఁ బడయఁజాలక యాదుర్గంధవారాశిని దొప్పదోగు నా ప్రాణి యెట్టిదో కదా? (కొంతవడి యోజించి) ఓహో! నేనిచ్చోటఁదడయు చుంటినేల? నావచ్చినకార్యము పూర్తికావలదా? (విరక్తిభావమున) దుర్గంధమున కైగదా భయంపడివచ్చితి? ఏమి నాపిచ్చి తలంపు! ఎంత మందమతిని! ఈ నాశరీరము దుర్గంధయుతముగాదా? నేను దుర్గంధ మున మునిఁగియుండలేదా? చిత్తమా! ఎంత భ్రమనందితివి?

ఉ. చెందిన రక్తమాంసములు చీమునరంబులు శల్యసంతతుల్
క్రిందుకొనన్ స్వరూపమునఁగ్రాలు కళేబరసీమయందు నే
చందముతో సుగంధకణసంతతి డిందుపథంబుగందు? దు
ర్గంధమె పర్శభూమిని సికారులొసర్వఁగ మూఢచిత్తమా!

[అని లోనికేగును]

[పీసో బాకేశునిఁగాంచి] ఆహా! ఏమి యీతపశ్శాలి తేజము! ఈతఁడెవ్వఁడో సంయమివర్యుఁడై యుండనోపు. పాపము! కర్మపరి పాకము చేతఁ గుష్ఠరోగియయ్యె కట్టా! తపోనిధియని యెన్నఁబడినను గర్మబద్ధుఁడైయుండవలసినదే కదా! పురాకృత కర్మఫలంబుల ననుభ వింపక తీరునా?

ఉ. ఎంతతపంబుఁజేసిన మహెంతటి తీర్థములందు గ్రుంకినన్
జింతన సేసినన్ బురుషసింహులెల్లల భక్తియుతు న
త్యంత ధనాఢ్యుఁడై ఘనసుఖాంబుధి మగ్నతఁ జెందినన్ వృథా
చింతయు రాని యెల్లరును జిక్కుదురే యెడఁ గర్మబద్ధులై.

విరించి చేష్టలతిచిత్రములుగదా? సుందరునకుఁ గురూపిని, కురూపునకు సుందరిని, గర్భదరిద్రునకుఁ బుత్రసంతతియు, భాగ్య శాలి కనపత్యతయు, సన్మార్గులకు ఖేదంబును, దుర్మార్గులకు మోదం బును గూర్చుచుండును. ఎచ్చోటనేనియు రత్నమునకు సరియైన రత్న మబ్బునే? పురాకృత కర్మానుభవమునఁగగా యెల్లజీవులు జగన్నా

టకరంగంబునఁ బాత్రలధరించి తమ తమ ప్రదర్శనాకౌశలముఁ జూపి యంతమొందుటే? పాండురంగఁడీతఁడే తగిన గురుఁడని తెల్పియుండె. కుష్ఠరోగియైనను నీతనికే శుశ్రూషలొనర్చి పరమార్థమెఱింగెద.

[సమీపించి యదరిపడి] కటకటా! ఈమహాత్ముఁడెట్టి పాపకార్యమునను లోనైయున్నాడు. భువనత్రియ జీవసంహారణమూలకారణమూర్తియు — క్షీరసాగరమథనకాలజనితదందహ్యమానహాలాహలభక్షకుండును — సర్వగ్రాఖర్వగర్వప్రతాపదీపనిర్వాపణమహాబలుండును — అగు ధూర్జటి శిరంబున — పావన గంగాతోయమ్ముల నతతము మునుంగు శిరంబున — కంటకసమానములగు బాదములు వెట్టెనే? పురాకృత కర్మఫలంబున నిట్టోడఁ గుష్ఠరోగియయ్యుఁ దిరిగి పునర్జన్మ సంభూతుఁడగుటకై యీమహాదేవు నవమానించుచున్నవాఁడే. అయ్యో! పాండురంగా! ఎట్టిమహాత్మునకెట్టి విపద్దశఁ దెచ్చిపెట్టితివి ఈ కృత్యము విపరీతముగదా? ఏమో, మహాత్ములకార్యములు కడు విపరీతములు. తొల్లి కుంభసంభవుఁడు సముద్రోదకంబును మూఁడు పుడిసిళ్ళఁగాఁ గ్రోలె. కౌశికుఁడు సృష్టికిఁ బ్రతిసృష్టిఁ జేసె. అక్కరణి నిదియొక మహాత్ముని చర్యయేమో? లేక నా పరితాపమును పన్నిన పన్నాగమో? కానిమ్ము నాకీ గొడవలేల. మహాత్మా! నమస్కారము. (పదములంటి మ్రొక్కును)

వీసో — (ఉస్సురనుచు) అయ్యో! అయ్యో! పాపాలికిఁ గరుఁడనైతివే? అబ్బబ్బా! నీనమస్కారము లెగిరిపోను. కురుపులన్నియు రేగెఁగదా?

నామ — (భయముతో) స్వామీ! అపరాధము క్షమింపుము.

వీసో — అయ్యో! క్షమాపణలు తరువాతఁ గావచ్చును ముందు కొంచెమువిసరి పుణ్యముఁగట్టుకొమ్ము.

నామ — (చెంతఁగూర్చుండి విసరుచు) మహాత్మా! సకలము నెఱింగిన మహానుభావులరగు మీకు ముక్కంటి యుత్తమాంగంబునఁ బాదంబులుంచుట భావ్యమనితోఁచెనా?

పిసా — కుమారా! నేనేమి చేయుదును ? ఇచ్చోటనుండి లేచుటకు శక్తి యణుమాత్రమైనియు లేదు. భావ్యముగాదని తోచి నచోఁ దొలఁగించి పున్నెముఁగట్టుకొమ్ము.

(నామదేవు పాదములుదీసి యొండొకచోటనుంప నచ్చోటను శివలింగముపైననేయుండును. ఆశ్చర్యముతో రెండుమూడుపర్యాయము లట్లు లేచేయఁ దొంటిమాదిరియే జరుగును.)

నామ — [ఆశ్చర్యమున స్వగతము] బాపురే! ఇట్టివింత నెందైనఁ గంటిమా? చంద్రశేఖరుని శిరంబునఁ బాదములుంచుట పాపంబని పాదములు దొలఁగింపఁ యథాస్థితియే సంభవించె. ఆహా! ఆమహాదేవున కీమహాదేవుని పాదములు శిరోభూషణము లయ్యెఁగాఁబోలు. లేనిచో సమస్తదేవాసురముని కిరీటప్రభా భాసమాన చరణారవిందుఁడగు నాగంగాధరునకీతని నిగ్రహించుట యొక గణ్యకార్యమా? యతీంద్రులకుఁ జతుర్దశభువనంబులు వశంకవలసినవే కదా. పాండురంగనికి నచ్చిన పురుషుఁడు మహాత్ముఁడుగాక సామాన్య మానవుఁడగునా? ఈతఁడే యజ్ఞానతిమిరభాస్కరుఁడు. ఇంతదనుక నీమహాత్ముని నిట్టుల భావించితి? నివురుగప్పిన వహ్నియని యెఱుంగకపోతినే? ఎంతయజ్ఞానుఁడనైతి. కాని మహాత్ముఁడగు వానికీకుష్ఠరోగ మేల ప్రాప్తించెనో? (ఆలోచించి) పరప్రాప్తించెనని తలంపనేటికి? నన్నుఁ బరీక్షింపఁ బాండురంగనిచే నియమింపఁబడి యిట్టి వేసముఁదాల్చియుండనోపు. రంగా! నీమాయ లసదృశములుగదా. లేనిచో జగంబునఁ జూడఁజాలని యిట్టి కుష్ఠరోగియగునా? ఏమిది? దుర్గంధ ముసుముసలించుచున్నదే. కానిమ్ము. మహాత్ముల సంసర్గమువలన దుర్గంధమును సహించుటొక లెక్కయా? (ప్రకాశము) స్వామీ! ఈయజ్ఞాను ననుగ్రహింపుఁడు.

వీసో—[గద్గదస్వరమున] అయ్యో— ఈకుష్ఠ.....రోగిపై.....గురు భావ.....మేలయుంచె.....దవు. నోటమాట.....లేనియీ .....నిర్భాగ్యుడు.....నీకు పర .....మార్థమును .... బోధింపఁ.....గలఁడా ?

నామ—[చేతులు జోడించి] స్వామీ ! మీ సందర్శన కతంబుననే యీ మూఢుని మాఢ్యము కొంత సమసిపోవ నిఁక దర్శనా ధార భూతునకుఁ బరమార్థ మెఱుక లేదనిన నమ్మఁగలనా ? దేవా ! తమబోటి యతీశ్వరుల కృత్యంబులు వర్ణనాతీతములు గదా ? అల పరాశరుండు మత్స్యగంధిని యోజనగంధిగా మార్చె. అలగౌతముఁడు విరూపాక్షుని సహస్రాక్షునిఁగాఁ జేసె అట్టిచో నన్నుఁ బరీక్షించుటకై యట్టి రూపంబున నుంటిరే కాని సాక్షాత్కుష్ఠరోగివి యగుదురే? ఈ మీ సేవకుని చేత సేవఁజేయించుకొనుఁడు.

(పాదములొత్తును)

వీసో—(నోటిమీద చెయ్యివేసికొని) అయ్యయ్యో! నీవు నాకెక్కుడ దాపరించితివి. ఓయి దేవుఁడా ! ఈకుష్ఠరోగిఁగాఁ జేసిన యది చాలక యీ మూర్ఖుని నాపాలి కాలకింకరుఁగాఁ బంపితివే. హరిహరీ ! తోలుదొల్చనే బాధచేఁ గుందుచుండఁ బైని యీతని సపర్యలు మఱింత బాధింపఁదొడంగె. నేఁడెట్టి కష్టంబు ప్రాప్తించె. అయ్యో! తీపులు మెండగుచున్నవే. (చిరాకుతో) అయ్యా! నీసపర్యలచే నన్నుఁ గష్టపెట్టకుము. నాకేమియుఁ దెలియదు. నీతోవను నీవుబొమ్ము. నాసేవఁ జేసి నీవేమితరింపఁగలవు? అనేక యతీంద్రులిక్కాననంబునఁ గలరు. వారలసేవించి కృతార్థుఁడవుగమ్ము.

(నిమీలితనేత్రుఁడగును)

నామ—[కడుశాంతముతో] స్వామీ! నన్ను కసిరికొట్టినను మిమ్ము విడువఁజాలను. నామనంబునకు నచ్చిన గురువులు మీరలే.

మీరు పాండురంగనిచే నియమింపఁబడి యిట్టి యవతారమెత్తితిరి కాని నిక్కంపుగుష్ఠరోగులు కారు. దేవా! మీ సుకుచిరాంగంబు నీపామరునకుఁ జూపుడు. పరమార్థ బోధామృతంబున నీయజ్ఞానుని జిహ్వాకఁదడుపుడు. దాసునిపైఁ బంతిమూనుట దాసజనావనలక్షణమా? తండ్రీ! కాళ్ళఁబడి మ్రొక్కుచుంటిని. రక్షింపుడు,

[పాదములచెంత సాగిలఁబడును]

విసో—[స్వగతము] పాండురంగని యాజ్ఞాప్రకార మీతని సహానముఁ బరీక్షించితి. ఇంకను బరిశోధించుట కిదు మూర్త్వము. ఆహా! ఎంతటిదుర్గంధమును సహించె? ఎంతటి నిశ్చలభావంబున నిలిచె? ఎంతకినిని దొలఁగిపోవక నేనయె దిక్కని నమ్మి ధూళిధూసరపరివృతంబగు నీకటికినేలపైఁ బాదములచెంతఁ బవ్వళించెఁగదా? ఇట్టిభక్తునిఁ గష్టపెట్టుట భావ్యముగాదు. ఈతనినిప్పుడె చేరఁదీసి తారకమంత్రోపదేశ మొనర్చెద. ఇప్పుడు నాకీమారు వేసమేల? [నిజరూపంబునఁ బ్రకాశము] కుమారా! నీమనోహరుండిదే నీకై వేచియున్నవాఁడు లెమ్ము.

[లేవఁదీయును నేమముపూన్చును]

నామ—(లేచి సంభ్రమాశ్చర్యములతో) స్వామీ! ఆ కుష్ఠరోగులు మీరయేనా? ఇంతలో నంతటి కుష్ఠరోగమెక్కడకేగె? ఇదంతయు నాపాండురంగని మహిమ. తండ్రీ! నామస్తకముపైఁ గనికరముంచి మీశిష్యునిఁగాఁ బరిగ్రహింపుడు.

విసో—కుమారా! నీమనోభావము నే గ్రహించితిని గురూపదేశమునకై నీవిచ్చోటికి కేతెంచియుంటివి. గురూపదేశ మెంతవారికేనియు నుండవలె. అదియే మోక్షమునకుఁ ద్రోవఁజూపునది. రెండవది భక్తి. భక్తికి మూలకారణము నిశ్చలత్వము. నిశ్చలత్వము గుదురుటకు ముందొకదానియందు మనస్సు లగ్నమై

యుండవలె. లగ్నమగుటకుఁ బ్రేమ మూలసాధనము. అట్టి ప్రేమ విషయవాంఛలఁ దగుల్కొనినచోఁ బలుతెఱంగుల విచ్ఛిన్నమైపోవును. అద్దానిని విష్ణుసంకీర్తనమ్మునకు మరల్పవలె. అప్పుడు పైఁజెప్పినవన్నియు నొకటివెంట నొకటిగా లభియించి తుదకు భక్తిగాఁ బరిణమించును. భక్తియందుఁ బెక్కురకంబులుగలవు. అన్నిటియందు రెండు విధములే మనకు ప్రధానములు. అవి హేతుక — అహేతుకములు. హేతుక భక్తియనఁ గారణముతోఁ గూడుకొనఁబడినది. కారణము నిరూపింపఁబడినప్పుడు దానఁ గల్గు భక్తి విషయములందాసక్తియుండును విషయాసక్తమైన భక్తిచే భగవత్సాన్నిధ్యమును బొందుట దుర్లభము రక్కసుల భక్తియంతయు హేతుకము. అందుఁజేసి వారలెంత తపశ్శాలురైనను కృతకృత్యులు కాఁజాలరైరి. ఇక నిర్హేతుకభక్తిఁగూర్చి చెప్పనలవిగాదు. నిర్హేతుకభక్తి సంపూర్ణునకు విషయములం దాసవాంఛనుడు. సహేతుకభక్తిచే కొంతకతటిఁ బ్రాక్తనకర్మములకుఁ బాల్పడవలసియుండును. కాని నిర్హేతుకమునకట్టి గుణములేదు. ప్రహ్లాదుని భక్తి నిర్హేతుకము ఎన్ని యిక్కట్టులు చేకూరినను నిర్హేతుకభక్తియుతుండగు బ్రహ్లాదుండు వాని నన్నిటి జయించి కడకు మోక్షసామ్రాజ్య ధురంధరుండయ్యె. కావున—

ఉ. హేతుకమైనభక్తి ఫలియించును దారుణపాపపుంజసం
జాత మనోవిషాద మపసానుజసింపి హాకిశోరమైన ని
ర్హేతుక భక్తికైవడి రమేశుని పాదసరోజధూళి మై
పూతెగఁ బూయువారెవరు? పొందుటమాధవలోకసౌఖ్యముల్.

పుత్రా! పాండురంగని నిర్హేతుకభక్తితో నారాధింపుము. ఎట్టిఫలమునకేనియు నాసింపవలదు. ఆసించినచో నది సహేతుకమగును. కొందరు పురుషార్థములఁ గోరి భగవంతు నారాధింతురు. అట్టిదియంతయు విష్ణు సాయుజ్యమునకుఁ గంటకసమానము.

ఉ. భాసురరంభకుంభకుచభారములబ్బుట యేమిలెక్క? జం
భాసురవైరిపోలె నసమానసుఖంబుల నందుటెంత? సే
రాసను భూమిపాలుఁడయి రాజ్యము సేయుట యేమిగొప్ప? రా
కాసురవైరినెప్డు పరమార్థమెఱింగి భజించు టొప్పగున్.

ఇంతవఱకు భక్తిమార్గంబు నెఱింగితివి. ఇఁక ధర్మసూక్ష్మత నెఱుంగుము. నీకు సమత్వముఁ గలుగలేదు. పాండురంగఁ డాలయమందే యుండునని భావించుచుంటివి, అటుల భావింపఁ గూడదు. ఈ సకల చరాచరంబులయందును పాండురంగఁడు సూక్ష్మరూపంబున వర్తించుచున్నాఁడు. అందరును పాండురంగని స్వరూపులే. అందరును పాండురంగని యాజ్ఞాబద్ధులే. తృణమైనను నాతని యాజ్ఞ లేనిది కదలఁజాలదు. ఆత్మయే పరమాత్మ స్వరూపము. నీయాత్మయు నాయాత్మయు నేక స్వరూపములే. ఆత్మను వశపఱచుకొనినచో నప్పుడు పరమాత్మను వశపఱచుకొనఁగలవు. ప్రతిజీవమునందును పరమాత్మస్వరూపము నిలచియున్నది. అన్నియును సమానములే భగవంతుఁడనేక నామములతో బిలువఁబడుచున్నాఁడు కొందరు "కృష్ణా" యనియుఁ గొందరు "ఈశ్వరా." యనియు గొందరు "రామా" యనియుఁ గొందరు 'పాండురంగా, యనియుఁ బిలుచుచున్నారు. ఇవియన్నియు నేకరూప ప్రధానములు. ఏకగుణాకలితంబులు. ఏకజ్ఞానగోచరంబులు. అన్ని నామములను సమబుద్ధితోఁ బాటింపవలయు. అణుమాత్రమేనియు భేదము నాపాదింపగూడదు. భగవంతుని

లీలలన్నియు నీనామములయందును జెల్లుచుండును. కలియుగంబున భగవంతుఁడు 'కృష్ణా' యను నామంబునఁ బూజింపఁబడు చున్నవాఁడు. అట్టి కృష్ణునిలీల వర్ణింపఁ దరమా? ఆతని నుతింప శక్యమా ?

అనుబంధము. ౧౨.

సీ. బాల్యంబుననె చనుబాలు ద్రావించెడు
పూతనఁ బోఁగొన్న పురుషమూర్తి !
మనుదిన్న నెపమునఁ దననోరఁ దల్లికి
విశ్వంబుసూపిన విశ్వమూర్తి!
ఘోరవిషానలదారుణాకారుఁ గా
ళీయుమర్దించిన గేయమూర్తి !
కోపించి వజ్రిపై గోవర్ధనాచలం
బవలీల నెత్తిన యచలమూర్తి!

గీ. ఘోర దానవమర్దన ధీరమూర్తి!
సత్యవాక్పరిపాలన శాంతమూర్తి !
పరమపావనమూర్తి! యద్వంద్వమూర్తి !
కేవలము విష్ణుమూర్తి! శ్రీ కృష్ణమూర్తి !

కుమారా! ఇవియన్నియు ముక్తికి మూలసాధనములు. ముక్తి యనఁగా సంసారబాధములనుండి విముక్తియగుట. ముక్తియే జన్మసాఫల్య మొసఁగునది. అన్నిఁటికంటెను భక్తి నిర్హేతుకమై యుండవలయు. భక్తాగ్రణీ! రాముని సేవించువిధం బెఱింగించెద రమ్ము.

(అని చేరదీసి చెవియందు తారకమంత్రోపదేశ మొసఁగును)

నామ—(దీర్ఘనిశ్వాస పురస్సరంబగు వికసిత హృదయముతో) తండ్రీ! ఈ యజ్ఞానుని రక్షించితివి. పరమార్థ మెఱిఁగించితివి. నా కింకేమికావలయు? ఆహా! గురుబోధా ప్రభావమెట్టిది?

గీ. ముక్తిమార్గప్రదాయికి మూలధనము
పటులపాపాగ్నిఁ జల్లార్ప జలధరంబు
రామనామామృతముఁగూర్చు రమ్యపథము
సద్గురునిబోధ! యీ మూఁడు జగములందు.

స్వామీ! నాజన్మమును దరింపఁజేసితిరి.

(సాష్టాంగపడును)

విసో—[సప్రేమమున లేవదీసి] కుమారా! ఇఁక నీవరిగి పాండురంగని నిశ్చింతమెయి సేవింపుము. సామాన్యమానవులంబలె భక్తసింహుఁడవగు నీవును లోకహితానువర్తివై గురుబోధ నందితివి. నేనింక యాశ్రమంబున కరిగెద.

(నిష్క్రమించును)

నామ—(ఆనందమున సొక్కుచు) నాతండ్రీ! పాండురంగా!

ఉ. ఈసరికే కృపార్ద్రమతి నెల్లవిధంబులఁ గాచుచుంటివీ
దాసుని దోసముల్గెడపి ధన్యునిఁజేయవె నీసయుక్తమనో
న్యాసమె ఘోరపాప పరిహారమటంచును నమ్మికొల్తు నో
దాసజనావనా! కుటిలదానవభంజన! చిత్తరంజనా!

రంగా! ఖగరాజతురంగా!

హంసధ్వని

దశరథనందన దైత్యవిరామ
కౌశిక మఖపరిపాలనరామ
గౌతమసతి సంరక్షణరామ
శాలంకు ధనుర్భంజనరామ
సీతార్పిత వనమాలికరామ
ఖరకులనాశన విక్రమరామ
కబంధకంఠ విలుంఠనరామ
రావణమారణ కారణరామ
హనుమద్భక్తి సుపోషితరామ
రఘుకులదీపక రాఘవరామ
మాయామానుష విగ్రహరామ
దాసజనావన ! దశరథరామ.

[భజనసేయుచు నిష్క్రమించును]

[తెరవ్రాలును]

ఇది ద్వితీయాంకము.

ఓమ్.

భక్తనామదేవు

తృతీయాంకము.

౧వ రంగము. కరవీరపురము – దేవాలయసౌధము.

([illegible])

[ప్రవేశము—నామదేవు భజనసేయుచు]

నామ—(భక్తిభావముతో) రామా! సకలసద్గుణధామా!

అనుబంధము ౧౩

మ. తలఁపే? బ్రహ్మకు నేని నీసుగుణసంతానంబు వర్ణింప ని
ర్మలతత్త్వంబును శైశవంబునను ప్రారంభించి వర్ణించుచుం
గలుగున్ జెందఁగరాని మోహనసుఖానందంబు నిత్యంబునుం
జలితుల్ పేని తెలుంగలేరుకద; యీశా! పాండురంగప్రభూ!

(శ్రీమ నభినయించుచు) పండరీపురమిఁకను జాలదూరమున నున్నది. పొద్దుదమన్నఁ జాల ప్రొద్దగుచున్నది. వాఁడిసూర్యకిరణములు విచ్చలవిడి నెల్లెడల సంచరించుచున్నవి. పాదములు మెత్తఁబడుచున్నవి. పిపాస మిక్కుటమగుచున్నది. (చూచి నిగుడించి) పరిసరంబుల నెచ్చటను నగరముండునటులఁ గానుపడకున్నది. అబ్బ! ఏమి యీ చండభానుని తీవ్రశాసనము? సకల చరాచరంబులఁ దన తీవ్రప్రతాపాగ్నికీలలఁబడఁగొట్టుచున్నాఁడు.

(నడచుచు) అల్లదే కానంబడునది క్రీడావనంబైయుండనోపు. అందెచ్చటనేని జలాశయముండునేమో ?

[వనము దరియును]

(ఆశ్చర్యముతో) ఓహో! ఏమిది? పురబాహ్యప్రదేశంబున నుండు తరుప్రదేశమువలె నున్నది? కానిమ్ము. పురంబునకరిగి కొంత విశ్రాంతిఁ గైకొనెద.

[నగరమును బ్రవేశించును]

అహో! ఏమి యీనగర నిర్మాణము?

సీ. శిల్పికారుని భావచిత్రితంబులఁ జెంది
మిన్నులతోరాయు మేడలగుమి
కాంచనరత్న సంఘటిత వైభవముతోఁ
దనరారు తద్గృహద్వారచయము
మానవప్రతిబింబమానితంబగునట్టి
విమలరత్నవికార వేదికాలి
మాణిక్యఖచిత సామజము లిర్వంకల
దాపున నునువగు తాపలతతి

గీ. నిలచి యేదెసఁబరికింపఁ గలుముల జవ
రాలి పురమోయనంగ విరాజమాన
విభవసంతానబద్ధమై వెలయు నిప్పు
రంబు రెండవ యలకాపురంబుఁగాదె?

(ముందరికి దృష్టినిగిడించి) ఈసౌధమెవ్వరిదో సుగుణసంపన్ను లగువారిదని తోచుచున్నది. ఇచ్చోటికేగి మత్పిపాస నపనయించుకొనెద.

[గృహద్వారముచెంత నిలచి చూచుచుండును]

(లోపలనుండి తార యను దాసి వచ్చుచుండును)

తార—(నామదేవుగాంచి స్వగతము) ఆహా! ఏమి యీతనిమూర్తి! ఎవ్వరో మహాభక్తుఁడైయుండనోపు. (ప్రకాశము) స్వామీ! లోపలికి దయచేయుఁడు.

[నామదేవుని గృహములోనికిఁ దీసికొని పోవును]

నామ—తల్లీ! కొంచెము దాహ మొసంగెదవా?

[తార జలాపాత్రమునివ్వ నామదేవు తనపిపాసనణంచుకొనును]

నామ—(సంతసముతో) అమ్మా! ఈపుణ్యగృహం బెవ్వరిది?

తార—(వినయశ్రద్ధలతో) స్వామీ! ఇది నేతాజి యను నొకసుగుణ సంపన్నుని గృహము. వారలిప్పుడు గ్రామాంతరమున కేగి యున్నవారలు. వారి యేకపుత్రియగు రాధాబాయి స్నానార్థమై తోటకరిగియున్నది. మహాత్మా! నేడు మాగృహంబున విందారగింపవలయు.

నామ—అట్లు లేయగుఁగాక తల్లీ!

[అని సిద్రనభినయించును]

తార—(అదియెరింగి యొక శయ్యనమర్చి) స్వామీ! మార్గాయాసంబునఁ గడు బడలియున్నారు. కొంచెముసేపు విశ్రమింపుడు.

(నామదేవుశయనించును. తార పేవనతో విసరుచుండనాతఁడు గాఢముగా నిద్రవోవును)

[ప్రవేశము. పూలబుట్టతో రాధాబాయి]

రాధ—(నామదేవునిఁగాంచి యాశ్చర్యముతో) తారా! ఈమహాత్ము లెవ్వరే!

తార—అమ్మా! ఎవ్వరో యెఱుంగ. గృహంబున కరుదెంచుటంజేసి సపర్యలొనర్చుచుంటిని.

రాధ—అదియే కదా మైహికంబున మనుజుఁడు సంపాదించుకొను భాగ్యము. నెచ్చెలీ! పూజాద్రవ్యములన్నియు సిద్ధము జేసిరమ్ము.

[పూలబుట్టతో తారలోని కేగును]

(రాధకు నామదేవు గాంచినకొలందియు నొకవంక భక్తిబీజము నింకొకదెస మోహబీజమును సమముగా నామె స్వాంతంబున మొలకలెత్తుచుండును)

రాధ—(భక్తిభావముతో) ఆహా! ఏమి యీతనిమూర్తి? మొగంబున శాంతరసము తొలకిపోవుచున్నదే? ఏమా నిశ్చలభావము? ఏమాగంభీరహృదయము? ఈతండెవ్వండో పరమభక్తశిఖామణియైయుండవలె నేనెట్టిపుణ్యము సల్పితినో నాకీ మహాత్ముని సందర్శనమబ్బుటకు? ఏమిది? తలంచినకొలది హృదయమేలొకో యీతనిపైఁ బరుగులిడుచున్నది?

(చకితభావముతో) ఆ! పరపురుషుం జేరాంత బునంగాంచుట సతులకు సొంతమౌనా కాదా? కావున ఈ మహాత్ముఁడు మాగృహంబున కతిథిగా నేతెంచియుండెఁగదా? అతిథిపూజాగురుఁబగు వారలకు స్వపురుష పరపురుషులను భేదమేమున్నది!

[అతిథిభావముతో] పాప మీతఁడెంత దూరముననుండి వచ్చుచుంటినో? ఎంతయలసియుంటినో? ఇంకను వదనంబునం దలసటచిహ్నంబులు కానంబడుచునే యున్నవి. సుఖనిద్ర పట్టినటుల కొంచెముకనుమూసి విసరెదనుగాక.

[ప్రణయభావముతో విసరుచు] ఆహా! ఏమి యీతని సుప్రసన్న వదనమండలము! కనురెప్పల వారలు ఘర్మబిందువులు శాంతరసప్రధానములుగ భాసిల్లుచున్నవే? నిర్మలహృదయ

కమల కాసారంబున భక్తిరసామృతమెటుల దరుల నోరసి యున్నదో కదా? అబ్బ! ఈతని యాకృతి వర్ణనాతీతముగదా?

గీ. కనులు శాంతిరసచ్చిత్ప్రకాశితములు
గతులు సమ్యత్త్వభావసంకల్పితములు
ఇట్టి వానికరంబు నేయింతిపట్టు
దాని కబ్బునె? సురజన్మ ధాత్రియందు.

[సప్రేమమున శుశ్రూషాంగోన్సర్పు చుండును]

తార—[తిరిగి ప్రవేశించి] సఖీ! అన్నియు సిద్ధములైనవి.

రాధ—మహాత్ములిప్పుడ నిద్రమేల్కొనునట్టు లగపడను. పూజా విధానము ముగిసిన యనంతరము మేల్కొలుపవచ్చును. పోదముపద.

[ఇద్దరునుబోదురు]

[రంగస్థలంబున నామదేవు శయనించియుండును]

[తెఱలో]

[గంటానాదములును విష్ణుసంకీర్తనములును వినబడుచుండును]

నామ—[త్రుళ్ళిపడిలేచి వినుటనభినయించి] ఎక్కడిదీ విష్ణుసంకీర్తనము? హాయి! హాయి! కర్ణానందమొనగూర్చుచున్నది. అబ్బ! విష్ణుసంకీర్తనామృతమును గ్రోలి యెంతతడసైనది. ఆహా! ఏమాకోమలకంఠ నినాదమాధురీలహరి? ఏమాభక్తిరస ప్రపూరితవిష్ణుసంకీర్తనామృత ఝురీవేగము? ఏమాచిదానంద రూప ప్రకాశిత స్వాంతసుధాతరంగము? జయపాండురంగ ప్రభూ! జయసద్విఠ్ఠలప్రభూ!

తరలము.

నిలుపులేని మనస్సుకే క్రియ నిన్నుఁ గూర్చి భవద్గుణం
బులఁ దిక్కాలములన్నుతించినఁ బొందఁజాలరు ముక్తి నీ
తలఁపులేని శరీరికే ధన ధాన్యరాసులు గల్గినన్
ఫలముశూన్యము విశ్వభావన! పాండురంగ! దయానిధీ!

[తెఱలోనుండి వినవచ్చిన కీర్తనమ్ము ననుసరించి నిమీలిత
నేత్రుఁడై భజనసేయుచుండును]

రాధ—[పూజావిధానంబును ముగించుకొని ప్రవేశించి నామదేవు భక్తిభావమునుగాంచి విస్మయంబున స్వగతము] ఆహా! ఏమి యీమహాత్ముని భక్తితాత్పర్యము. ఇట్టివాని సేవ లేకాంతకు లభించునో కదా? (ప్రకాశము] స్వామీ! వేళ యతిక్రమించుచున్నది.

నామ—(కనులువిచ్చి యాశ్చర్యచకితుఁడై లేచి) ఈమెయే కాఙ్హోలు నేతాజీసుతయగు రాధాబాయి. ఆహా! ఏమా కోమలవదన సుశీల సుగుణస్వభావ గాంభీర్యము? ఏమా భక్తిభావ సంజాత హృదయోన్మమణ నిర్మలభావ ప్రకటితము? ఏమా వినయ విధేయ మధురాధర పల్లవచలితస్వభావనైపుణ్యము? ఏమా రమణీయతరుణముఖకమల లావణ్యసౌకుమార్యము? ఏమా రూపరేఖావిలాసము?

సీ. పుండరీకముఁ గోరుఁ బుండరీకము జేరు
గమనంబుకన్నులు కరుణనింపు
హాసికలాపము గెల్చు హారికలాపము బిల్చు
మధ్యంబుపల్కులు మార్దవంబు
అబ్జంబు హసియించు నబ్జంబు మఱపించు
గ్రీవంబు వదనంబు గేరుకాంతి
మధుపాలిబురుడించు మధుపాలితముఁ జెందు
కురుపాలిరూపంబు గోరుప్రేమ

గీ. బాల! సుమబాల! మృదులకపోల! శీల!
హరిపదాంభోజ యుగ్మక ధ్యానలోల!
అతిథిపూజానిబద్ధ గుణాలవాల!
మఱపువచ్చెనె? వేయిజన్మాలకేని.

[ప్రకాశము] బాలికామణీ! నీభక్తివిశేషంబులు మెచ్చదగినవి.

రాధ—స్వామీ! నమస్కారము. [నమస్కరించును]

నామ—[సుప్రసన్నవదనముతో] కల్యాణివగుదువుగాక.

రాధ—[అధోముఖియై] మహాత్మా! తమ పవిత్రనామ మెఱుంగ వచ్చునా?

నామ—కోమలీ! నామదేవని జనులు నన్నుఁ బిలుచుచుందురు.

రాధ—(విస్మయ సంభ్రములతో] మహానుభావా! ధన్యనైతి. తమ దర్శనభాగ్యంబు లభించుటఁజేసి నానోములు సఫలీకృతము లైనవి. పాండురంగనికి నాపైఁ గృపవొడమినది.

నామ—బాలామణీ! నీచరితం బస్మదృశులకు హితంబుఁ గలిగించెడు గాదే?

రాధ—అంతయు మీకృపయేగదా? స్వామీ! వేళ యతిక్రమించు చున్నది. మాయాతిథ్యంబును స్వీకరించి మాగృహంబును బావనమొనర్పుడు. నెచ్చెలీ! తారా! మహాత్ముల స్నానార్థము గొనిపొమ్ము.

(అంత తార నామదేవు లోనికిఁ గొంపోవును)

రాధ—[స్వగతము] ఇట్టిపరమభక్తుని పత్నియగుటకు నేకన్యకామణి నోచియున్నదోకదా? చిత్రము! తత్తరమందకుము. పాండు రంగా! ఈ సద్గుణసంభూతునకే నన్నుఁ బత్నిఁగానొనర్పుము.

[నిష్క్రమించును]

(తెరవ్రాలును)

---

౨ వ రంగము. సౌధము.

(రాధాబాయి యిచ్చట వేషము మార్చవలయును. విరియబోసిన తలకట్టును మలినవస్త్రధారణమును నాభరణవిహీనంబును గలిగియుండవలయును. భావప్రకటనమునం జింతాకులస్వాంతగను విరక్తిభావోద్రేకగను దుస్సహవేదనాపరురాలుగను మూర్తీభవించిన శోకదేవతవలెను దోంచవలయును. సేఠాజీ యేబదియేండ్లకు మించినవాడుగ నుండవలయును. కానిధనికుని లక్షణములు గన్పడవలయును. వేషము దామాజీకివలె నుండవలయును. భావమునం బుత్రికా ప్రేమముగలవానిగను దీర్ఘకోపములేనివానిగను దోంచవలెను.)

[ప్రవేశము : ఖిన్నవదనముతో రాధాబాయి]

రాధ—(నిట్టూర్పుతో) కటకటా! జనకుండెంత చెప్పినను వినండయ్యో. నేనేమిసేయుదాన? ఎవ్వరితో మొరవెట్టుకొందు? నాకుదిక్కెవ్వరు? హా! పాండురంగా! నాకీప్రేమనేల నంకురింపం జేసితివి? చేసితివి పో? ఈవ్యసనభావమేలంగలిగించెదవు? హా! హా!

(కొంతతడవు చింతానిమగ్నయగును)

(స్మృతినభినయించి) ఆహా! ఆభక్తశిఖామణిమాటం దలంచినకొలంది శరీరము తన్మయత్వము నొందుచున్నది. అబ్బ! నాటిమాట జ్ఞప్తికివచ్చినచో మితిలేని సంతసము గలుగుచున్నది. అయ్యో! ఇంకెక్కడి సంతసము? ఆమహాత్మునకైన భక్తిభావముల నెఱుంగుచు విష్ణుకీర్తనసుధారసపానపరవశచిత్తనగు భాగ్యము నాయెడం గలుగునా? ఆతనిపాదసేవలు నాకబ్బునా? హా! తండ్రీ! ఏకపుత్రికనగు నన్నిట్టులం గష్టపెట్టుట భావ్యమా? అయ్యో! జనకుని దూఱుచుంటినేల? నాపూర్వబహుళజననసుకృతఫలరూపమిదియే కాబోలు. నాడు ఆమహాత్ముని సందర్శనమబ్బిననాడు— ఆభక్తవతంసుని కరుణారసకలిత ప్రధానంబులగు పల్కులవిను భాగ్యమొదవిననాడు— నానోములన్నియు సఫలీకృతములగునని తలంచియుంటినే. కట్టా! నేటికాతలంపులన్నియు నడుగంటెంగదా? నేటికినాయాశాలతవాడిపోయెంగదా? నేటికి నాయెడ దుర్వ్యసన ఘాతంబు చిందులు ద్రొక్కుచుండెంగదా? అయ్యో!

కన్నులు తిరిగిపోవుచున్నవి. ఏమది? మహాత్మా! వచ్చితివా? రమ్ము. నీపాదకమలముల నొక్కసారి భజింపనిమ్ము. ఈదీనురాలిపై నీకుఁగల ప్రేమ కన్నతండ్రికి లేకపోయెఁగదా! ఇది యేమి? పాండురంగా! భయము లేదని తెల్పుచుంటివా? ఊరట నొందుమని పల్కుచుంటివా? ఇంకెక్కడియూరట. హా! హా!

(మూర్ఛిల్లును)

[ప్రవేశము—నేతాజీ]

నేతా—(స్వగతము) మదీయపుత్రిక మొండితనము వహించుచున్నది. ఎంతచెప్పినను వినదుగదా? ఎవ్వనినో యొక భాగ్యవంతుని బిడ్డనుఁ గోరి సంతసపడుదునని తలంచితినిగాని యిట్టుల నొకగర్భదరిద్రుని గోరునని కలనైనఁ దలంపనైతినే! మొదలు చనువిచ్చుటయే తప్పు. కష్టసుఖమ్ము లాలోచించుటకు దానికేమి తెలియును? జనని లేదుగదా యని గారాబముతోఁ బెంచినందులకు వృద్ధాప్యమున నాకీ మనస్సంకటమును గూర్చుచున్నది. ఇంకను గొంతబుద్ధి చెప్పిచూచెద. ఎల్లప్పుడా నామవృసిఁ గూర్చి యొకటేచింత. అబ్బ! లేక లేకొక్క బాలిక జనించినందులకు నిడుముల నెన్నిఁటిఁ గుడుచుచుంటిని. ఇంతకును దైవాధీనమెట్టులున్నదో! (ముందునకుఁ జూచి) అయ్యో! ఇది యేమి! కుమారిక మూర్ఛపడియున్నదే?

[తత్తరముతోఁ బోయి తనయంకతలంబున నామె శిరంబునుసిచి]

తారా! శీతలోదకంబులఁ గొని తెమ్ము.

తార—(అత్రముతో నీరు దెచ్చి నెచ్చెలిమోముపైఁ జల్లును)

రాధ—(మెల్లమెల్లగ కనులువిచ్చి) తండ్రీ! కనికరము లేదా?

నేతా—ఒకప్పుడు మాత్రము నీపై నాకుఁ గోపమున్నదా తల్లీ! భాగ్యవంతునిఁ జేపట్టుమని కోరితినిగాని నిన్నేమని కసిరికొట్టితినా? అమ్మా నీపిచ్చితలంపు మాని భాగ్యశాలి నొక్కనిఁ గోరి నాచింత దీర్చుము.

రాధ— జనకా! ఇంకొకనిపై నామనంబు పోనేరదు.

(అని లేచి నిలుఁవబడును)

నేతా— అట్టులఁ దలంపకుము తల్లీ! ఆతనికంటె రూపవంతులు లేరా? భాగ్యసంపన్నులు లేరా?

రాధ— భోగభాగ్యములెందుకు తండ్రీ! గుణము ప్రధానంబు కాని రూపము ప్రధానముగాదుగదా?

నేతా— నీకింకను లోకజ్ఞానము చాలదు. ఇక్కాలంబున నర్థహీనుఁ బ్రతుకు వ్యర్థమని యెఱుంగుము. అట్టి వ్యర్థులకు నిన్నెట్టు లివ్వఁగలను?

రాధ— తండ్రీ! మున్ను సావిత్రీదేవి సత్యవంతుని భాగ్యశాలియని ప్రేమించినదా? అనుకూల దాంపత్యము నిలుచుచోట భోగ భాగ్యంబులు తృణప్రాయములని యెఱుంగవా?

నేతా— కాలక్రమము ననుసరించి మార్పులనేకములు జరుగుచున్నవి.

రాధ— అగుఁగాక. సతీపతుల గుణంబులయందే మార్పులును గలుగఁ జాలవు. భాగ్యము భాగ్యమని పలుమారులు పల్కెదవేల? భాగ్యము శాశ్వతమా? భోగము శాశ్వతమా? భాగ్యశాలి దరిద్రుఁడు గావచ్చును దరిద్రుఁడు ధనాకరుఁడుగావచ్చును. తండ్రీ! ఇప్పుడు నీవు ధనవంతునకే నన్నిచ్చినచోఁ గా[illegible] కాలంబున కాతఁడు దుర్వ్యసనాయుఁ బువలన దరిద్రుఁడైన నప్పుడింకొక సంపదాఢ్యునిఁ గోరుమనియెదవా?

నేతా— అమ్మా! నేనంత జడమతినిగాను.

రాధ— కాకేమి? ఇదివరకు మహానందోత్కృష్టుని నరయించి మత్ప్రాణ నాథునిఁగా భావించియుంటి [illegible] వానిని [illegible] జడమతిత్వముగాదా?

నేతా—(చిరాకుతో) వరియించినంతనే యాతండు నాథుండయ్యెగా! గ్రుడ్డువచ్చి పిల్లను వెక్కిరించెనను చందంబున నాకే నీతులు గరపుచుంటివా!

రాధ—(శాంతభావముతో) తండ్రీ! నీపలుకులు కులసతీమతవిరుద్ధములు.

గీ. శీలవతియైన సతి తన చిత్తమెవని
యందు మొదట లగ్నమగునో? యట్టివానిఁ
వెనుకఁ బ్రాణేశ్వరునిఁగఁ గైకొనునుగాని
పరునిఁ గన్నెత్తియైనియు సరయఁగలదె?

నేతా—(తీవ్రచిత్తముతో) నీయాగడమింక సాగనేరదు.

రాధ—[కడువిచారముతో] జనకా! కోరినభర్తను జేకూర్చుమనుట యాగడమా? హా! ఎంతటి కఠినభావమూనితివి! నాతల్లి గతించుటజేసియేకదా నాకిట్టి దుఃఖంబుగల్గె. నాతల్లి యున్నచో నింత కఠోరముగాఁబల్కుదువా? అయ్యో! నిన్ను ధనధాన్యంబు లొసంగుమని కోరితినా? నాకైకష్టముల పాలు గమ్మంటినా? తండ్రీ! నా యీ చిన్నివాంఛితంబును దీర్పంజాలవా? పుత్రికలపైఁ దండ్రులు చూపు భావమిదియేనా? కటకటా! నాకు దిక్కెవ్వరు?

గీ. జనని గతియించె బోషింపువారలు లేరు
జనకుఁడొక్కఁడె సుతప్రాణంబు చిదుపనుచుఁ
దలఁచియుంటిని నేఁటికా తలఁపు దొలఁగ
దిక్కు లేరొక్కరు? నాబోటిబిడ్డలకిల.

(దుఃఖించుచు) తారా! నీవైనను నన్ను రక్షింపంగఁ జాలవా? అయ్యయ్యో! ఏమి నాపిచ్చి? కన్నతండ్రియే కఠినవర్తియైనచో నాకు నితరు లేమి చేయఁగలరు? హా! హా! ఎక్కడికిఁబోవుదానను? ఏమిచేయుదాన? ప్రేమా! నీవలన నాకింతటి కష్టము [illegible] [illegible].

చిత్తమా! నీకును నాకును ఋణముదీఱినది. శోకమా! నాకింకనీవనే శరణు. రమ్ము. నన్ను నీయందుఁ జేర్చుకొనుము.

[అని విలపించును]

సేతా — (సప్రేమముగా, బుత్రికను జేరఁదీసి కనుల నీటి నద్దుచు) తల్లీ! శోకింపకుము. నేనెంత యారాటపడినను నీమేలుకొఱకే గదా?

రాధ — (దీనస్వరముతో) తండ్రీ! నీవు నామేలుఁదలంచినచో నామనోహరునకే నన్నప్పగించుము.

సేతా — (విచారముతో) మీకుమిక్కిలి కోపించినచో బిడ్డ శోకించును పుత్రికాశోకంబును గాంచినంతనే నామనంబు నీరగును. ఆతని కొసంగుదమన్న మానస మొప్పదు. అబ్బ! సంసారసాగరము నీదుట దుర్లభంబుగదా!

ఉ. ఆరసి తారకాగణమునంతయు నెంచఁగవచ్చుఁగానలోఁ
దూఱఁగవచ్చుఁ గాలువగ తోయధినీదఁగవచ్చు శత్రుసం
హారమొనర్పవచ్చు బడబాగ్నికణంబుల మ్రింగవచ్చు సం
సారసముద్రమీదుటకుఁ జాలరుచాలరు జీవులెవ్విధిన్.

కానిమ్ము. భవిష్యదర్థంబు నెఱుఁగు సమర్థులెవ్వరు? పుత్రులైనను బుత్రికలైనను నిమె యొక్కతెయే కదా! నాధనమునే యీమె కప్పగించి సుఖజీవనోపాధి నెందులకుఁ గూర్పఁగూడదు! అనురాగము లేని దాంపత్యముఁ జేకూర్చి కలకాలము బిడ్డ దుఃఖించుచుండ నేఁజూడఁ గలనా? నాకుమాత్ర మొండు దిక్కేమున్నది? పాపము! తల్లి గతించిన లేశమాత్రమేనియు దుఃఖింపక నగుమొగంబున నాకానందమును గూర్చిన నాతల్లి నేను తనతల్లిని దలంచి యొంటిగ దుఃఖించె? నామానసమింకను వేదనముఁ జెందియేయున్నది. చిత్తమా! మొట్టమొదట నెంతకాఠిన్యమూనితివి? తుదకెంతటి మార్దవంబును జెందితివి! నాబిడ్డ హృదయమెంతటి తీవ్ర వేదనల పాలగుచున్నదో కదా? [ప్రకాశము] బిడ్డా! శోకింపకుము. నీవాంఛితమును దీర్చెద లెమ్ము.

రాధ—(సంతసముతోఁ దండ్రిఁ గౌఁగలించుకొని) తండ్రీ! నాజన్మ మిప్పటికిగదా తరించినది. సుతలకు శ్రేయముఁగూర్చి వారల కష్టసుఖమ్ముల విచారించువారలేకదా నిక్కమగు దల్లిదండ్రులు. అట్లుగాక పొట్టకూటికై కన్నులకుఁ దెరువని తనుతమ ముద్దుబిడ్డల ధనముసకాశించి యీడుజోడులేని యేవృద్ధులకో యేదుష్పథగాములకో, యంటగట్టి దుఃఖములపాలు సేయు వారలందరుఁ బ్రేమగల తల్లిదండ్రులేనా? సంతలయందుఁ బసువుల విక్రయించునట్లుఁ బుట్టిననాటనుండియుఁ బెంచిన ప్రేమభావము నేనియుఁ జూపక పుత్రికల పోషణార్థమై యుగ్గుపాల నుండి పెండ్లియగువరకు వెచ్చించినధనమును జక్రిగవ్వ సేసియు విడువక కన్యాశుల్కము మూలమున గడించుచుఁ బుట్టినింటికొకనాడేనియుఁ దీసికొనివచ్చినచోఁ దిద్దనముఁ దెరిగి పొందు మార్గములులేవని యెక్కాలను దేసియు వారల మొగంబులఁ జూడక శాపలన్నియుఁ దీర్చఁగదాయని పొంగువారలు పుత్రికల పాలిటి ప్రబలశత్రులుగాక మిత్రులగుదురా? జనకా! నీయట్టి ప్రేమమూర్తి నాయందనుగ్రహించుటచే నావాంఛితమీడేరుమార్గమునుగలుగును. (ధ్యానముతో) హే పరాత్పరా! కృపాళూ! దయాసింధూ!

ను వ్రతముల్ సత్క్రియ జన్మముల్ గడచియుంటే ఫలవ్యాప్తి నదిక్కెంతకే
గతిఁ గన్గొంటిని మోక్షమార్గమునకున్ గాంగాయమిట్టుండుటే
జతగాఁ గూర్చితి మన్మనోహరునిలోన్ సద్భక్తి సంహారముతో
నతిగాత్రంబున నిన్నుదంచెదను శ్రీనాథా! దయాంభోనిధీ!

సేత—తల్లీ! శుభవర్తమానముఁ బుట్టకై వలయు సన్నాహంబుల సిద్ధమొనర్తము రమ్ము.

(రాధ నునుసిగ్గుతోఁ దలవంచుకొని తండ్రితో నిష్క్రమించును)

(తెర వ్రాలును)

---

3 -వ రంగము — పండరీపురము — దామాజీగృహము

(దామాజీవేషము పూర్వపలెయుండును. తొల్లింటివలెం జొక్కా పట్టెవాటు టోపీ మొదలగునవి యేమియులేక ఒకచిన్న తుండుగుడ్డ నొకదానిని వేసికొని మెడయందున్న తులసీమాలలుండుగాని పిలకజుట్టుగల తలకట్టులో నింటి ఇంటిపాళియుండోక పీఠముమీదగూర్చుండి భార్యతో సంభాషించుచున్నట్లుగా నుండవలయును. గుణాబాయివేషము పూర్వప్రకారముగనే యుండవలయును.)

[ప్రవేశము — దామాజీ గుణాబాయి]

గుణా — నాథా! కుఱ్ఱవానికి యుక్తవయస్సువచ్చినది. పెండ్లిసంగతి నింకను దలపెట్టకున్నారు. ఎల్లకాలము మన ఘటములు శాశ్వతములా? ఏదో కుఱ్ఱవానింగని పెంచినందులకింత ముద్దుముచ్చటల నేనియుం దీర్చుకొనవలదా? వాండేనియు గురువులని కొంతకాలము భక్తిమార్గములని కొంతకాలము వృథం జేయుచు సంసారసంబంధము లేకయే తిరుగుచున్నాండు. ఏదియో యొక మార్గము నవలంబింపక కలకాలము భక్తి భక్తియని కొట్టుకలాడుటవలనం బ్రయోజనమేమున్నది? మీకును వృద్ధాప్యము దాపరించినది. లేవలేనినాండు గొంతులో గుక్కెండుగంజిం గాచిపోయుటకు మన కాధారమెక్కడం గన్పట్టదు. పురుషకారము లేనియెడలం దమకు తామే కార్యములు సిద్ధింపంగలవా? అడవులం బలుదడవులం బట్టి కుమ్మరుచు నిన్ననే సుతుండు గృహంబునకుం జేరె. చేరుటయే తడవుగాం బాండురంగాలయంబునకరిగె. మాటలాడుటకు సమయము తీరిక లేనంతటి యవస్థలోబడి వాండు కొట్టుకొనుచున్నాడు. ఎల్లప్పుడిట్టులేయగుచో ముందుగతియేమి?

దామా — కాంతా! ఆరాటపడుటవలన లాభమేమున్నది. వివాహమనునది యొక సాధారణకృత్యమా? మనకుం గావలసిన దగ్గర సంబంధములు లేనిమాట నివెఱింగియే యుంటివి ఇక దూరసంబంధమునకై పోవుదమన్న మనము కడుదరిద్రులము. అదిగాక మనకుఱ్ఱవానిం జూతమన్న వానిభక్తియేమో వాని పూజలేమో యవియేకాని యీకాలపుయువకులవలె నీటుగా

వేషములవేసి తిరుగువాఁడుకాఁడు. భక్తుఁడన్న వాని నిక్కా-
లమున జనులు పిచ్చివానిఁగా జూతురు. పరంపడి స్త్రీసంఘ
మునం దెచ్చటఁజూచినను మరాచారములు మిక్కుటముగాఁ
బ్రబలుచున్నవి. భిన్నవేషములు భిన్నబుద్ధులు చెలరేగు
చున్నవి. కొందరు స్త్రీలు భర్తలుండుటవలనఁ దమ స్వాతం
త్ర్యములు కూలిపోవుచున్నవనియు భర్తలనువార లుంటయే
కూడదనియు నెంచుచున్నారు. ఒకకట్టునందేమి బొట్టునందేమి
జుట్టునందేమి క్షణక్షణమున కనేకమార్పులు జరుగుచున్నవి
ఇట్టివారలకెట్టి సద్గుణములుండునో తెలియరాదు. అదిగాక
కొందరు పతులకు సతులే యన్నిటియందును మూలాధారు
లగుటఁజేసి పతులే సతులమాట వినవలయుననియుఁ దలంచు
చున్నారు. సతీ! కాలపుచర్య యీవిధముగా మారుచున్నవి.
ఇట్టియెడ మనము సత్కులజాతయగు బిల్లను వెదకవలసి
యున్నది. అట్టివారలు వెలలేని రత్నంబులవలెఁ బ్రకా
శించుచుందురు. మనపుత్రునకుఁ దగిన భామామణినిఁగాంచుట
సామాన్యమా? అన్యుల నంటఁగట్టినచోఁ బిల్లవానినిఁ బాడు
చేసినవారమగుదుము, అన్నిటకిని విత్తము ప్రధానముగదా!
కానిమ్ము. పిల్లవాఁడు వచ్చినయనంతరము వానియిష్టమేమో
కన్గొని తదనుకూలప్రకారము నాచరించుట శ్రేయోదాయకము
పెక్కుచోటుల దిరుగువాఁడు గనుక వానికిని లోకములోని
వింతలన్నియు నెఱుకపడియుండవచ్చును. ఏబాలికయందేని
యాతని మనంబు లగ్నమైయున్నదేమో?

గుణా—అయ్యో! అంతమా పుభాగ్యమా.

[ప్రవేశము—నామదేవు]

అ ను బం ధ ము ౧౫.

నామ.—[బద్ధాంజలియై] హే పాండురంగా!

శ్లో. పరిస్లోదార్తివిభంజనం! గుణనిధిం! బ్రహ్మాదిసంసేవితం
మాయామానుషవిగ్రహం! శుభకరం! సంసారబంధాపహం!
సౌందర్యోజ్జ్వలకిన్నరీనుత యశశ్చంద్రా వృతాశాంతతిం!
భావాతీతమనంతశాయినమహం! శ్రీపాండురంగంభజే!

(కొంతపడి ధ్యానలోలుఁడగును)

[ముందునకుఁ బరికించి స్వగతము] తల్లిదండ్రులేలాకో మోజనానిమగ్నులై యున్నవారలు. [ప్రకాశము] జనని జనకులారా! నమస్కారము.

[వరిణమిల్లును]

తల్లి-దండ్రి—[సప్రేమమున లేవనెత్తి తమప్రక్కఁ గూర్చుండఁబెట్టు కొనెదరు]

దామ—కుమారా! ఏచ్చోటికరిగియుంటివి?

నామ—తండ్రీ! పాండురంగాలయముకన్న నేఁబోవుస్థలమింకొక్కటి కలదా?

గుణా—ఎల్లప్పుడు నిర్విచారముగ సంచరించుటయేనా?

నామ—విచారమేల తల్లీ! నాపాండురంగని చరణ సరోరుహసేవలు లభియించునంతకాలము నిర్విచారముననేకాదు నిత్యానందన ముతోఁ దిరుగాడుచుందును.

దామ—కుమారా! నాపలుకుల నెఱింగుమక వినుము మనుజునకు బ్రహ్మచర్యాశ్రమము— గృహస్థాశ్రమము —వానప్రస్థాశ్ర

మము— సన్న్యాసాశ్రమము లనునవి నాలుగు విశ్రమస్థానములు గలవు. అందుత్తమమైనది గృహస్థాశ్రమము. అజ్ఞానివలననే పురుషుఁడు కర్మలంపటుఁడగుచున్నాడు. దానియందే సకల ధర్మములాచరించుటకు మార్గములు చూపఁబడియున్నవి. పురుషునకదియే సర్వార్థముల నొసంగునది. నీవిప్పుడు బ్రహ్మచర్యమును దాటియున్నవాఁడవు. గృహస్థము నవలంబించు కాలము నీకబ్బినది. దానఁజేసి వివాహమును జేసికొనవలయునుగదా? నిర్వివాహకుఁడు గృహస్థుఁడని పిలువఁబడఁడు గదా?

నామ— దీనికై యింతగాఁ జెప్పనేల జనకా? మీమాటనెప్పుడు తృణీకరించి యుంటినా? మీయిచ్ఛానుసారమే వర్తింపఁగలవాఁడను.

దామ— ఇందు మాయిచ్ఛ పనికిరాదు. కష్టసుఖముల్ల భరించువాఁడవు నీవుకాని మేముకాదుకదా? అనుకూల దాంపత్యము గల్గుట సర్వజన సమ్మోదకము. నీమనంబదివరకెవ్వరియందేని లగ్నమైయున్నచోఁ జెప్పుము. అట్టిశాలికామినినే విచారించికొందము.

నామ— నాకేమి తెలియఁగలదు తండ్రీ!

[కొంచెము సిగ్గునటించును]

గుణా— నాథా! కుఱ్ఱవాఁడేమో సిగ్గుపడుచున్నట్లున్నది.

దామ— కుమారా! ఇందు సిగ్గుజెందవలసిన యగత్యమేమున్నది? ఇయ్యది లోకసహజంబేకదా?

గుణా—(పుత్రుని జేరదీసి) బిడ్డా! భయమెందులకు? మాయెదుట నీకుం గ్రొత్తరిక మేమున్నది? ఇదంతయు నీ మేలునకే కదా.

నామ—తల్లీ! నామనంబేలొకో కరవీరపురవాసియగు నేతాజీపుత్రిక నుగాంచిన నాటనుండి చంచలతనొందియున్నది.

గుణా—స్వయముగాఁ గరవీరపురమరిగియుంటివా?

నామ—అవును.

దామ—(సంతసముతో) కాంతా! చూచితివా! పుత్రుఁడు తగిన సంబంధము నే యాలోచించుకొనియున్నవాఁడు. సద్గుణ సంపన్నుఁడగు నేతాజీ వియ్యములభించినచో ధన్యులమే? కాని యది పొసంగుటెట్లు? అతఁడు మిక్కిలి ధనసంపన్నుఁడు. మనమో కడుదరిద్రులము. స్థితిగతుల నాలోచించి యాతఁడేమనునో? కానిమ్ము. తగినయత్నమొనర్చి చూతము. మీఁద దైవాధీనమెట్లగునో?

(ప్రవేశము— నేతాజీకడనుండి వచ్చెదరు కొందరు విప్రులు)

విప్రు—మహాత్మా! నేతాజీగారు మీకీశుభలేఖ నంపియున్నారు?

దామ—(ఆశ్చర్యముతో) ఏమి? నేతాజిగారు శుభలేఖనంపియుండిరా?
(ఆత్రముతో లేఖనందుకొనును)

నామ—(సిగ్గుతో వెడలిపోఁబోవును)

విప్రు—(అడ్డమువచ్చి) కుమారా! ఎక్కడికిఁబోయెదవు? ఇదంతయు నీకొఱకే కదా!

దామ—(పట్టరాని యానందముతో) సతీ! చూచితివా?

శుభలేఖ.

పూజ్యులగు శ్రీరామాజీగారిసన్నిధికి :—

సౌభాగ్యవతియగు మదీయ యేకపుత్రిక రాధాబాయిని, చిరంజీవియగు మీపుత్రుఁడు నామదేవునకొసంగి వచ్చుమాఘమున నీ శుభకార్యమును జరుపఁగృతనిశ్చయుఁడనై విన్నవింతు,

రవీరపురము,
విభవ, పుష్యశు॥ ౧౧లు.

ఇట్లు విధేయుఁడు,
నేతాజీ.

నామ — (ఆద్యంతముగా విని పరమసమ్మోదమున) తండ్రీ! పాండురంగా! ఏమి నీభక్తవాత్సల్యము?

సీ॥ పసివాఁడు వీఁడెంత వాఁడని యెంచక
కోరి వల్లిపిండియుఁ గుడిపించువు
పమఁబచిక్షింపంగ జనికోరిక నాళ్లు
పాలీయ గుమగుమఁ గాత్రలనింపు
గురుసిఁ గన్గొనలేక మరపిల్లునప్పుడు
ప్రత్యక్షమై చింతఁ బాపినావు
పలువేసములఁదాల్చి పలుకష్టములఁగుంచి
పెక్కులీలలను జూపించినావు

గీ॥ హృదయమునువచ్చిన [illegible]
[illegible] ప్రేమదృష్టి [illegible]

కలితకరుణాంతరంగ యోగిఖగతురంగ!
ప్రళయకాలాహిభంగ! శ్రీపాండురంగ!
(మైమఱచియుండును)

దామ—మహాత్ములారా! భగవచ్చిత్రము వర్ణనీయముగదా?

విప్రు—ఇందుఁ జిత్రమేమికలదు మహాత్మా! భవదీయ పుత్రుండు సామాన్యుఁడా?

దామ—కాంతా! మన వాంఛితములిప్పటికీడేరినవి. మహీసురులకు విందులొనర్ప వలయుసన్నాహముల నిర్వర్తింపుము.
(గుణాబాయి నిష్క్రమించును)

విప్రు—(నామదేవునిఁ జేరఁదీసి) కుమారా! నీయిష్టము నెఱింగింపవైతివే?

నామ—పెద్దల చిత్తంబులకెల్లప్పుడు ననుకూలవర్తిననియే భావింపుడు.

విప్రు—[సంతసముతో] నాయనా! చిరంజీవివై వర్ధిల్లుము.

దామ—అన్నియుఁ దరువరి మాటలాడుకొనవచ్చును. భోజనకాల మతిక్రమించును. రండు పోవుదము.
[అందరు నిష్క్రమింతురు]

[అవనిక జారును]

ఇది తృతీయాంకము.

———

ఓమ్.

భక్త నామదేవు

ప్రథమాంకము.

౧ వ రంగము—నామదేవు గృహము.

(నామదేవు యున్నట్టి వేషమును [illegible] యుండును. [illegible] పైన [illegible] [illegible] సర్వాభరణ [illegible] నామదేవు గృహ [illegible] తామునట్టి [illegible])

(తెరనెత్తగా రాధాబాయి యేదియో వ్రాసికొనుచుఁ గొట్టి వేయుచు మిక్కిలి గజబిజిలోనుండును]

[ప్రవేశము—వెనుకపాటున నామదేవు]

నామ—(రాధయవస్థఁగాంచి స్వగతము) కాంత యేమియో వ్రాయుచున్నది వెనుకపాటుననుండి యేమువ్రాయునో తిలకించెద.

[వెనుకప్రక్క నిశ్శబ్దముగా నిలచియుండును]

రాధా—(విసుగుతో) అబ్బ! ఎంతయాలోచించినను దక్కిన రెండుపాదములఁగూర్పఁ జాలనైతినే. ఎట్లాగైనసరియుఁ బూర్తిచేసి నాథునకొసంగవలె.

(ఆలోచనానిమగ్నయగును)

నామ—(కొంచెము దాపునకువచ్చి యామె చేతియందలి కాగితమునుగాంచి] ఈమె పతిభక్తినిఁగూర్చి వర్ణనముసల్పుచున్నది. ఆహా! కులసతీమణుల గుణలక్షణములనన్నిటి నీవియే కదా? తిరిగ

గలుగు కాలమందుఁ బరులగృహంబులకేగియో - మైమఱచి నిద్రవోయియో-చెలులతోఁజేరి మాటలధోరణి తనభర్తనడవడినిఁగూర్చి కొండెములఁబల్కియో-సంసారమునందలికలిమి లేముల గురించి పెక్కువిధముల నుగ్గడించియో - యక్కాలమును వృథఁజేయక సత్పథమునుఁగడపు కామినులేకదా సతీత్వమునకాస్పదులు. కానిమ్ము పాపము! కాంత తక్కిన రెండుపాదములనుఁగూర్పఁజాలక మిక్కిలిశ్రమనొందుచున్నది కష్టకాలములందు నాథునిఁ దలంచికొనుట పురవనితలకు సహజగుణము. ఇప్పుడీమె ప్రవర్తన మెట్టు లుండునో చూడవలె.

రాధ—అబ్బ! ఎంతయత్నించినను ఫలము కన్పడుటలేదు! ఏమి చేయుదాన? నాథుఁడేనియుఁ జెంతలేడుకదా ?

నామ—(హాస్యముతో) చెంతనేకలఁడు

రాధ —(తిరిగిచూచి చిరునగవుతో) ఏమి యీవొంగవేసము ?

నామ— (సప్రేమమున రాధనుజేరదీసి) కాంతా! నీవదనమేమో చింతాకలితమైనటులఁ గన్పడుచున్నదే!

రాధ—ఏమియునులేదునాథా!

నామ—(చిరునగవుతో) నీవుదాచినను నేనంతయుఁజూచియేయుంటిని. నీవువ్రాసినపద్యమునుజూడనిమ్ము.

రాధ—(సునుసిగ్గుతో) నాకుదెలియకుండ వెనుకపాటున నిలచి మీరొనర్చు కార్యమిదియా? నాథా! దీనఁగలతప్పులను సవరించిపెట్టుడు.

[కాగితమునొసంగును]

నామ—[తిలకించి] ప్రియా! సగభాగమునందే యాపితివేల?

రాధ—నాభాగమునేను బూర్తిజేసితిని. మీభాగమును మీరు పూర్తిచేయుడు.

నామ—ఏమి వాక్చాతుర్యము నేర్చితివి.

[అని తక్కినసగమును బూర్తి చేయును)

కాంతా! ఇప్పుడు దీనిని బఠింపుము.

[కాగితము నొసంగును]

రాధ—[అద్దానిని గైకొని]

ఉ. కాంతుఁడు సేయుకృత్యములఁ గాదనకెందును వోడు నీద్వయ
సంతసమందుచుం విబుధసంతతి మెచ్చఁ జరించువారలే
కాంతలు; కాంతుకృత్యములఁ గాదని యేగెడువారు కాంతలే
కాంతులపాలి యంతకులుగాక తలంపఁగ ధారుణీస్థలిన్.

[అని చదువును)

నామ—కాంతా! నేను భక్తశిఖామణియగు బ్రహ్లాదుని చరిత్రమును జదివెదనా?

రాధ—(వినయభయములతో) మనోహరా! ఎల్లప్పుడు మనము పురాణకాలక్షేపమున మునింగియుండిన సంసారమును గడపు వారలెవ్వరు? తల్లిదండ్రులన్న మూడుకాళ్ళముదులు. వారలకు మనము సలుపవలసిన కాలముగాని మనకు వారలు సలుపవలసిన కాలముగాదు. ఇంతవరకుఁ దండ్రిగారెట్లులనో సంసారమును గడపుచుండిరి. మనము వారలకుఁ దోడుపడక సతతము శ్రీమన్నా[illegible]సరసీరుహయుగళస్మరణసుధా రసపానపరవశులమగుచో వారికి కష్టమును వారలకుఁ గూర్చిన వారమగుదుము. దీనివలన మనభక్తిమార్గమునకెక్కి సంకటములను గలుగఁ జాలవు. పనిలేని సమయమందు కథాకాల

క్షేపమున మెలంగవచ్చు. మనకుఁ బ్రస్తుతము వ్యాపారము కులవృత్తియై యున్నది. దానజేసి సంసారమునీదుట కొంత సులభముగా నుండవచ్చు. నాథా! వచ్చికొలఁదికాలమైనదో లేదో యప్పుడే భార్యపోరుపెట్టుచున్నదని తలంపకుడు. ఇది యంతయు సంసారము బీదస్థితియగుటఁజేసి తెల్పితిని.

నాము—ప్రేయసీ! ఇందుఁ బోరుపెట్టుటేమున్నది. సంసారమందుగల కలిమిలేముల నెఱింగి తగు సదుపాయంబుల నాలోచించి భర్తలకుఁ దెల్పుట కులకాంతలకుఁగల సహజలక్షణము లేకదా! పురుషుఁడగు వాడింత తెచ్చువరకే కాని యద్దానఁగల వ్యయావ్యయముల సమగ్రముగా నెఱింగి మెలఁగునఁ బ్రవర్తించు వారలు కాంతలేకదా? కాని హరిపదధ్యాన లోలుఁడనై యెచ్చోటనో నిశ్చింతనొయుఁగాలముఁగడపు నాకీ బేరమునఁగల సారము తెలియుగుటెట్లు? అదిగాక వ్యాపారమును జేయుటసవ్యవృత్తియుఁగాను. అద్దానికిఁ బ్రథమసోపానమనృతము. రెండవది వాక్చాతుర్యము. మూడవది యాకర్షణ ఇవి యన్నియు నేర్చినఁగాని యందుండు సాధకబాధకముల నెఱుంగనలవిగాదు. ఇందొక్కటియు నాకు నేర్పరాఁగాను. అట్టి చోవ్యాపారమ్మెట్లుఁ జేయగలనాఁయుని చింతిలువాడ. హరిగుణవ్యాపారమునందు లగ్నమగు నామనంబీవస్తుమూలకవ్యాపారమునందు లగ్నమగునా? ఒకవేళ లగ్నమైనను గించిత్కాలమే కాని కలకాలము నిలువఁబోదు. సత్యహానియై బేరము సల్పినఁ జిల్లిగవ్వయేనియు లభింపదు. అట్టితఱి జానెడు పొట్టకై యీవృత్తి నవలంబించి యనృతవాదినగుటెట్లు? వ్యాపారమునందుమున్గి, వాడవాడలఁదిరుగుచు నా పాండురంగని సేవల సేవగించుటెట్లు? మానినీ! ఇట్టి వ్యాపారము నెటుల సల్పువాడ? ఇంతకాలంబునుండి యన్నపానంబులనిచ్చి రక్షించిన పాండురంగడు నేడు భక్షించునా?

రాధ—[భయముతో] నాథా! పౌరుషమొనర్చికదా దైవమూపై
నాధారపడుట. పురుషయత్నంబున ధనార్జనంబున కొక
వ్యాపారమేగాదు. పెక్కుమార్గములింకను గలవు. అం
దిప్పటికాలము ననుసరించి, గౌరవము, పలుకుఁబడియు,
ధనము, మున్నగునవి చేకూర్చి సుఖింపఁజేయునది యుద్యో
గము. కాన యేభూపతిప్రాపునో సంపాదించుకొని సం
సారమునీదుడు.

సోమ—(నవ్వుచు) తలోదరీ! ఎంతపిచ్చిదాననైతివి. ఒకపట్టున నింక
వ్యాపారముమంచిదగునుగాని యన్నిఁటియందును దుచ్ఛమగు
నుద్యోగము మంచిదగునా? ముందు భూపతిప్రాపును సంపా
దించుకొనుటకై యాతని వాకిలిఁ గాయుచు ముఖస్తుతులను
జేయుచుండవలయు. అటులఁ జేయుచుండ నాతని కెప్పుడో
కించిత్కరుణకలిగి యొక యధికారపదవి నొసంగును. నాటి
నుండియు నాతనికిఁ బాదాక్రాంతుఁడై తన స్వాతంత్ర్యము
సర్వము నమ్ముకొని యాతఁడు కూర్చుండుమనినఁ గూర్చొని
నిలువుమనిన నిలచి యడుగులొత్తుచుండవలె అప్పటితో
స్వేచ్ఛావిహారమనుమాటయే లేకుండఁబోవును. ఇప్పటికిదెం
తనీచవృత్తియైనదో తెలియుచునేయున్నది. ఇఁకదీనఁ జేసి
కలుగు ఫలములన్ననో కడువిచిత్రములు అధికారపదవియబ్బి
నతోడనే యట్టివాని కెక్కడలేని గర్వమువచ్చిపడి కన్నులు
నెత్తికెక్కి కూర్చుండును. అంత తోడివారలతో మాటలాడు
టకు సయితము విముఖుఁడగుటయే కాక మీఁదుమిక్కిలి యట్టి
వారల నీచాతినీచులుగా భావించి తన క్రిందివారలని మలక
నగాఁ జూచును. ఇక బుద్ధినంతయు నధికారము వచ్చినప్ప
టినుండి ధనార్జనమునందే వినియోగించుచు దురాశాగుణ

బద్ధుడై తుదకధోగతిపాలగును. ఒక్కొకవేళ ధనార్జనమునకై నానాబాధలఁ గుడుచుచుఁ గ్రూరకార్యములనేనియుఁ జేయ సమకట్టును. అధికారపదవి యబ్బెగదాయని మిట్టిపడుచుఁ గాలఁదిదూరము నడచినను దనపదవికి గౌరవహానివాటిల్లునని వివిధమార్గముల నీమురికి డొక్కకు బాధఁ గలుగనీయక సాగిపోవుచుండును. దానఁజేసి శరీరమున కిసుమంతయు వ్యాయామము లేకుండుటవలన నానాటికి శరీరపటుత్వము జారిపోవ ననారోగ్యుఁడై యెల్లప్పుడు వివిధజాడ్యములచేఁ బీడింపఁబడుచు నేవిధి ధనమును సంపాదించెనో యావిధినే యంతయును వెచ్చించుచుండును. శరీరమున కారోగ్యము లేక పోయిన నో యెన్ని సౌకర్యములున్నను నెంత ధనమున్నను నవియన్నియు నిష్ప్రయోజనంబులు. పైపెచ్చు ప్రబల బాధాకరంబులు. ఇఁక దీనివలనఁ గలుగు దోసంగులు లెక్కింపనలవిగాదు. లంచగొండులుగఁ జేయునదియు—కూటసాక్ష్యముల గూర్చించునదియు—మొగమోటమును బాటింపనిదియు—క్రూరకృత్యంబులకుఁ బాల్పడఁజేయునదియు—ఎదిరి కొంపలఁగూల్చునదియు—దురాశకుఁ గారణమైనదియు—జీవినిఁ బెనుభూతమువోలెఁ బీడించునదియు — జగంబునం దుద్యోగంబుకన్న వేఱొక్కటికలదా? ఇన్ని తెఱంగుల జీవిని నుద్యోగము బాధించుచుండ నాతనికి నిశ్చలత్వముండునా? నిశ్చలత్వము లేని వానికి భక్తికల్గునా? భక్తిలేనివానికి ముక్తిలభించునా? కాంతా నానిశ్చితంబు వినుము.

ఉ. ఆకులలంబులన్ దినుచు నాహరిఁ గొల్చుచుఁ గానలందు నే
కాకిగఁ గేకికీరకలకంఠ కపోతనినాదమాధురీ
లోకమునందుమున్ని, పరలోకసుఖాకరుఁడౌట యొప్పెడున్
గాక! శరీరికిన్ బరముఖస్తుత జీవనమొప్పునే? చెలీ!

నన్నుద్యోగమును జేయుమనికదా నీవు బాధించుట? ముందుద్యోగంబనిన నొక పనినిసల్పుటకదా? అప్పుడు నేనుమాత్రము నిరుద్యోగినైతినా? నాకుద్యోగమిచ్చినవాడు పాండురంగడు నేనాత్మయుద్యోగిని నేనొనర్చుపని యాతనిచరణసేవయే నాకాతఁడొసంగునది ముక్తిధనము ఇట్టిది నేనాతనియుద్యోగినై యనంతసుఖంబుల నందుచుండ నికెట్టి యెగ్గు ప్రాప్తించెనని యింకొకరి యండఁజేరుదు?

రాధ—(స్వగతము) ఆహా! ఇట్టిపరమభక్తుని పత్నినగుటచేతనేకదా ప్రపంచమునఁగల కష్టపరంపరల నెఱుంగఁజాలితి. అవును నాథునిపల్కులే కైవడి నాసరసిజలోచనుని చరణసేవలకన్నఁ గ్రూరకిరాతులనదగు ధరాధిపులసేవలు పరమపవిత్రములగునని యెవరుచెప్పఁగలరు? కాని యన్నిఁటియందును గుణమే ప్రధానము. అప్పుడుద్యోగియైనియు గుణవంతుఁడగుచో సజ్జనుఁడేలకాఁగూడదు? అగుగాక భర్తగారుచెప్పిన ప్రకారమొరులకుఁ దనస్వాతంత్ర్యము నమ్ముకొని లభించిన తద్ధనముచే జీవించుట కడునీచమని యొప్పుకొనక తప్పదు. కటకటా! పాండురంగని పూజాప్రభావం బెఱింగియు నుద్యోగమును సంపాదింపుడని యెంతయుందమతినై పల్కితి.

సీ. పాండురంగని భక్తునిపత్నినయ్యు
సహజస్త్రీచంచలత పెడఁజాలనైతిఁ
గాక మెట్టులో కోయిలఁగలసినంత
నైజగుణమెవ్విధం బోవునా? తలంప.

(ఆలోచనానిమగ్నయగును)

నామ—కాంతా! దీర్ఘాలోచనము సేయుచుంటివేల?

రాధ—(గద్గదస్వరముతో) స్వామీ! మీరిటుల నన్నిఁటికన్ని తెఱంగుల బల్కినచో నేనేమి మాఱుచెప్పఁగలదాన ఐహికసంబంధములగు వృత్తులన్నియుఁ గేవలము పాపభూయిష్టములగుచో జగంబుననుండు జనులందరుఁ బాపులేనా? అందరును పాపులగుచో ధారుణీమాత భరింపఁగలదా? ప్రతివస్తువునందును

ప్రతివృత్తియందును ప్రతిజాతియందును వేయేల? సర్వభూత వస్తు సముదాయంబునందును నొకదెసమంచియు నింకొక వంకఁ జెడుగును గలసియుండునని పెద్దలు చెప్పుదురు సన్మార్గు లగువారలప్పట్టున మంచియిదియని యెఱింగి యామార్గము ననుసరించి కృతార్థులగుచుండుట లేదా? అట్టులనే మనము కూడ సన్మార్గమున వర్తించినచోఁ బాపమేల వాటిల్లు? కానఁ గులవృత్తిని మంచిమార్గముననే సాగింపుము. దానధనము లభించుఁగాక లేక లభింపక పోవుఁగాక. అటుల నొనర్పుటఁ జేసి పురుషకారము పూర్తియగుచున్నది. అప్పుడు దైవము సానుకూలంబగు.

నామ——మనోహారీ! నీవుచెప్పినది యథార్థము. నేనదియెఱుంగుదు ఉద్యోగమునందు నికుఁగల భేధాభిప్రాయమును దొలఁగించుటకై యట్టుల నిజముపల్కితి. ఉద్యోగమునకున్న వ్యాపారము కడుంగడు శ్రేష్ఠము దీనియుందొకరికి తన స్వాతంత్ర్యము నమ్ముకొనుటసంభవింపదు. స్వేచ్ఛావిహారమునకు భంగము వాటిల్లదు. క్రూరకార్యములకుఁ బాల్పడవలసిన యగత్యము గలుగఁజాలదు. సంసారభారమును స్కంధమున మోయుట నాకు విధాయకమేకదా? నేటినుండి తల్లిదండ్రుల సుఖభోగులుగఁ జేయువలయు. అదియేకదా మనకు శ్రేయమునుగూర్చునది. గృహస్థుఁడనెప్పుడైతినో యప్పుడే గృహభారము నాపైనిలచియున్నది. నీయట్టి కాంతనాచెంత నిలచియుండ నన్నియుఁ దమంతట తామే చేకూరఁగలవు. రేపటినుండియే కులవృత్తిని సత్పథమునసాగించెద.

రాథ- మనోనాథా! మీమానసమును జాలచింతలపాలు జేసితినిగదా.

నామ——(సప్రేమమున) నీయట్టి సతీమణి నాకు లభించినప్పుడే హృదయమున నిశ్చింత నాటుకొనిపోయినది. ఆహా ప్రేమనిధాన మన నీవేకదా? (వక్షమున జేర్చుకొనును)

[తెరవ్రాలును]

౨ వ రంగము—లక్ష్మీపురము రాజవీధి

(నామదేవు డిప్పటి కేవలము వ్యాపారమొనర్చువానివలె నుండవలయును. [illegible] నాసుకకొ బిరింపులుగల చౌకాల్చొక్కా తొడిగికొని పైనవల్లెవాటును నొడలు తులసిపూసలును [illegible] సాయమును చేతియందు [illegible] నవీనమువేత్రదండొక [illegible] పుస్తకములు [illegible] మూలాలు పారిజాతనికట్టును మూమున [illegible] ద్వాదశనామములును గలిగి [illegible] బొట్టునిడి [illegible] నటనము సలిపెడివానివలెను గన్పడవలయును. సేవకుడు [illegible] తగినవేషముతో నుండవలయును. [illegible] బీదసమునంతయు [illegible] నాటకరంగమంతయు [illegible])

(ప్రవేశము—నామదేవు. గుడ్డలమూటతో సేవకుఁడు)

నామ—(నిమీలితనేత్రుఁడై) రంగా! ఖగరాజతురంగా,

అనుబంధము. ౧౭.

ఉ. ఏపనో నిన్నుఁగూర్చి జపియించుచు నుండెదు నామనంబు నీ
పాదము సేవఁ బొంపు బనిసేఁబాల్పడఁజేసిలనేమనందు నే
సేవకుఁబోవువాఁడ? నిపుడెట్లుఁ? జేరము సేయువాఁడ నీ
వాఁడననుచు నా భయముఁబాపఁగదే! కరుణాపయోనిధీ

(దిక్కులు పరికించి) కుమారా! ఇంకను సూర్యోదయంబు కాలేదు. కొంత తడవిచ్చోట వేచియుండి పురప్రవేశ మొనరింతము.

[ఒక శిలాపట్టున గూర్చుండుదురు]

సేవ—తండ్రీ! అరుణకాంతులు వ్యాపించుచున్నవి,

నామ—కుమారా! ఇప్పటి ప్రకృతి శోభను గమనింపుము. అహా! ఆకసమెంత గంభీరముగానున్నది. తరుపత్రములయందలి మంచుబిందువులు ప్రకృతికాంతమేననోచెడు మౌక్తికంబులవలె నొప్పారుచున్నవి. ఏమి యీ యుషఃకాలభావగర్భిత గంభీరత!

సీ. గంభీరసముదగ్రకదనరంగమనంగ
నల నభోభాగంబు జెలగియుండఁ
మోహరించిన చమూవ్యూహంబులోయనఁ
బ్రాక్పశ్చిమాద్రులు ప్రబలియుండ
నేకమై ప్రేల్చు తుపాకిరవ్వలనంగఁ
దారలొండొంటితో జారుచుండఁ
బతిమహావీరసంయుత శాత్రవులనంగ
నంభోజ కుముదాప్తు లమరియుండఁ

గీ. బ్రబలముగఁ బాఱు రక్తప్రవాహమనఁగ
నరుణకాంతిచ్ఛటల్ దిక్కులలముకొనఁగ
నసజయంబునఁ గుముదాప్తుఁ డడగిపోవ
జయముగాని పూర్వగిరిని భాస్కరుఁడు వొడిచె.

—♦ సూర్యోదయము ♦—

నామ—[బద్ధాంజలియై] తండ్రీ! లోకబాంధవా!

ఉ. ఏమెఱఁగర్ఘ్యనిష్ఠ మునిబృందములొక్కటనీకునర్ఘ్యముల్
పాయక మూఁడువేళలను బాలొనరింపఁగ నేపరోపకా
రాయతమానసంబున హితాహితముల్ గుఱుతించి సూర్యనా
రాయణమూర్తి! ప్రోచెదవుగా? జగమందలిభూతజాలముల్.

[కొంతతడవు ధ్యానతత్పరుఁడగును]

సేఠ—(స్వగతము) అబ్బ! ఎంతతడవు వేచియున్న నీయనకు భక్తి పిచ్చియేకాని వచ్చినకార్యమును ముగించుకొని పోదమన్న చింతయే పొడకట్టదు. ఇఁక నేను గూడ నీయనతో గూర్చుండిన నెట్టులుండవలెనన్న నట్టులేయుండును. తొందరింపకపోయినచో నెంతకాలమేనియు నీయన యీపిచ్చిలోఁ బడియేయుం

దును. [ప్రకాశముగ] అయ్యా! ముందు సూర్యాతపంబునకుఁ దాళలేము. పెంటలకడనే మన పని ముగించుకొని పోదము రండు. [నడచుచు రాజవీథిని దరియుదురు]

సేవ—[ఎలుగెత్తి] జలతారు చీరెలు—బొమ్మాయి రవికెలు—పట్టు గుడ్డలు—చొక్కా గుడ్డలువ్వాయ్. చౌక! చౌక! మంచి నాణ్యమైన గుడ్డ!

న మ—ఓరీ! అప్పుడే బేరము సాగించితివా? ఈవీథిని కొనువార లెవ్వరుఁ గాన్పింపరు. ఇంకొక వీథికేగుదము పద.

[మరియొక వీథికేగి నచ్చోటఁ గొందరు బిచ్చకులుందురు]

౧వ-భి—అయ్యా! అయ్యా! ఈరెండు నేత్రాల్లేని కబోదికొక్కడబ్బు దరమం సెయ్యండి బాబుల్లార. రామ రామ! శివనారాయనా! ఒక్క మారాజుకైనా దయరాలేదే?

౧ శెప్పటాకైనా తరముగాదు నా శెల్లెలమొరయినురామా యిప్పుడు నా కుడియత్తములోనొక గొప్పకుర్పు శిరామా.

[ఆవీథినిఁబోవు పెద్దమనుష్యునిజూచి వాడు చెయ్యిజాప నాతడు కరుణ లేక యాతని చేతిమీద బెత్తముతోఁ గొట్టిపోవును]

నామ—[అదిగాంచి తత్తరముతో] అయ్యో! అయ్యో! ఆతఁడెంతటి భూతదయావిహీనుఁడు. పూటకి లేక యడిగినాడని యేదియో యాతని కొసంగకపోవుటయేగాక నోరు తెఱచి యడిగినయా నిస్సహాయుని—[illegible] హస్తమును జాచిన యానిర్భాగ్యుని—కొట్టుటయే. హారిహారీ! ఎంతటి స్వార్థపరత్వము!

౨ బిద—ఈకాల్లులేని కుంటోడికంత దరమం సెయ్యండి తండుల్లారా ఈ దిక్కులేని పచ్చిపై సూడండి సాముల్లారా! అరిఅరీ! ఏతండికి దయలేదే.

౧ యేమిజల్మంయేమి జీవనమో యీమాయకాయం॥
రామయ్యరామా! రంగయ్యసామి॥ యే॥

చ. యేమిజల్మంయేమిజీవనం యేమిశాశ్వతం యేమిసౌఖ్యం
యేమినాపాలుధ్దకల్మం సామినన్నిటు శేశిమరశేను॥

[కొందరు పెద్దమనుష్యులా దారిని బోవుచు వానినిఁ
బలుదుర్భాషలతో కసిరి కొట్టుదురు]

(బిచ్చకులందరు మొరవెట్టుచుందురు)

నామ—[కడువిచారముతో] కటకటా! లోకమున నెందరు జీవులు మలమలమాడుచుండిరి. పురమునుగాంచినంతనే లక్ష్మీపుర మనునామము సార్థకమేయని యెంచితినే? ఇట్టి పురంబునఁ గూడ బీదజను లెట్టులఁ బరితపించుచుండిరి. సకలైశ్వర్యము లందులందూగు నిచ్చోటివాసులీపేదలకు సాయమొనర్పరైరి కదా? హా! వీరికిధనముండిన నేమి? మండిన నేమి? తోటి సోదరులిట్టుల, దిక్కులేక దీనభావమున నలోలకుసాయని విలపించుచుండఁ గన్నులారజూచి, యిసుమంతయుఁ బ్రేమఁ జూపక, యక్కటికవిహీనులై దిక్కుమాలినవారల హింసించుటయా? పరోపకారబుద్ధియే లేకున్నచో నీసౌధములు - ఈవైభవములు-అన్నియుఁ గౌరవమాలినవి కావే. భగవంతుండేనియు లోభులకే సర్వసంపదల నొసంగునుగాని యిట్టి నిరుపేదలకు సాయమొనర్పడుగదా? ఈశరీరములు- ఈభోగములు-ఇవియన్నియు శాశ్వతములా? (ప్రకాశము) ఓపుర వాసులారా! ఓధనాకరులారా! భూతదయ నించుకయేనియుఁ జూపరేల? ఇందరుదీనులిప్పట్టణంబున వాపోవుచుండఁజూచి యెట్టుల సహించుచుంటిరి? మీకుఁబరోపకారమనుమాటయే లేదా?

ఉ॥ స్వార్థములన్ బ్రియాసపడి పచ్చుట నీవవుంజావుగానె? స
త్యార్థులు మున్ను త్యాగులయి దానము సేయరె? సర్వసంపదల్
వ్యర్థము విత్తమంచు ననవాయుదుఁ గావరుగా? పరోపకా
రార్థమిదంశరీర మనునార్యవచోక్తి నెఱింగియుండియున్.

ఎంత మొత్తుకొన్న నేమి లాభము? కరుణయను పాంట సిరిల హృదయంబున జాగరితమగుచున్నంగదా తెల్పెడు బోధలు తలకెక్కుట? [పేదలదిక్కై] సోదరులారా! వాపోవకుడు.

[మూట విప్పుచుండును.]

సేవ—(స్వగతము) అయ్యో! ఇంకేమున్నది? అంతా అన్యాగారిపోవుచున్నది. అయ్యగారి శోరంఅయింది. అనుకుంటే యేమున్నది. ఈవిలువగల వలువలన్నియు వీరిపాలుగానలసినవే కాబోలు ఓరి వీండ్లముండమొయ్య యమదూతలవలె పిక్కృక్కుడ దాపరించినారురా బాబు. సిక్కుని తోసినంద నలన లాభమేమున్నది మాన బంగారం మంచిదికారాదు? ఇతకు యీాయన సరిగా శోరం చేస్తాడని యెవరనుకొన్నారు అంగానే యీాయనతల్లి నాకెంతో బోధచేసి పంపినది నేనిక్కడచేయునది యింకేమున్నది. నేచెప్పినా వినేబుద్ధిగలవాడుకాడు అయ్యో! ఆగుడ్డల మూట నాదగ్గరన్నా ఉంచుకొనకపోతి. ఈగొడవ అంతా నాకెందుకు? నాదారినాది. అయ్యగారిగారి అయ్యది.

(నిష్క్రమించును.)

అం.బీద.—బాబూ! ఇంతపట్టులో మీాలొక్కరే దరమంత్ములు మాంమీాదఓరికి యీాడదయలేదునాయనా?

(నామదేవుచుట్టు మూగుదురు)

నామ—ఆహా! వీరి దీనాలాపములవిన నెవ్వరి మనంబు కరుగకుండును. ఈనగరవాసు లెంతటికఠినచిత్తులు? సోదరులారా! క్షమము

ధనమని పాకులాడుటయే కాని పోవునప్పుడు వెంటఁగొని యెవ్వరుఁబోఁజాలరు. తనకాలమున భూతదయాపరతంత్రుడై యెవ్వడుండునో యట్టివాడే సకలజనములచేత నుతియింపఁ బడుచుండు. మనకు స్థిరమను పదార్థమెద్దియును లేదు. సంతతము పాండురంగని భజనలుసేయుము. ఆతఁడేమనకు సర్వవిధములఁ దోడగువాడు. రక్షించువాడు.

(తనయూటనున్నద్రవ్యము నందరికిఁ బంచిపెట్టును)

బీ. అం—(సంతోషముతో) సామీ! మీకడుపు సల్లన యీయూల పొద్దున మాకింతగంజి కలిగింది బాబూ.

అ ను బ ం ధ ము ౧౭

జయజయరంగయ్యసామీ.

(నిష్క్రమింతురు.)

నామ—[స్వగతము) ఇక్కడికి వ్యాపారమున గణించిన విత్తము నంతయుఁ బంచిపెట్టితిని. చేతఁ జిల్లిగవ్వయేనియు లేదు. ఇంక కొన్నివలువలు కలవుకదా? వానితో వ్యాపారమొనర్చెద. ఇదంతయుఁ బాండురంగనియాజ్ఞయేకదా? హేమహానుభావా!

శ్లో॥ సజయతువనమాలీ రాధికానందశాలీ
రిపుకులబలహన్తా పీశగన్తా సమన్తా
హిమకిరవదనాభిర్గోపికా భిశ్రితాంగః
కరకలితరథాంగో నీరదశ్యామలాంగః॥

[భజనసేయుచు నిష్క్రమించును]

(అవనికజారును)

ఇది చతుర్థాంకము.

ఓమ్.

భ క్త నా మ దే వు

ప ం చ మా ం క ము.

౧వ రంగము. ఒక సత్రము.

(ఆనాఁడు హరివాసరమగుటవలన నామదేవు వ్రతదీక్షాపరుఁడుగా నుండవలయును. పట్టువస్త్రమును గట్టుకొని నడికట్టుగట్టుకొని పైనఁదనెయంగవస్త్రము నొకదానిని వైచికొని యురమునను బాహువులను మోమునను వైష్ణవ నామములఁ బెట్టికొని కాళ్ళకుఁ గజ్జెలుకట్టుకొని చేతియందు భజనపుబలకలు దరించి హరిభజనలోలసుఁడై యుండవలయును. రాధాబాయియుఁ బీతవసనంబును నట్టికంచుకంబును, జారుముడిగల సిగయు మున్నగువానిఁ గలిగి తదనుకూలంబుగా నుండవలయును. వృద్ధబ్రాహ్మణుడు సముచితవేషమును ధరించి యెక్కువ పట్టుదలగల భావముగలవాఁడై యుండవలయును.)

[నామదేవు భార్యాసహితుఁడై తీర్థయాత్రలకేగుచు సత్రమున బసచేయును]

నామ — కాంతా! నేడు హరివాసరము. నిరాహారులమైయుండవలయు

రాధ — నాథా! అతిథులెవ్వరేనివచ్చినచో వారల సంతృప్తులఁ గావించుటెట్లు?

నామ — కందమూలాదుల నొసంగి యర్చింతము.

రాధ — నాకీ సందియమును దీర్పుడు. నేడు నిరాహారులమైయుండవలయునని మీరు పల్కితిరిగదా? అతిథులకుఁ గందమూలఫలంబుల నొసంగినచో నాహార మర్పించినవారలమగుదుము కదా?

నామ — ప్రేయసీ! చక్కని [illegible]తివి. ధర్మసూక్ష్మత యనఁగా నిచ్చోటనే నిలచియున్నది. చూడుము. ఘోరాటవులయందుండుఋషులు కొందరు కందమూలముల స్వీకరిం

చియుఁ గొందరు వాయుభక్షకులయ్యుఁ గొందరు పర్ణభక్షకులయ్యుఁ బెక్కువిధంబులఁ దపములసల్పిరికదా. పైనిచెప్పిన వానిని భక్షించుచుండినను వారలందరు నిరాహారులే అందులకుఁగారణమేమో? మనకు సరియగు నాహారమేది? భోజనము. అద్దానిని వదలి తదితరములగు నెన్నియాహారములఁ దినినను మనకుఁ దృప్తికలుగజాలదు. సర్పమునకు గాలియాహారము. అది గాలిని భక్షింపకుండ, దక్కినవి యెన్నిభుజించిన నది తృప్తిపడఁజాలదు. అటులే మనకు నాహారములుగాని వాని నుపవాసవ్రతములయందొసంగినను దోషము కలుగఁజాలదు. హరివాసరవ్రతాచరణులగు వారు మాత్రమానాడు జలపానమేనియుఁ జేయఁగూడదు. మనవలె నందరుండినచో నెవరికి వారలే నిక్కముగ నిరాహారులైయుందురు. మున్ను రుక్మాంగదుఁడు తన ప్రభావముచేత సకలజంతుజీవకోటిని నిరాహారులఁగాఁజేసె. కానిమ్ము అతిథులెవ్వరేని వచ్చినచో నేకాదశీవ్రతమాహాత్మ్యమును గురించి చెప్పి నిరాహారులైయుండునటుల సల్పుదము. కానిచో ఫలంబులొసంగి పూజింతము.

(ఇంతలో నొకవృద్ధుఁడు క్షుదాగ్నిచేఁగూలుచువచ్చి నామదేవుముందుఁగూలఁబడును.)

నామ—[తత్తరముతో] స్వామీ! ఈస్థితి మీకేల కల్గినది ?

వృద్ధ—(క్షీణస్వరముతో) అయ్యా! ప్రాణములు పోవుచున్నవి పిడికెడన్నముం బెట్టి పుణ్యముఁగట్టుకొమ్ము.

(కన్నులఁ దేలవేయును)

నామ—(కడువిచారముతో) మహాత్మా! నేఁడు హరివాసరముగదా?

వృద్ధ—అయ్యా! నాకేవ్రతము లేమియు నక్కర లేదు. ముందింత కబళము నొసంగుము.

నామ—కాంతా! కందమూలాదులఁ దెచ్చి మహాత్మున కర్పింపుము.

[రాధాబాయిలోపలి కరుగును]

వృద్ధు—(కోపమభినయించుచు) నీకందమూలములు నాయాకలిని దీర్ప జాలవు. నాకవియేల యర్పించెదవు. నాకుఁగావలసినది భోజనము దక్క పెరవస్తువు లేమియు వలదు. వృద్ధునకొకింత సాయముఁ జేయలేవా?

నామ—మహాత్మా! అతిథిపూజలు సలుపలేకగాదు. నేడేకాదశికదా? ఏకాదశినాడు భోజనము స్వీకరింపఁగూడదని పెద్దలు చెప్పిరి కదా! అట్టి పుణ్యతిథియందు దేవతలుసయితము విష్ణుమూర్తిని నేకదీక్షతో భజించి కృతార్థులగుచున్నారు. అప్పుడు మర్త్యులమగు మనము పక్షమునకొక్కదినము భగవంతుని నిరాహారులమై భజింపఁజాలమా? తండ్రీ! నీయాకలిబాధ యీఫలంబులచేఁ గొంత సమసిపోదా? నేఁడంటరాని పదార్థమును దెమ్మనుట భావ్యమా? పెద్దలు మీరు మాకు నీతిఁ జెప్పి ధర్మమార్గమునకుఁ ద్రిప్పి సద్వ్రతముల నాచరించునటుల జేయవలెఁగాని నీరీతినిఁ గోరుట న్యాయమా? హరివాసరవ్రతము ననుష్ఠించియేకదా సకలజీవులు రుక్మాంగదుని పరిపాలనయందు మోక్షముఁ జెందినవి? మహామునులు సయితము మిద్దానిని సల్పియేకదా తరించినది? స్వామీ! ఒక్కనాటికి ఫలంబుల నారగించి మీ యాకలి నణంపుకొనఁజాలరా?

వృద్ధు—ఓయీ! ముందిచ్చోటఁ బ్రాణంబులు పోవుచుండ వ్రతము వ్రతమని స్వస్తి చెప్పెదవేల? తలప్రాణము తోకకు వచ్చుచున్నది. భోజమునొసంగవా?

నామ—తండ్రీ! నేటిదినమున నొసంగఁజాల.

వృద్ధు—(నోటిమీద చేయినై చికొని] అయ్యో! జీవుడా! నీవెంత యారాటపడుచుంటివోయి. అయ్యో! అయ్యో! కన్నులు తిరిగిపోవుచున్నవి. అయ్యో! నామదేవు! నీవేమో అతిథిపూజాసక్తుఁడవని యిచ్చోటికివచ్చినందులకుఁ పిడికెడన్నమును

జెట్టనైతివికదా? ఇదియేనా నీయతిథిపూజాస్వభావలక్షణము? కుమారా! ప్రాణముపోవుటకు సిద్ధమగుచున్నది. కనికరముంచి యిప్పుడేనియుఁ గొంతయన్నమునొసంగుము. ప్రాణదానము కన్న నీవ్రతమెక్కువా?

నామ—స్వామీ! మీప్రాణముపోయినచో నాప్రాణము మాత్ర ముండునా ?

వృద్ధు—నీయుపన్యాసము గట్టిపెట్టి రక్షింపుము రక్షింపుము. అన్న దాన మొనర్పుము.

నామ—(విచారముతో) ఒనర్పఁజాలనందులకు క్షమించి యిప్పటికి ఫలముల నారగింపుము.

వృద్ధు—(కనులుమూసి) ప్రాణములు పోవుచున్నవి కుమారా! రక్షింపుము.

నామ—నాప్రాణములుగూడ రాఁగలవు తండ్రీ!

వృద్ధు—ముగిసినది. పిడికె......డ......న్న......

(నిర్జీవుఁడగును)

నామ—(శిరమును మోదుకొనుచు) హా! హా! తండ్రీ! గతించితివా! గతించితివా! అయ్యో! పాండురంగా! ఎంతటివిపద్దశఁ గలిగించితివి. అతిథిపూజా గర్వోపేతుఁడనని పేరువహించి చేతులార వృద్ధునిఁ జంపితినే? హరిహరీ! నాజన్మమేల కాల్పనా? ఎందఱికో యన్నదాన మొసంగితినే? కటకటా! వ్రతదినమందే యీ వృద్ధుఁడీటుల సన్నదానముగోరుటేల ? (పెద్దపెట్టున శోకించుచు) ఒకనిస్సహాయుని ప్రాణముల నిలువునఁ దీసితినే. ఇంక నా యీ శరీరమేల? అయ్యో! అయ్యో! రామా ఇదియంతయు నీమహిమయేకదా? ఈ వ్రతగుణంబుల నిట్టివ్యథఁ జేకూర్పనేల? నన్ను వ్రతదీక్షాపరునిఁగా జేయనేల ? ఈ వృద్ధుని నేడీనాయందకుఁ జేర్పనేల? ప్రాణముల హరింపనేల?

అయ్యయ్యో! తండ్రీ! ఫలములనారగింపుమని యెంతవేడినను విననైతిగదా. ఫలముల నారగించినచో నీదుస్థితి సంభవింప నేరదుగదా. రంగా! ఎంతలో నెంతటిమార్పుc గలిగించితివి.

అనుబంధము ౧౭

ఉ యాచకపాళికేయెడల నాస్తియటంచును జెప్పలేదు కా
ణాచి నొసంగుమంచు నెఱవన్నినవారల రిత్తవుచ్చలే
దేచరకేని డీకొనుచునే గడియించితి నీదుసేవ! శే
షాచలవాస! నేడిపట హా! యాకవృద్ధుని జంపితిగా గదా ?

(విలపించుచుండును

రాధ—[తత్తరముతోc బ్రవేశించి) నాథా! నాథా! ఇదియేమి?

నామ—హా! కాంతా! అతిథి హంతకుడనైతిcగదా?

రాధ—[మిగుల విచారముతో] హా! హా! నేడెట్టిమాట వినవలసి వచ్చె. హా! పాండురంగా! మేమేమియపరాధ మొనర్చితిమని యిన్ని చిక్కులc బెట్టుచుంటివి? సంతతము నీచరణసేవలకన్న నన్యమెఱుంగమే? ఒకరికిc గీడుc జేసియుండమే? అయ్యయ్యో! తండ్రీ! ఎంతటిదుర్భరసంతాపమును గూర్చితివి? నీదాసులకే యిట్టిసంకటములు గల్పించుచుంటివి. దీనులమగు మాపై నింతటి కోపమూనుటేల? మాకు నీకన్న వేరొండు శరణంబు గలదా? తండ్రీ!

అనుబంధము ౧౮

శా. హా! కృష్ణా! నను(బ్రోవవే యనుచు దీనావస్థయుండుండి ని
న్నే కాంక్షింపc బటాలి ద్రౌపదికి నెంతేని గటాక్షింపలే
దే? రాక్షస్యము లేల మాకు ... రాదే! ... వహో!
యాకారుణ్యము మాపయిన్ బూనవేల దేవా! పాండురంగ ప్రభూ!

[కొంతతడవు ప్రార్థించును]

[కొంచెదిధైర్య మవలంబించి] నాథా! దైవకృతంబును దప్పింప సమర్థులెవ్వరు? భగవదిష్టానుసరణి జరుగు కార్యంబుల మరల్పఁగలమా?

నామ—కాంతా! నేటితో నాప్రాణములుగూడఁ జెల్లఁగలవు.

[ఇదంతయు విని సత్రమునఁగల జనులచ్చోటికివత్తురు]

జను—(శవమునుగాంచి) హత్య! హత్య! అయ్యో! మూఢుడా! అన్యాయముగా నీవృద్ధునిఁ జంపితివేల?

నామ—[దీనవదనముతో] భగవదుద్దేశమున కెవరేమిచేయఁగలరు?

జను—ఓరిగ్రూరుడా! మాటలాడుటకింకను నీకు నోరెట్లువచ్చుచున్నదిరా? ఇది భగవదుద్దేశమా? చేతులారఁ జంపి తప్పించుకొనుటకై చూచుచుంటివా? ఈనగరమునకింక నంతటి యరాజకీయము సంభవింపలేదు. ఇప్పుడే భటులు రాగలరు.

(కొందరరిగి భటులను దీసికొనివత్తురు)

భటు—అరే అల్లా! ఖట్టుఫకల్ ఖూనీ? మాఫాదుషాగాదికి చలో ఆడ నీకీ తగ్గదండన చేస్తారు. బేగిచలో.

(అని చెయ్యిబట్టి లాగుదురు)

నామ—(కడుశాంతిముతో) భటులారా! నాకు మీ పాదుషాగారి విచారణ మక్కరలేదు. నాకు నేనే విచారించుకొనఁగలను. ఇప్పుడే యీతనితో నాప్రాణములను సమర్పించుకొనుటకు సిద్ధమైయున్నవాడ. మీరాజుగారింతకన్న నెక్కుడేమి చేయఁగలరు.

భటు—మాకీ నీతుల్ గీతుల్ నై. నీకీ ఖట్టుకపోవటం మాదీపని.

[చేతులకు సంకెళ్ళువేయుదురు)

రాధ—[పట్టరాని దుఃఖముతో] హా! నాథా! ఎంతటివాని కెంతటి దుస్థితి సంభవించినది.

సీ. హరిపూజ లేకాని యన్యంబు నెఱుఁగని
కరములు కఠినసంకెలలఁ దగిలె!
హరిసేవయే కాని యన్యంబు నెఱుఁగని
భావంబు నరహత్యపాపమందె!
హరికీర్తనమె కాని యన్యంబు నెఱుఁగని
శ్రవణముల్ పరుషభాషణములవినె!
హరిధ్యానమే కాని యన్యంబు నెఱుఁగని
మనము మహీశుశాసనమువచనె!
గీ. కటకటా! భక్తుఁ డేడ? యీ కలుషితుఁడకి
జంపనలకుఁ బాల్పడు టేడ? శ్రీవరా! స
కల చరాచరముల నొక్కగడియయందె
యిచ్చపొప్పిన నాడింతు వెపుడు నగుచు.

[అని విలపించును]

నాయ—[చిఱునగవుతో] కాంతా! పామరత్వమును జెందకుము. సుఖదుఃఖమ్ములు ప్రాణికి సమానములు. సుఖకాలమున సంతోషము దుఃఖవేళల విచారమును బొందుట నీరలకుఁ దగును గాదు. అన్నిఁటిని భరించి యేకముగ నుండుటయే మెచ్చఁదగినది. నాదుస్థితికై విచారింపకుము. ప్రాకృత శరీరములు భేదములైనను మన యాత్మలు గలసియేయున్నవి. ఆత్మను భేదపరుప నెవ్వరుఁజాలరు. మనయాత్మలు రెండును నొకేకరణి మెలఁగుచుండ మనకు విచారమేల? ఎప్పటికేనియు నీదేహములు నశించునుగాని యాత్మలు నశింపనేరవు. ప్రేయసీ! విచారముడిగి సుశీలవైయుండుము. పరాత్పరుని భజించుచుండుము. అన్నిఁటికి నాతఁడే రక్షకుఁడు. శోకింపకుము. (భటులతో నిష్క్రమించును)

రాధ—హా! నాథా! (మూర్ఛిల్లును)

(తెరవ్రాలును)

౨వ రంగము. పాదుషా దర్బారు.

(నామదేవు యథాప్రకారవేషమునసే రంగమునఁ బ్రవేశింపవలయును. కోపభావమేమాత్రము లేనివానివలెను సేవలకు నగుమొగంబునసున్న వానివలెను గన్పడవలయును. పాదుషా వేషధారణము బంగారుజరీపనిగల మొహమ్మల్ అంగరకాను టోపీగొని గాజరీఖనిఁదల్పు సకల చిహ్నంబులదాల్చి యుండవలయును. రాయజీ హిందూమతానుసారముగను భక్తుని విధముగను మంత్రిపదవిఁ దలుపునందమునను వేషమునుదాల్చి యుండవలెను.)

[తెరనెత్తగాఁ బాదుషా మొదలగువారలాసీనులై యుందురు]

పాదు—రాయజీ! మీాదీహిందూమతం ఖూసీల్ పే శేమతం. దీన్కా బడామతం హిందూమతంఅని చెప్తావే.

రాయ—ప్రభూ! తొందరపడి హిందూమతమును దూఱవలదు. ఆభక్త సింహునిటకు రప్పింపుడు. అతఁడే తనమతిమత్త్యుత్తమమని నిరూపింపఁగలఁడు

పాదు—అజీ! అచ్ఛా! (భటులదిక్కై) అరే! అతన్కి గొప్పగా పట్కి రాండిరా?

(భటులరిగి నామదేవుని నిర్బంధితునిగాఁ దీసికొనివత్తురు)

నామ—పాదుషావారికివే ధన్యవాదములు.

పాదు—మీాహిందూ పసువుల్కుంత జ్ఞానమా? ఫట్టుఫగల్ ఖూసీ పేస్తావే?

నామ—రాజా! వ్రతకర్మానుసరణి నట్టులజరిగెనే కాని యిందు వాతిప్రేమియు లేదు.

పాదు—ఖూనీపేస్తాన్కి వ్రతంకియెందుకు? ఇంత హాన్నంపెట్కి పొయ్యావ్. ఎంతబడామతం మీాది హిందూమతం.

నామ—రాజా! హిందూమతమును దూఱవలదు.

పాద—అరే! తాళ్ళకీమొక్కేది హిందూమతం. పావుల్కిమొక్కేది హిందూమతం బూడ్దెకిపూసేది హిందూమతం. అచ్చామతం కానైజీ

నామ—(శాంతముతో) అయ్యా! హిందూమతస్వభావమును సమగ్రముగా గ్రహించినచో మీరివ్విధిఁబలుకరు. ఏద్దానినిగూర్చి విచారించినను మూలముననుసరించియే విచారింపవలె. హిందూమతమసామాన్యము. అంతయుఁ బరమాత్మస్వరూపమే పరమాత్ముఁడు నిర్విశేషుఁడయ్యును విశేషమధ్యమున వ్యక్తుడగుచున్నాడు. నిరాకారుడయ్యు ననంతాకారుఁడగుచున్నాడు. విశిష్టుఁడయ్యు నిర్విశిష్టుఁడగుచున్నాడు. హ్రస్వదీర్ఘస్థూలసూక్ష్మానంద ప్రవాహమాతనిదే. రాజా! దేశమునకంటె నత్యుత్తమమైన పదార్థము దేశమునుండియే వెలుగొందుచున్నది. పరాత్పరుఁడిట్లు తనచిత్రఫలకము నందనంతమగు తనస్వరూపమును వ్యక్తపఱచుచున్నాడు. సత్యమేకమైనదనియు, నేకమతగుణాకలితంబగు నదే సత్యమనియు నేకమతసంబంధమై యేకమాత్రస్వరూపమున బ్రకాశించునదే సత్యమనియుఁ దలంచువారు కేవలము నేకమతసంబంధమగు సత్యమునే గ్రహింపఁగలరు. కాని యనంతమగు ననేకమతసంబంధసత్యమును వారు గ్రహింపజాలరు. అనంతమగు నేకత్వ మనంతమగు ననేకత్వమునందుఁ దన్నుఁ బ్రకాశింపఁజేసికొనుచున్నది. సమత్వలిద్దానిని గ్రహింపఁగలరు. ఇయ్యదిహిందూమతమునందు [illegible]ంచుచున్నది ఇతరమతము లన్నియు నీశ్వరునిఁగొలదిగనో మొక్కడుగనో యనేకవిధముల విశేషమధ్యమునబాధించుటకుఁ గడంగుచుండును. హిందూమతముగూడ నీశ్వరుని విశేషమధ్యమున నుంపవలెనని కోరునుగాని యావిశేషమే [illegible] మాత్రస్వరూపమనియు నేక

గుణప్రధానమనియుఁ బరిగణింపదు. పరాత్పరుఁడా విశేష మునకనేకములగు గుణములచే మించియున్నాడని ప్రతిభక్తుడును దలంచుచునేయుండును. సాకారమందును నిరాకారమందును విశేషమందును నిర్విశేషమందును దీర్ఘమందును హ్రస్వమందును స్థూలమందును సూక్ష్మమందును ధ్యానమునందును దర్శనమందును నెవ్వఁడు సత్యమైయుండెనో యట్టి వానినే హిందూమతము నాల్గుగుణంబులచే సాధించుటకై ప్రబల యత్నములను జేయును. రాజా యిదియే హిందూమత ధర్మవిశేషము.

బాదు — అచ్ఛా! మీకీ యింతా శెల్విస్తుంటే తోకెక్కిరాళ్ళని పూజ చేస్తారెందుకు భాయ్.

నామ — భూవరా! దానియందుండు మహిమల నీ వెఱుంగక యిట్లుఁ బల్కుచుంటివి మీరు నిరాకారముగ నమాజుఁ జేయుదురు. సాకారమును గొల్వరు అప్పుడు సాకారమునందు మీమతము భేదబుద్ధినిఁ జూపుచున్నది హిందూమతము ఇట్టిదిగాదు ఆకారనిరాకారములను నేకబుద్ధినిఁ భావించును. విగ్రహారాధన మొనర్చునపుడా శిలలకు భగవంతుని వ్యక్తిత్వము నారోపించి యన్నిఁటియందును సత్యపదార్థమును భావముతో హిందూమతము పూజించును పరాత్పరుఁడు సకల చరాచరంబులయందు సూక్ష్మరూపమున వర్తిలుచున్నాఁడు అట్టిసూక్ష్మరూపము నన్నిఁటియందుఁ గనుగొనుటకే హిందూమతమువ్వాత ప్రబలయత్నముల నొనర్చుచున్నది ప్రతిజీవమును బరబ్రహ్మ స్వరూపమే శిలయందును బరమాత్మ స్వరూపమునుగలదు ఆ పరమాత్మను గురించియే హిందూమతము పూజలొనర్చును.

నిరాకారమును నిశ్చలచిత్తంబున నందరును గొలువ జాలరు. అది మానసికపూజ మనమునందే పరాత్పరుని స్వరూపమును గాంచుచు నాభావప్రకటితమగు రూపము నందే చిత్తమందరికి లగ్నము గానేరదు. అట్టి చంచల చిత్తములకై యీ విగ్రహారాధన మేర్పడినది. మానసికా రాధనమందుఁ దన యాత్మ నెఱింగినవాఁడే కృతార్థుఁడు గాఁగలవాఁడు. ఆత్మ నెఱుంగక పోయినచో నాత్మరూపమున మెలంగు బరమాత్మ స్వరూపమును గన్గొనఁజాలఁడు. అట్టు లగుటఁ జేసి యెల్లర కనుకూలంబగునట్టుల నొకవస్తువునందు పరబ్రహ్మస్వరూపమును వ్యక్తపరచి యెదుటఁ బ్రత్యక్షభావమున నితఁడే పరాత్పరుఁడని తెల్పుచున్నను సర్వసముండగు వాని కన్నియు నొకటే. భేదమనుమాట యేయుండదు. అన్ని మతములును భగవత్స్వరూపమునకు సమానములే.

పాదు—అచ్ఛాజీ! ఏకే భేదం లేక్ పోతే మా దేవుడ్కి కొల్వ్ భాయి.

నామ—రాజా! నీకింకను సమానబుద్ధి కలుగలేదు. మీకొక దేవుఁడు నాకొక దేవుఁడుగలఁడా? మనకెల్లరకు గలవాఁ డొక్కఁడే. ఆతఁడే పెక్కునామంబులచేతఁ బిలువఁబడుచున్నాఁడు. మీరు "అల్లా" యని పిలచిన మేము "కృష్ణా" యని పిలుతుము. వీనియందు భేదముచ్చారణయందేగాని భగవత్స్వరూపము నందేమాత్రమును లేదు. ఇదియె యెఱుఁగవలసిన పరమరహస్యము. సకలజీవముల కొక్కఁడాయుండే బుద్ధి కుదురుట దుస్తరము. అట్లగుటఁ జేసియే తదనుగుణ్యంబుగ భగవంతుఁడును బెక్కునామంబులను బెక్కు రూపంబులను దాల్చియే నామముచేఁ దన్ను సేవించినను రక్షించుచున్నాఁడు. ఇద్దానికై భేదము నెంచుటేల? నమలయంచంగల తోయము పెక్కుమందిచే హరింపఁబడుచు నాసమయంబుననే పెక్కు

నామంబులచే నయ్యది పిలువఁబడుచున్నది. మీరు 'పానీ' యనిన మేము 'పానీయ'మందుము ఈ రెంటికిని ప్రధానవస్తు వేకస్వరూపమేగదా? అర్థానియందు భేదమున్నచో నప్పుడు భగవంతుఁడేకస్వరూపుఁడని పిలువంబడడు. అదిగాక—

మ. మనుజాధీశ! నదీనదంబులవి యేమార్గంబునం బోయినన్
వనిధిన్ జేరుట లేదె? యంతమున భూభాగంబునం దివ్విధిన్
మనుజుల్ పక్కురు పెక్కునామముల సంభావించినన్ భార్గవీ
శునిఁ జేరన్ దుదకన్నియున్గలసి సంశోధింపఁ దత్త్వంబులన్.

పాదు—భాయీ? నాకీ మీమతం గొప్పతనాన్కి గొప్పనిదర్శనం సూపిస్తావ్.

నామ—రాజా! భగవదేచ్ఛ యటులున్నచోఁ దప్పింపఁగలమా?

పాదు—అచ్ఛా! మీదేవుడ్కి సూస్తాం. ఈసచ్చినమన్సీకి లేపాలె నైతో మతం గితం ఛోడ్‌దేవ్. నీఘానాన్కిగయా. ఏం సెస్తావ్.

నామ—నన్నడుగ నేటికి? అన్నిఁటికి నాపాండురంగడేకలఁడు.

పాదు—సరే లేపు సూస్తామ్.

నామ—(బద్ధాంజలియై) హే పరమపురుషా! ఎంతటివిచిత్రనాటకమున నిల్పితివి. నేఁడుగదా నీభక్తవాత్సల్యమును జూపుట. నాఁడు విప్రకుమారరక్షణార్థమై నీచెలికాఁడు ప్రతినవట్టినఁ బ్రేమనుత్సహించితివి. తండ్రీ! నేఁడు నన్నుఁ బాలింపుము. ఈ మృతుని సజీవునిఁగా నొనర్పుము. నీశక్తిసామర్థ్యముల నీభూనాథుని ప్రమోలఁ బ్రకటించి యాతనికిఁగల యజ్ఞానమును దొలఁగింపుము. ఆతని హృదయమ్మున నిమహిమల నెల కొల్పుము. దేవా! సర్వశక్తి పరిపూర్ణ ప్రభావా!

అనుబంధము ౨౦

సీ. సృష్టింప భేదింప శీలింప నాలింప
మోక్షదాయకమైన మూర్తి యెద్ది?
రంజింప రాణింప రక్షింప శిక్షింప
మూలకారణమైన మూర్తి యెద్ది?
ప్రాపింప దీపింప భావింప భాషింపఁ
బుణ్యప్రదంబైన మూర్తి యెద్ది?
పులకింపఁ దిలకింపఁ బొలియింపఁ బుంజింప
ముంగలియనఁదగు మూర్తి యెద్ది?

గీ. అట్టి నీవిశ్వమూర్తి సహర్నిశంబుఁ
గొలుచుచుండెడు నీభక్తకోటినెల్లఁ
బుత్రప్రేమప్రవాహంబు బొంగిపారలఁ
బ్రోచెదవుకాదె? వనమాలి! పుణ్యశాలి!

(కొంతతడవు ధ్యానించును)

(పాదుషాది కైక) రాజా! ఇదేపనుము.

శా. శ్రీనారాయణ పాదపద్మయుగళీ చింతాసుధాపానమే
నానీతాధ్యవసాయచిత్తమున దుర్వ్యాపారముల్ మాని బ్ర
హ్మానందంబునఁ జేయుచుండుటయె తథ్యంబైన నీవృద్ధుఁడే
ప్రాణాపాయములేక నీయెదుటనే భాషించెడుఁ జూడుమా?

[వృద్ధుఁడుసజీవుఁడై లేచును. అందరు కరతాళములఁ జేయుదురు]

పాదు—(తెల్లబోయి చూచుచు ...)

వృద్ధు—రాజా! నామదేవు సామాన్యుఁడని యెంచకుము. కేవల మాతఁడు పాండురంగ స్వరూపుఁడే. భగవత్ప్రీతుండనై యాతనిఁ బరీక్షించుటకును నీకుండు భిన్నాభిప్రాయము నాతనిచేఁ దొలఁగించుటకును జగంబునఁ బాండురంగని భక్త వాత్సల్యమును జూపుటకును నేనిట్టులొనర్చితి. ఆమహాత్ముని యెదుట మనమల్పులము. భక్తాగ్రణీ! నీవ్రతదీక్షను మెచ్చితిని. నిశ్చలచిత్తమున నిల్చుటయేకదా ధీరలక్షణములఁ జాటినది. కుమారా! నేఁజేసినచర్యనుగూర్చి వింతపడకుము. ఇది యంతయు నాపాండురంగని యాజ్ఞ.

పాదు—(భక్తిభావముతో) సలాం. అచ్ఛాజీ.

(అందరు నమస్కరింతురు)

నామ—(అందరిని లేవదీసి) రాజా! వ్రతానుష్ఠానంబుకై యరుగవలయు. నేడు హరికథాకాలక్షేపమున మెలంగుదము. మంత్రిపుంగవా! రమ్ము.

[నిష్క్రమించును]

[సభముగింపఁబడును]

[తెరవ్రాలును]

3వ రంగము—దేవాలయము—విప్రపురము

(విప్రులందరు శాస్త్రీయముగా వేషమును ధరించవలయును. గ్రామమున నున్న శ్రీవైష్ణవులుగ ... లుగను వేషలమజ్ఞానులుగను నుంచవలయును నామములు ఫాలమున ... తలపాగలను ధరించవలయును గుడిలోనుండి బిక్కుబిక్కులతోగలవి మృదంగము తాళము సుళువు మొదలగు వాద్య సంగీతములతో ... వినబడవలయును.

[తెరనెత్తగాఁ దేవాలయంబున పూజారులు పూజసేయుచుందురు]

వెంక—రామావధాన్లు! మంత్రపుష్పం పూర్తయినదా?

రామ—ఏమాత్రొందర? కొంచెముసేపుఁ దాకిలేవాయేమి?

వెంక—ఎంతసేపోయితేనేమిటి. ఏమిసక్రమముగాఁ జెప్పించావనలేనా? ఏవో రెండుమూడుతలుకూసి ముగించుకోవడానికే. పెద్దబడుగుపని చేస్తా వెందుకు!

రామ—ఏమండోయి! ఉత్సవమునాడన్న సక్రమముగా జరుపవలయునండి. మామూలుదినములందు మన మూర్తుంచుకూసినా భయములేదు.

వెంక—ఇప్పుడుమాత్ర మంతభయమేమివచ్చినదే!

రామ—పదిమందివచ్చినప్పుడైనా కొంచె మాలస్యము చేయకపోతే మనకుబ్బు కాస్త యిప్పుడయ్యలుగాదు. అప్పుడేమనుకుంటారు యేముంది?

వెంక—సరెసరె. ఇంకేభయమా? ఈవెధవలకు మనము చేసే సంగతులేమి తెలియగలవు. కృష్ణశాస్త్రి! అభిషేకము వింతలో నందరికీ నోసంగుము ఇంతలో నాతీసిపనికూడ ముగియును.

రామ—దానియందింకను గొంచెము నీరుపొయ్యండి.

వెంక—అదంతా మాకు నేర్పనక్కరలేదు. నీదేమో నీవు ముగించుకొని ప్రసాదమునుసిద్ధము చేసియుంచుము.

కృష్ణ—రంగని పాదతీర్థమును బుచ్చుకొనుడు.

[అందరికి నక్కడనున్న విప్రులకొసంగుచుండును]

(భజన సేయుచు నామదేవాదులు ప్రవేశింతురు.)

నామ—అయ్యా! సమయమునకువచ్చితిమి. మాకుఁగూడఁ దీర్థము నొసంగుడు.

కృష్ణ—మీరందరెవ్వరు?

నామ—పాండురంగని భక్తులము.

కృష్ణ—ఇక్కడ భక్తులుగానివా రెవరయ్యా! మీవర్ణ మేది?

నామ—వర్ణముతో నిమిత్తమేమి మహాత్మా!

కృష్ణ—చెప్పుటకు వెనుకాడెదవేల? శూద్రవర్ణమా యేమి ?

నామ—అవును.

కృష్ణ—అలా చెప్పుము. (గుడిదిక్కు) ఏమోయి రామావధాన్లు శూద్రభక్తులువచ్చి తీర్థమడుగుచున్నారు.

రామ—[బయటికివచ్చి] ఎవరయ్యా మీరందరు? శూద్రవెధవల కిక్కడఁ దీర్థమునిచ్చువార లెవ్వరును లేరు. ఇది బ్రాహ్మణులకు సంబంధిచిన చోటుగాని శూద్రులు నిలుచుతావుగాదు. అవతలికి వెళ్ళిపొండు.

నామ—స్వామీ! మహాత్ములు మీరలే యిట్లులఁ బల్కినచో మాకు దిక్కెవ్వరు? ఆలయంబునగూడ నిర్ణీతస్థలములుంచెనా? భగవంతుని దృష్టి కందరును సమానులే. అతని సదనంబునఁ గాలూనుటకు మీకొక్కరికే యధికార మొసఁగెనా?

[ప్రవేశము—ఇంకొక బ్రాహ్మణుడు]

రామ—(అతనిఁజూచి] గోపాలమూర్తి! దయచేయుము.

గోపా—[నామదేవాదులఁజూచి] ఇదంతా యేమిటి? ఆలయమంతా శూద్రమయంగా చేసినావే?

రామ—ఎక్కడచచ్చేది? ఇవ్వాళ లేచినవేళ యటువంటిది. ఏమయ్యా! మీరు బయటికిపోండయ్యా! మాకవతలవారి చేతిలో మాటవస్తుంది.

నామ—అయ్యా! మావలన నిబ్బంది యేమికలుగుచున్నది?

వెంక—ఎవళ్ళురామీరు? మాయంటివారిముందర నోరెత్తి నిర్భయముగా మాటలాడుచున్నారు. మేమెవ్వరమో యెఱుఁగుదురా? మామాటకుఁ బాండురంగడే భయపడుచుండ శూద్రసన్యాసులు మీరెంతవారని మాకు నీతి జెప్పెదరు? మర్యాదగా అవతలికేగుడు ఇది బ్రాహ్మణులకేకాని శూద్రులకు నియమింపఁబడిన స్థలముగాదు. నోరుమూసికొని పొండు. లేనిచోఁ జపేటికాప్రదానంబగును

నామ—భూసురోత్తమా! జ్ఞానధురంధరులగు మీరలిట్లు బలుకఁదగునా? మేమాలయంబులోనికి రాలేదే. మీస్వజాతివారలందరికి నొసంగిన యనంతరమే మాకొసంగుడు.

వెంక—ఎంతచెప్పిన బుద్ధిలేదా? రంగని పాదతీర్థ మొక్కబ్రాహ్మణులకేగాని యితరుల కెవ్వరికి నియ్యఁబడదు. వలసినంత తీర్థము మాకోనేటియందుఁగలదు. అచ్చట మీకడుపారఁ ద్రాగుడు.

నామ—అందు మీయాజ్ఞ యేమున్నది స్వామీ!

వెంక—ఏమిటి? ఇంకను మాప్రతాప మెఱుఁగవా యేమి? ఈయాలయంబునఁగల పూరిషడక దగ్గరనుండియు మా యధికారమునకు లోఁబడియున్నవి. ఆకోనేటియందు పాత్రము మీయిచ్చవచ్చినటులఁ దిగి నీరుఁద్రావవత్తురా?

కృష్ణ—[జనాంతికముగా] ఓరీ! వేంకటరామా! ఎక్కువగా మాటలనకుమా? వాండ్లందరొకటిగాఁజేరి మనపనిదున్న. ఈతఁడెవ్వఁడో గొప్ప శాంతస్వభావముగలవాఁడు ఈతని తీరుఁ జూడ భక్తశేఖరుఁడగు వాసుదేవునివలెఁ గన్పడుచున్నాడు. మిగులుగా మాటలు [illegible]. ఈతఁడు తలచినచో

భగవంతునిఁగూడ స్వాధీనము జేసికొనఁగలడు. అందరును మన నోళ్ళకు వెఱచి యూరకుండుటచే మనయాటలు సాగుచున్నవి కాని లేకపోతే గతులున్నవా ?

వెంక—(జనాంతికముగా) నీకేది తెలియదుగాని మాటలాడకు. ఇంత మాత్రపు గుండెతనమే లేకున్న మనపప్పులుడుకునా? ఈ వెధవలవలన మనకుఁ గలుగు భయమేమియును లేదు.

నామ—అయ్యా! తీర్థమునొసంగకున్నచోఁ గొంచెము ప్రసాదమైని యొసంగదరా?

వెంక—(పట్టరాని కోపముతో) నోరు మూయుము. మీకిక్కడఁదీర్థప్రసాదముల నిచ్చుటకెవ్వరును లేరు. ఉండదలచినచో నాలయపు వెనుకభాగమున నుండుడు. [మెడఁబట్టి నెట్టును]

నామ—(శాంతభావముతో) స్వామీ! అంతమాత్రము తావొసంగుటయే మీకు పదివేల నమస్కారములు (భక్తుల దిక్కై) సోదరులారా! మనసిక్ణేత స్థలమున కేగుదము రండు.

ఆలయము — వెనుకభాగము

నామ—భక్తులారా! పాండురంగడు సర్వాంతర్యామి యగుటఁ జేసి యిచ్చోటను నిలచియున్నాడు భజన సేయుడు

అనుబంధము ౨౧

(భక్తులందరు భజనసేయుచుందురు)

(బద్ధాంజలియై) తండ్రీ! పాండురంగా!

శా. భూదేవోత్తములన్నఁ బేర్వడసి నీపూజావిధానంబునం
దేదోవంచనమునన్ నటించుచును దుష్కృత్యంబులన్నిల్పి నీ
పాదద్వంద్వముఁగొల్వనీక యితులన్ బాధింపుచుండంగఁ గృ
ష్ణా! దీనావన! నీకుఁ జెల్లునె? మమున్ రక్షింప రాకుండఁగన్.

మహానుభావా!

గీ. నిరుపమానందలహరిలో వరలునీవు
ప్రబల భీకర గోముఖవ్యాఘ్రములనఁ
బోలు నీయర్చకులమధ్యఁబొదలఁగలవె?
తిరుగుమా! మాదెసకు భవహరణమూర్తి!

(వెంటనే గుడి తిరిగిపోవును)

(పాండురంగనిఁగాంచి పట్టరాని సంతసమున)

ప. జయజయపాండురంగ! నిజగోత్రవసంచయగర్వభంగ! దు
ర్జయభవతాపభంగ! ఖగరాజ తురంగ! శుభాంగ! మానవా
మయవితమఃపతంగ! మునిమానసవారిజమత్తభృంగ! దు
ర్నయపరిశోధనాంగ! సుఘృణామయవార్ధిసుధాంగ! కేశవా!

[భజన సేయుచుండును]

ఆలయము—పార్శ్వస్థానము

వెంక—కృష్ణశాస్త్రి! కొంపమునిగిందే గుడికి గుడియేతిరిగిపోయిందే
కృష్ణ—నేఁజెప్పితే నీవు విన్నావా? అటువంటి భక్తసింహులఁ బరాభ
వించిన భగవంతుఁడూరకొనునా?
వెంక—ఆసోది యిప్పుడెందుకు? ముందిప్పుడు మనము జేయవలసిన
దేమి? తీర్థప్రసాదములన్నియు గుడియందేయున్నవి.
రామ—చేయునదేమున్నది? ముందు నీవుబోయి యామహాత్ముని కాళ్ళ
మీఁదఁబడి క్షమాపణ వేడుకొనుము.
వెంక—నేను బోయి యాశూద్రవెధవను క్షమాపణమడుగుటయే?
కృష్ణ—అంతట నోటినిఁ గట్టిపెట్టుము ఈమాట వాండ్లు విన్నచో
నీవు చెప్పినటుల నిజముగాఁ జెపేటికా ప్రదానముకాఁగలదు.
వెంక—(పట్టుదలతో) నాకాతని కాళ్ళమీఁదఁ బడి యేడువవలసిన
యవసరమేమియును లేదు. నాకిక్కడ పనియేమియును లేదు.

(పోఁబోవును)

అంద—(అడ్డగించి) మాకుఁ బ్రసాదమును బెట్టి మఱి కదలుడు.

వెంక—నాయొద్దనుండినగదా మీకుఁ బెట్టుట. పోయి యాతనినే యడుగుడు.

అంద—(లేచి నిలువఁబడి) అడుగుటకు మాకేమిపని? ఇదియంతయు జేసినవాఁడవు నీవుగాని మేముగాదు. పెట్టి మఱి కదలుము.

వెంక—(స్వగతము) ఇది నాకుఁ దప్పదు. వీరు వెడలిపోనివ్వరు. ఇంత బ్రతుకుబ్రతికి యింటివెనుకఁ జచ్చెనన్నట్లు ఇంతశాస్త్రవేత్తనై తుదకు శూద్రుని కాళ్ళు పట్టవలసివచ్చెఁగదా? కర్మవిధి యెంతటిది? [ప్రకాశము] అయ్యలారా! అతని యొద్దకేగుదము రండు.

[అందరును వెళ్ళుదురు]

వెంక—(నామదేవుని దగ్గరి) మహాత్మా! నాతప్పు క్షమించి నన్ను మన్నింపుడు. [అని కాళ్ళపైఁబడును]

నామ—(తత్తరముతో లేవఁదీసి) స్వామీ! నాయట్టియజ్ఞానుఁడా మీయట్టివానిని క్షమించుట? నాయపరాధమేదేనియున్నచో క్షమింపుడు.

రామ—మహాత్మా! భగవంతుఁడు కూడని దిక్కుమొగంబైయున్న వాఁడు. యథాస్థితి నొనర్పుడు.

నామ—(భక్తిభావముతో) తండ్రీ! పాండురంగా! భక్తులందఱి కనుకూలంబగు దిక్కుమొగంబుననే యుండుము. నాయొక్కనికై కూడనిదిక్కుమొగంబున నుండుటేల? నేటికిఁగదా నీభక్తవాత్సల్యమహిమ యందఱికిఁ దెలియవచ్చినది? తండ్రీ యథాస్థితిని నుండుము. [విప్రులఁగాంచి] మహాత్ములారా! పూర్వస్థానమున కేగుదము రండు.

(అందరును నరుగుచుండ వారి వెంటనే గుడియుఁ దిరుగుచుండును)

వెంక — అయ్యా! తీర్థప్రసాదముల మీారేయొసంగుడు.

[నామదేవు అచ్చటనున్నవారలకందఱకును తీర్థప్రసాదముల నొసంగుచు విష్ణు సంకీర్తన మొనర్చుచుండును.]

అనుబంధము ౨౮

[భక్తులందరు భజన సేయుచుందురు]

(విప్రులు స్వామికి హారతులొసంగుచుందురు)

[తెర జారును]

మంగళము

మ. హరిపాదాంబుజయుగ్మక స్మరణ నిత్యాసక్తి భద్రాత్ములై
దురితాంభోనిధి నీదుచుఁ సుగుణసందోహస్వదానంద స
త్స్ఫురిత ప్రాభవకీర్తికాములయి సుజ్ఞానప్రదాసంఘులై
ధరణిఁ మానవులుండ్రుగాత! సకలార్థావాప్తి సంధిల్లఁగఁ.

ఇది

శ్రీ గౌతమగోత్ర మప వాదికులాన్వయ హనుమయకుమార సకలసుకవిబుధజనవిధేయ
వేంకటరత్న ప్రణీతంబగు

'భక్తి నామదేవు'

అను నాటకంబునందు సర్వంబును

సంపూర్ణము

ఈనాటకములు వలయువారు :—

☞ పన్నాల సత్యనారాయణ,

తెనాలి, రామలింగేశ్వరపేట

అని వ్రాయవలయును—